



తూర్పువీరాయపాలెం వద్ద పొలాల మధ్యలో మంచంపై కూర్చొని రైతులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం, ఎంపీ మాగుంట, దర్శి ఇన్‌చార్జి లక్ష్మి, ప్రజాప్రతినిధులు, అధికారులు



మహిళా రైతులకు నమూనా చెక్కును అందజేస్తున్న సీఎం

పచ్చని పొలాల్లో.. నారుమళ్ల మధ్య

- వినూత్నంగా రైతులతో సీఎం ముఖాముఖి
- హుషారుగా చంద్రబాబు పర్యటన

దర్శి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన శనివారం జోరుగా హుషారుగా సాగింది. గతానికి భిన్నంగా దర్శిలో ప్రత్యేక స్టయిల్‌లో కొనసాగింది. పచ్చని పొలాల్లో మాగాణి కయ్యలు, నారుమళ్ల మధ్య రైతులతో ముఖాముఖి నిర్వహించారు. తొలుత 11.08 గంటలకు సీఎం హెలికాప్టర్ దర్శి మండలంలోని తూర్పువీరాయపాలెం పొలాల్లో ల్యాండ్ అయింది. 11.18 గంటల వరకు సుమారు పది నిమిషాలు అధికారులు, ప్రజాప్రతినిధులు సీఎంను కలిసి బొకేలు ఇచ్చారు.

మోదీ ప్రసంగం వీక్షణ

తూర్పువీరాయపాలెంలో రైతుల ముఖాముఖి సదస్సు వద్దకు సీఎం చంద్రబాబు 11.23 గంటలకు చేరారు. అక్కడ ఏర్పాటు చేసిన ఎల్ఈడీలలో ప్రధాని నరేంద్రమోదీ పీఎం కిసాన్ పథకం నిధుల విడుదల సందర్భంగా చేసిన ప్రసంగాన్ని సుమారు అర్ధగంట సేపు

మిగతా 6వ పేజీలో



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు

రైతు నేస్తంలా..

బాబు పొలంబాట సక్సెస్

అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినూత్నంగా నిర్వహించిన పొలంబాట కార్యక్రమం సత్ఫలితాన్నిచ్చింది. ఆరంభంలో ఆశ్చర్యశకితులైన ప్రజలు అంతలోనే అర్థం చేసుకుని బెరుకు లేకుండా సీఎంకు సమస్యలు వివరించుకోగలిగారు. అభిమానులు, పార్టీశ్రేణులు ఆయన దగ్గరకు వెళ్లి కరచాలనం చేయగలిగారు. అటు కోట్ల రూపాయల వ్యయం నివారించడంతోపాటు ప్రజలకు సీఎం చేరువయ్యే విధంగా కార్యక్రమం జరగడం విశేషం. అందుకే ప్రజలు, పార్టీశ్రేణుల నుంచి అనూహ్యమైన సమస్యలు, ప్రశ్నలు కూడా ముఖ్యమంత్రికి ఎదురయ్యాయి. అయినా వారికి అడ్డంకులు చెప్పనీయకుండా మాట్లాడే స్వేచ్ఛనిచ్చారు.

- బెరుకు లేకుండా సమస్యలు చెప్పుకున్న ప్రజలు
- సీఎంకు కరచాలనం చేసిన పార్టీ శ్రేణులు
- వీరాయపాలెం సమస్యలకు అక్కడే పరిష్కారం
- దర్శి అభివృద్ధిపై బస్సులో సమీక్ష
- నాలుగు ప్రధాన పనులకు అభయం

(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవం రాష్ట్ర వ్యాప్త కార్యక్రమమైనప్పటికీ నిర్వహణ తీరు స్థానిక ప్రజలను ముఖ్యమంత్రికి చేరువ చేసింది. కార్యక్రమం జరిగిన తూర్పువీరాయపాలెంలో సమస్యలకు పరిష్కారం అక్కడికక్కడే లభించింది. దర్శి అభివృద్ధిపై బస్సులో అక్కడి టీడీపీ ఇన్‌చార్జితో సీఎం సమీక్ష చేయడం, కొన్ని పనుల అమలుకు హామీ ఇవ్వడం విశేషం. వెలిగొండ ప్రాజెక్టు అంశాన్ని బహిరంగంగానే చర్చించిన చంద్రబాబు... వివిధ రకాల పంటలకు గిట్టుబాటు ధరల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించడానికి ప్రాధాన్యం ఇచ్చారు.

పైన ఎండ.. చుట్టూ సాధారణ రైతులు

అనూహ్యంగా శనివారం ఎండ తీవ్రత కనిపించింది. దీంతో కొన్ని గంటలపాటు సీఎం ఎండలో ఉండలేరని జిల్లా అధికారులు టెంట్‌లు వేసేందుకు అనుమతి కోరినా ఫలితం లభించలేదు. ఉదయం 11:20 గంటలకు

మిగతా 6వ పేజీలో



బస్సులో వెళ్తున్న సీఎంను చూసి హుషారుగా విక్టరీ చూపుతున్న ప్రజలు

కోలాహలంగా...

- అన్నదాత సుఖీభవ పథకం నగదు అందజేత
- తూర్పువీరాయపాలెం నుంచి శ్రీకారం చుట్టిన సీఎం
- పాల్గొన్న మంత్రులు అచ్చెన్న, ఆనం, కలెక్టర్ అన్సారియా
- నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల ఆధ్వర్యంలో కార్యక్రమం

ఒంగోలు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్‌లో భాగమైన అన్నదాత సుఖీభవ పథకం శనివారం ప్రారంభమైంది. ఏడాదికి అర్హులైన ఒక్కో రైతు కుటుంబానికి రూ.20వేల వంతున నగదును ఈ పథకం ద్వారా అందిస్తుండగా అందులో పీఎం కిసాన్ పథకం నుంచి కేంద్రం రూ.6వేలు, మిగిలిన రూ.14వేలను రాష్ట్రప్రభుత్వం ఇస్తున్న విషయం విదితమే. అందులో తొలివిడతగా కేంద్రం రూ.2వేలు, రాష్ట్రప్రభుత్వం రూ.5వేలు వెరసి రూ.7వేలను శనివారం

మిగతా 6వ పేజీలో

రైతును రాజును చేస్తా

అదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి అనువైన పంటల ద్వారా లాభాల బాటలో నడిచే విధంగా చైతన్యవంతులను చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దర్శి మండలం తూర్పువీరాయపాలెం గ్రామం వద్ద పచ్చని పొలాల్లో శనివారం ఆయన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రత్యేక శైలిలో సీఎంతోపాటు రైతులు నులక, నవారు మంచాలపై కూర్చునే విధంగా వేదికను ఏర్పాటు చేశారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో భాగంగా రైతుల సమక్షంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. 46,85,838 మంది రైతులకు రూ.3,175 కోట్ల మేర చెక్కును అందజేశారు.

- సూపర్‌సిక్స్ పథకాల అమలు సంతోషాన్నిస్తుంది
- అన్నదాత సుఖీభవతో వారి కళ్లల్లో ఆనందం
- పంటల సాగులో సాంకేతిక పరిజ్ఞానం
- తూర్పువీరాయపాలెం ముఖాముఖిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

దర్శి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రైతును రాజును చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం అమలుతో కర్షకుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామన్నారు. దర్శి మండలం తూర్పువీరాయపాలెంలో శనివారం జరిగిన రైతులతో ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ అమలు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో గత ప్రభుత్వానికి కూటమి పాలనకు మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలు

మిగతా 6వ పేజీలో



సీఎంతో ముఖాముఖికి ఎడ్లబండిపై ఉత్సాహంగా వస్తున్న రైతులు



మహిళా రైతుతో కూరగాయల సాగుపై మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



డబ్బులిస్తేనే గుర్తింపు

ఆరు స్కూళ్లకు రూ.5.50 లక్షలు బేరం

- పాఠశాల విద్య కమిషనర్‌కు ఫిర్యాదు
- ఆయన ఆగ్రహం
- సెలవులో వెళ్లిన ఏడీ-2
- జిల్లా విద్యాశాఖలో కలకలం
- సిబ్బందితో డీఈవో ప్రత్యేక సమావేశం

ఒంగోలు విద్య, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు విషయంలో భారీ మొత్తాలు చేతులు మారుతున్నాయి. అధికారులు లక్షల రూపాయలు డిమాండ్ చేస్తూ యాజమాన్యాలను పీక్కుతింటున్నారు. తాజాగా ఆరు స్కూళ్లకు ప్రభుత్వ గుర్తింపు విషయంలో అధికారుల తీరుపై యాజమాన్యాలు నేరుగా పాఠశాల విద్య కమిషనర్ రామరాజుకు ఫిర్యాదు చేయడంతో విషయం రచ్చకెక్కింది. రెండ్రోజుల క్రితం డీఈవో కమిషనర్ కార్యాలయానికి వెళ్లగా మొదట డైరెక్టర్ పార్వతి ఈ వ్యవహారంపై సీరియస్ అయినట్లు తెలిసింది. ఆతర్వాత రామరాజు కూడా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వెంటనే రంగంలోకి దిగిన డీఈవో చర్యలు చేపట్టడంతో సంబంధిత అధికారి అయిన అసిస్టెంట్ డైరెక్టర్-2 వెంటనే ఆ ఫైల్‌కు ఆన్‌లైన్‌లో ఆమోదముద్ర వేసి

మిగతా 6వ పేజీలో

సమస్యలు పరిష్కరించకపోతే

ఉద్యమం

- ఫ్యాప్టో నాయకుల హెచ్చరిక
- కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు విద్య, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో రాష్ట్రశాఖ పిలుపు మేరకు జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె.ఎర్రయ్య అధ్యక్షత వహించారు. తమ సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించకపోతే ఉద్యమన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని నాయకులు హెచ్చరించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నపాటి మంజుల మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపకపోగా, సమస్యలను కూడా పరిష్కరించడం లేదన్నారు. ఆ విషయంలో గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఏమీ లేదని ఆరోపించారు. ప్రభుత్వ

మిగతా 6వ పేజీలో

86 సొసైటీ పాలకవర్గాల

పదవీకాలం పొడిగింపు

ఒంగోలు విద్య, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 86 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీ) పాలకవర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు. 52 సొసైటీలకు పాలకవర్గాలుగా వ్యవహరిస్తున్న అధికార పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు, 34 సొసైటీలకు పాలకవర్గాలుగా ఉన్న నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీల పదవీ కాలాన్ని జూలై 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 26 వరకు పొడిగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్నికలు జరిగి నూతన పాలకవర్గాలు ఏర్పాటు వరకు లేదా ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఈ కమిటీలు కొనసాగుతాయి.

మూడు నామినేషన్లు తిరస్కరణ



నామినేషన్‌లను పరిశీలిస్తున్న ఆర్వో రవిబాబు

- అందులో సర్పంచ్ పదవిది ఒకటి, వార్డులకు సంబంధించి రెండు
- కొండపి పంచాయతీకి ముగిసిన నామినేషన్ల పరిశీలన
- ఇరు పార్టీల మధ్య కుదిరిన సయోధ్య!
- ఎన్నికలు ఏకగ్రీవమయ్యే అవకాశం

6లో


వేతనం రాలేదని ఆందోళన చేస్తున్న కూలీలు

ఉపాధి కూలీల ఆందోళన

బల్లికురవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తాము ఉపాధి పనులు చేసి రెండు మాసాలు గడుస్తున్నా, ఇంత వరకు నగదు చెల్లింపులు జరగలేదని కూలీలు ఆందోళన చేపట్టారు. ఎస్ఎల్.గుడిపాడు పంచాయతీ శివారు గ్రామం సుజాత నగర్ కాలనీలో రోజు వారీ కూలీలు సుమారు వంద మంది ఫైబడి, మే, జూన్, మాసాల్లో ప్రతి రోజు ఉపాధి పనులకు వెళ్లారు. కాని ఇంత వరకు తమకు కూలి చెల్లింపులు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు రావాల్సిన కూలి నగదు సంగతి ఏమిటని అడిగిన ఎవరు సమాధానం చెప్పడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. కూలి నగదు రాకపోవడంతో తాము ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు వెంటనే స్పందించి తమకు కూలి నగదు చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

చోదకుడు మృతి

మేదరమెట్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మేదరమెట్లలో పాత హైవేలో ప్రైవేట్ బస్సు మోటర్ సైకిలిస్టును ఢీ కొన్న ఘటనలో మోటర్ సైకిలిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం గ్రోత్ సెంటర్ లోని గ్రానైట్ ఫ్యాక్టరీకి ఉద్యోగులను తరలించే బస్సు మోటర్ సైకిల్‌ను ఢీ కొట్టింది. అనమనమూరుకు చెందిన కవల సాంబశివరావు(45) మోటర్ సైకిల్‌పై వెళ్తాండగా కళ్యాణ మండపం ఎదురుగా ప్రైవేట్ బస్సు ఢీ కొంది. ప్రమాదంలో సాంబశివరావు తీవ్రంగా గాయపడి అ క్కడికి అ క్కడే చనిపోయ్యాడు. మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లతో కలిసి గ్రంథాలయం సందర్శన

పాత నేరస్థులకు సీఐ శేషగిరిరావు హితవు

వేటపాలెం (చీరాల), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పాత నేరస్థులు నేరాలకు దూరంగా కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని, ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీజీ మార్గంలో నడవాలని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. శనివారం రౌడీషీటర్లకు ఎస్సై జనార్ధన్‌తో కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. వేటపాలెం లైబ్రరీలో గాంధీజీ వేటపాలెం పర్యటన సమయంలో వదిలి వెళ్లిన చేతి కర్రను ప్రదర్శిస్తూ, ఆ గ్రంథాలయంలో లభించే విలువైన పుస్తకాలపై నేరస్థులకు అవగాహన కల్పించారు. జీవితంలో ప్రతి గంట విలువైనదన్నారు. శిక్షలతో జైళ్లల్లో నలిగి పోవడం బాధాకరమని సూచించారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని హితవు పలికారు. కుటుంబంలో చిన్నారులకు చక్కగా చదివించి ఉన్నతంగా తీర్చి దిద్దాలని కోరారు. వారి వెంట లైబ్రరీయన్ శ్రీవల్లి ఉన్నారు.

పౌష్టికాహారంతోనే చక్కని ఆరోగ్యం

● నియోజకవర్గంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

చీరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా పసిబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఈపూరుపాలెం సూపర్‌వైజర్ ప్రసన్న, అర్బన్ సూపర్‌వైజర్ కవితశ్రీ అన్నారు. సీడీపీవో రూన్సీ సూచనల మేరకు శనివారం నియోజకవర్గం పరిధిలోని ఈపూరుపాలెం, చుక్కయ్యపేట, వాడరేవు, తోటవారిపాలెం, మున్సిపాలిటీ పరిధిలోని పాపరాజుతోట, వెంకటేశ్వరనగర్, ఉసిరికపాలెం ప్రాంతాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తల్లిపాలతో బిడ్డలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈసందర్భంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహనతో పాటు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సత్య వేదం, ఇంద్రాణి, రోజాకుమారి, గ్లోరీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాపు నిర్వహిస్తున్న కళాశాల ప్రతినిధులు

ముగిసిన డ్రోన్ డెవలప్‌మెంట్ యూజింగ్

చీరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న డ్రోన్ డెవలప్‌మెంట్ యూజింగ్ ఏఐపై వర్క్‌షాపు ప్రశాంతంగా ముగిసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. హైదరాబాదుకు చెందిన ఆర్బిన్ స్మార్ట్, ఈపీఐటీ రీసెర్చ్‌ల్యాబ్స్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు శిక్షణతో ఉపయోగకరమని చెప్పారు. ప్రిన్సిపల్ డా.జగదీష్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆధ్యాత్మిక ప్రవచనం

చీరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక పీఠం చీరాల వారి ఆధ్వర్యంలో నేడు ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మబోధ అంశంపై జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు హాజరై మానసిక ప్రశాంతత పొందాలని పీఠం ప్రతినిధులు కోరారు.

పచ్చని పొలాల్లో.. నారుమళ్ల మధ్య

(5వ పేజీ తరువాయి)

వీక్షించారు. 12.23 గంటలకు రైతులతో ముఖాముఖి ప్రారంభించారు. ఈసందర్భంగా ముండ్లమూరు మండలం శంఖరాపురం గ్రామానికి చెందిన అనూష అనే మహిళా రైతు, తూర్పువీరాయిపాలెం గ్రామానికి చెందిన యువరైతు అనిల్‌కుమార్, బొట్లపాలెం గ్రామానికి చెందిన అచ్చిరెడ్డిలకు మాట్లాడే అవకాశం కల్పించారు. అనంతరం రూ.46.85 కోట్ల అన్నదాత సుఖీభవ చెక్కును విడుదల చేశారు. 12.43 గంటలకు సీఎం ప్రసంగాన్ని ప్రారంభించి మధ్యాహ్నం 1.20 గంటల వరకు మాట్లాడారు. సుమారు గంట సేపు సీఎం చంద్రబాబు రైతు సమస్యలపై, దేశ, రాష్ట్ర రాజకీయాల పరిస్థితులపై అనర్గళంగా ప్రసంగించారు. ఆతర్వాత ప్రత్యేక బస్సులోకి వెళ్లారు. 2.05 గంటల వరకు వేదిక వద్దే బస్సులో నాయకులతో మాట్లాడుతూ గడిపారు. అక్కడ నుంచి 2.10 గంటలకు హెలిప్యాడ్ స్థలానికి చేరుకొని తిరిగి వెళ్లారు.

మండుటెండలో సైతం..

సీఎం చంద్రబాబు పర్యటనకు మండుటెండలో సైతం రైతులు, మహిళా రైతులు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చారు. రైతుల సదస్సుకు తొలుత కేవలం పాస్‌లు ఉన్న మాత్రమే అనుమతిచ్చారు. సీఎం సభావేదిక వద్దకు వచ్చే సమయంలో రోడ్లపై ప్రజలు, మహిళలు బారులుతీరి స్వాగతం పలికారు. యువతీ యువకులు విక్టరీలు చూపుతూ కేరింతలు కొట్టారు. రెండేళ్ల చిన్నారులను సైతం తల్లిదండ్రులు సీఎం చంద్రబాబును చూపించాలనే ఉద్దేశంతో అక్కడకు తెచ్చి భుజాలపై ఎక్కించుకొని చూపించారు. ప్రజల చూపిన ఉత్సాహన్ని చూసి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. మునిముసి నవ్వులు నవ్వుతూ ప్రజలకు అభివాదం చేస్తూ కొన్ని సందర్భాల్లో విక్టరీ చూపుతూ సుమారు మూడు కిలోమీటర్ల దూరం హెలిప్యాడ్ నుంచి రైతులతో ముఖాముఖి సదస్సు వద్దకు చేరుకున్నారు. ఒక వైపు సజ్జ చేను, మరోవైపు దమ్ము చేసిన మాగాణి, ఇంకోవైపు వరినాట్లు వేస్తున్న మాగాణి మధ్యలో రైతుల ముఖాముఖి సదస్సు ప్రత్యేక స్టయిల్‌లో సాగింది. కార్యక్రమం జరుగుతున్నంత సేపు మండుటెండను సైతం లెక్కచేయక మహిళలు, చిన్నారులు ఎంతో శ్రద్ధగా సీఎం ప్రసంగాన్ని విన్నారు. యువత అనేక సందర్భాల్లో విక్టరీ చూపుతూ కేరింతలు కొట్టారు. చంద్రబాబు పర్యటన సూపర్ సక్సెస్ కావడంతో నాయకులు, అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

వసతిగృహంలో బాలిక జుత్తు కత్తిరింపు

చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్లో దురాగతం

తోటివారే చేశారంటున్న బాధితురాలు

హాస్టల్లో సంక్షేమశాఖ డీడీ విచారణ

చీమకుర్తి,ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి ఎస్సీ బాలికల వసతిగృహంలో దురాగతం చోటుచేసుకుంది.శుక్రవారం అర్ధరాత్రి హాస్టల్లో అందరితో కలిసి బాలిక నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియనివారు జుత్తు కత్తిరించారు.తెల్లారి నిద్రలేచి బయోమెట్రిక్ హాజరు వేసే నిమిత్తం వస్తున్న సమయంలో తన జుత్తు ఎవరో కత్తిరించారన్న విషయాన్ని బాధిత బాలిక గుర్తించింది.జుత్తును కత్తిరించి క్లిప్‌లు పెట్టిన వైనాన్ని వార్డెన్ అరుణ దృష్టికి బాలిక తీసుకెళ్లింది.దీనిపై వసతిగృహంలో వార్డెన్ విచారించగా సంఘటనకు పాల్పడిన వారు ఎవరో తేలలేదు.వెంటనే సంఘటన గురించి జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి వార్డెన్ తీసుకెళ్లారు.ఈలోపు ఈ సంఘటన మీడియాలో గుప్పుమనటంతో రాజకీయరంగు పులుముకొంది. ఆ సమయంలో చీమకుర్తిలోనే ఉన్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున,వైసీపీ నాయకులతో కలిసి హాస్టల్‌ని సందర్శించి బాధిత బాలికను పరామర్శించి సంఘటన గురించి తెలుసుకున్నారు.తన తోటి బాలికలే ఈపనికి పాల్పడి ఉంటారని ఆ బాలిక నాయకులకు తెలిపింది.తదుపరి మీడియాతో మాట్లాడిన నాగార్జున ప్రస్తుత మంత్రి,ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేయటం గమనార్హం.


బాలికలను విచారిస్తున్న సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్

డీడీ లక్ష్మానాయక్ విచారణ

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆదేశాల మేరకు డీడీ లక్ష్మానాయక్ శనివారం వసతిగృహానికి విచ్చేసి సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపారు.బాధిత బాలికను పరామర్శించి ధైర్యం చెప్పారు.సహ బాలికలను సంఘటనపై అడిగి తెలుసుకున్నారు.తదుపరి జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన సంఘటన గురించి వివరించారు.అర్ధరాత్రి అందరూ నిద్రించేవేళ బాలిక జుత్తును కత్తిరించారన్నారు.ఈ సంఘటనలో బయటి వ్యక్తుల ప్రమేయంకు ఆస్కారమే లేదని తన విచారణలో తేలిందన్నారు. రెండురోజుల క్రితం హాస్టల్లో ఉన్న బాలికల మధ్య పుస్తకాల విషయంలో జరిగిన చిన్నపాటి గొడవతో ఈ సంఘటన జరిగి ఉంటుందేమో అని బాధిత బాలిక తన దృష్టికి తీసుకువచ్చిందన్నారు. వసతిగృహంలో బాలికల భద్రతకు ఎటువంటి డోకా లేదన్నారు.బయటి వ్యక్తులు హాస్టల్‌లోకి వచ్చే పరిస్థితులులేవన్నారు. అందరి బాలికల భద్రతకు తాము భరోసా ఇస్తున్నామన్నారు.

రైతు నేస్తంలా..

(5వ పేజీ తరువాయి)

వీరాయపాలెం పొలంలోకి చంద్రబాబు వచ్చిన సమయానికి ఎండ తీవ్రత ఉంది. కార్యక్రమంలో పాల్గొన్న చాలామంది నాయకులు, రైతులు తలపై కండువాలు కప్పుకోక తప్పలేదు. అనుక్షణం చెమటను తుడుచుకుంటూ ఇబ్బందిపడటం కనిపించింది. కానీ చంద్రబాబునాయుడు రమారమీ రెండు గంటల సమయం ఆ ఎండలో ఉన్నా ఇబ్బందిపడటం కానీ, చెమటకు చిరాకుపడటం కానీ కనిపించలేదు. కాసేపు తన పక్కన ఎంపీ మాగుంట, దర్శి టీడీపీ ఇన్‌చార్జీ లక్ష్మిని కూర్చోబెట్టుకున్న తదంతర కార్యక్రమానికి వచ్చిన సాధారణ మహిళ వ్యక్తులను పక్కన కూర్చోబెట్టుకుని కార్యక్రమం నిర్వహించారు. ఎండకు కొంతమంది నాయకులు, అధికారులైతే పక్కకు వెళ్లి సేదతీరడం కనిపించింది, కానీ చంద్రబాబు మాత్రం ప్రసంగించే సమయంలో కానీ రైతులతో ముఖాముఖి మాట్లాడే సమయంలో కానీ ఎలాంటి ఇబ్బందిని ప్రదర్శించకపోవడం విశేషం. అలా సీఎం సాధారణ వ్యక్తిలా మారిపోవడంతో ధైర్యం తెచ్చుకున్న ప్రజలు పోటీపడి వారి సమస్యలను వివరించగలిగారు. సహజంగా ఇలాంటి కార్యక్రమాల్లో అధికారులు ఎంపిక చేసిన ముగ్గురు లేక నలుగురు మాట్లాడతారు. అలా ఎంపిక చేసిన రైతులను పక్కనపెడుతు ఆ ముగ్గురే కాకుండా కార్యక్రమంలోనే ఆ తరువాత తన వాహనం వరకు నడిచి వెళ్లే చంద్రబాబు దృష్టికి పలువురు తమ సమస్యలు తీసుకువెళ్లగలిగారు. కార్యక్రమం జరిగిన తూర్పువీరాయపాలెం సమస్యలపై గొట్టిపాటి లక్ష్మి ఒక నివేదిక ఇచ్చినప్పటికీ, అక్కడకు వచ్చిన గ్రామస్థులు అనేక సమస్యలను ప్రస్తావించారు. గ్రామంలో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, ఒక లింకు రోడ్డు నిర్మాణంతోపాటు అక్కడిక్కడే ఆదేశాలిచ్చిన చంద్రబాబు 93మందికి పక్కాగృహాలను మంజూరు చేశారు. తూర్పు వీరాయపాలెం నుంచి సామంతిపూడి వరకు రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక ఆదేశాలు ఇవ్వడం విశేషం,

సమస్యలను విని ఆప్యాయంగా పలకరించి..

కార్యక్రమం నిర్వహణ అనంతరం తన వాహనం వరకు ఆయన నడిచి వెళ్లేటప్పుడు ఎదురొచ్చిన పార్టీశ్రేణులు అభిమానుల నుంచి కూడా ఆయన వినతిపత్రాలు తీసుకున్నారు. ఒక టీడీపీ నాయకుడు గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థికంగా చితికిపోయిన విషయాన్ని ధైర్యంగా వివరించగలిగితే ఆప్యాయంగా వారి సమస్యలను విని ఓర్పుగా సమాధానాలు ఇవ్వడం ఆకట్టుకుంది. ఒక సామాన్య కుటుంబ సభ్యులంతా నడిచి వచ్చి వారి భూ సమస్య అపరిష్కృతంగా ఉన్నట్లు వివరించగా కలెక్టర్‌ను పిలిచి పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. ఆ తరువాత ఆ అర్జీదారులు సీఎం పొలంబాట రాబట్టే మా సమస్య చెప్పుకునే అదృష్టం వచ్చిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

దర్శి సమస్యలపై సమీక్ష

అమరావతిలో ముఖ్యమైన సమావేశానికి వెళ్లేందుకుగానూ స్థానికంగా కొన్ని కార్యక్రమాలు రద్దు చేసుకున్న చంద్రబాబునాయుడు స్థానిక అంశాలను పక్కనపెట్టకుండా దర్శి నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేకంగా సమీక్ష చేయడం విశేషం. కార్యక్రమం ఆది నుంచి హెలిప్యాడ్‌లో వెళ్లే వరకు దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఆమె భర్త లలిత్‌సాగర్‌తో దర్శి సమస్యలపై మాట్లాడారు. సుమారు 10 శాశ్వత అభివృద్ధి పనుల గురించి వినతిపత్రాన్ని వారు ముఖ్యమంత్రికి అందజేశారు. వాటిపై డా.లక్ష్మి వివరణ ఇచ్చిన తరువాత కొన్ని పనులను పూర్తి చేద్దామని హామీ ఇచ్చారు. పక్కనే ఉన్నా సీఎంవో అధికారికి ఇందులో కనీస నాలుగు అభివృద్ధి పనులు వెంటనే పూర్తిచేయాలంటూ అందుకు సంబంధించిన ఆదేశాలు జారీచేశారు, కోల్డేజీ నిర్మాణం, మన్నేపల్లి, బోధనం పాడు, రామాపురంలో కొత్త ఎత్తిపోతల పథకం నిర్మాణం, మారెళ్ల ఎత్తిపోతల పథకం మరమ్మతులకు నిధులు ఇవ్వడంతో పాటు సాగర్ కాలువ ఆధునీకరణకు మరిన్ని నిధులు ఇవ్వాలని లక్ష్మి అయన్ని కోరారు.

గత టీడీపీ ప్రభుత్వం చేపట్టి వైసీపీ నిలిపివేసిన అభివృద్ధి పనులను ప్రత్యేకంగా ప్రస్తావిస్తు డ్రైవింగ్ స్కూల్ నిర్మాణం. సోలార్ విద్యుత్ ప్రాజెక్టు, డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణాల నిధులు, బస్ డిపో నిర్మాణం, తెన్నేటి మంచినీటి పథకం మరమ్మతులు నిధులతోపాటు, దొనకొండ, దర్శి, పసుపుగల్లు, ఈదరల మధ్య రహదారి నిర్మాణం కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆ అంశాలపై వారు లక్ష్మి ఇచ్చిన వివరణ అనంతరం ఇందులో డ్రైవింగ్ స్కూల్‌తోపాటు మూడు, నాలుగు పనులు ముందుగా పూర్తిచేద్దామని అంటూ అవసరమైతే చర్యలు తీసుకోవాలని సీఎంవోకు ఆదేశాలిచ్చారు.

ఇలా సీఎం చంద్రబాబునాయుడు ఉన్నంత సమయంలో ప్రజలతో మమేకమయ్యేందుకు స్థానిక సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కారించేందుకు ప్రత్యేక ప్రాధాన్య తనిస్తూ హంగు ఆర్భాటాలు లేకుండా అనవసరపు వ్యయాన్ని నివారిస్తు నిర్వహించిన తూర్పు వీరాయపాలెం కార్యక్రమం సత్ఫలితాన్నిచినట్లు చెప్పుకోవచ్చు.

రైతును రాజును చేస్తా

(5వ పేజీ తరువాయి)

గుర్తించాలన్నారు. నాగలి పట్టిన రైతన్న బాగుండాలన్నదే తమ లక్ష్యమని, తాను ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నానని చెప్పారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలులో సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. ఎవరికైనా డబ్బులు పడకపోతే ఆ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని చెప్పారు.

15 నుంచి మహిళలకు ఉచిత బస్సు

ఎన్నికల హామీల్లో భాగంగా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఈనెల 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. మహిళలకు పెద్దన్నగా ఎన్నో పథకాలు ఆరంభించి అమలు చేశానన్నారు. మహిళల కోసం డ్వాక్రా సంఘాల ఏర్పాటు, దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్ల పంపిణీని దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రప్రథమంగా తామే అమలు చేశామన్నారు. తల్లికి వందనం పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయడంతో మహిళల్లో ఆనందం చూశామన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పి కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అమలు చేసిందని విమర్శించారు. తాను ఇచ్చిన మాట ప్రకారం కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి పథకాన్ని అమలు చేశానన్నారు. కొన్ని కుటుంబాల్లో అత్యధికంగా ఎనిమిది మందికి కూడా తల్లికి వందనం ద్వారా లబ్ధి చేకూరడం సంతోషకరమన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాం

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చంద్రబాబు చెప్పారు. రూ.273 కోట్లతో పొగాకును కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామన్నారు. చిత్తూరులో మామిడి రైతులకు టన్నుకు రూ.4వేలు చొప్పున ప్రోత్సాహం అందించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 48గంటల్లోనే రైతులకు డబ్బులు అందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

2027 నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు తెలిపారు. 1996లో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని తానే ఆరంభించానని, వచ్చే సీజన్ నాటికి మొదటి దశ పూర్తిచేసి కృష్ణా జలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సాగునీటి సమస్య తలెత్తకుండా ఎత్తిపోతల పథకాలను అభివృద్ధి చేస్తామన్నారు.


రిజర్వాయర్లు కళకళలాడటం ఆనందదాయకం

ముందుచూపుతో అన్ని రిజర్వాయర్లకు నీరు వదలడంతో 700 టీఎంసీల నిల్వలతో కళకళలాడుతున్నాయని సీఎం చంద్రబాబు చెప్పారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, కాటన్ బ్యారేజ్, ప్రకాశం బ్యారేజ్, సోమశిల ప్రాజెక్టులలో నీరు సమృద్ధిగా ఉందన్నారు. భవిష్యత్తులో తాగు, సాగునీటి సమస్య తలెత్తకుండా నదుల అనుసంధానం చేస్తామన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 2014 నుంచి 2019 వరకు సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చుచేయగా గత వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.12వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. ఉచిత బీమా పథకాన్ని గత పాలకులు నాశనం చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి పునరుద్ధరించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, రాష్ట్ర వ్యవసాయ మిషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, జేసీ గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పాల్గొన్నారు.

శింగరకొండ దేవస్థాన ట్రస్టీల నియామకం

అద్దంకి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ట్రస్టీలను నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు ఇచ్చారు. ట్రస్టీలుగా గుంజి శ్రీనివాసరావు, మంగమూరి సురేష్, దాసరి రామాంజనే యులు, రుద్రు ఆదిలక్ష్మి, కొడిమెల కోటేశ్వ రమ్మ, చీమలదిన్నె వెంకటరమణ, కస్తూరి లక్ష్మీప్రసూన, బత్తుల సరిత, అద్దంకి ఆదిలక్ష్మి లతో పాటు ఎక్స్‌అఫీసియో సభ్యులుగా భాగవతుల నరసింహాచార్యులను నియమి స్తూ ఉత్తర్వులు ఇ చ్చారు. వీరిలో గుంజి శ్రీనివాస రావును చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు.


ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు


లక్ష్మీనరశింహస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

భక్తుల కోలాహలం

అద్దంకి : శింగర కొండకు శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గొర్రెల కాపరులు తమ గొర్రెల మంద లతో వచ్చి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కు లు తీర్చుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆకు పూజలు, వాహన పూజలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

న్యాయాధికారి పూజలు

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి, లక్ష్మీ నరశింహస్వామి దేవాలయాలలో శనివారం అద్దంకి సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మూడు నామినేషన్ల తిరస్కరణ

● అందులో సర్పంచ్ పదవిది ఒకటి, వార్డులకు సంబంధించి రెండు

కొండపి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కొండపి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి దాఖలైన నామినేషన్‌లలో ఒకటి, వార్డు పదవులకు సంబంధించి వచ్చిన వాటిలో రెండింటిని అధికారులు తిరస్కరించారు. ఆర్వో జె.రవిబాబు శనివారం నామినేషన్లను పరిశీలించారు. సర్పంచ్ పదవికి 15, వార్డు పదవులకు 39 దాఖలైన విషయం విదితమే. వీటిలో సర్పంచ్ పదవికి వై.వసంత వేసిన నామినేషన్‌ను తిరస్కరించారు. 9వ వార్డు నుంచి పోటీ చేసిన గొట్టిపాటి మురళి నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో ఈవార్డులో టీడీపీ మద్దతుతో నామినేషన్ వేసిన కూనంనేని వాసంతి ఒక్కరే బరిలో ఉండటంతో ఆమె ఏకగ్రీవం అవడం లాంఛనమే కానుంది. ఆరవ వార్డుకు సంబంధించి బూదవాటి సుజాత వేసిన నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఆర్వో తెలిపారు.

టీడీపీకి సర్పంచ్, ఉపసర్పంచ్, 9 వార్డులు

కొండపి గ్రామ పంచాయతీలో పోలింగ్ ప్రక్రియకు దాదాపు తెరపడినట్లే కనిపిస్తోంది. అధికార టీడీపీకి సర్పంచ్ పదవితోపాటు 9 వార్డులు, ఉపసర్పంచ్ పదవి ఇచ్చేవిధంగా, వైసీపీకి 2, 5, 10, 11, 13 వార్డులు మొత్తం 5 ఇచ్చేవిధంగా ఇరుపార్టీల మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో ఆయా పార్టీల మద్దతుతో ఇప్పటికే నామినేషన్లు వేసిన వారి వద్ద నుంచి ఉపసంహరణ పత్రాలు కూడా నాయకులు తీసుకున్నట్లు సమాచారం. సర్పంచ్ పదవికి వైసీపీ మద్దతుతో రెండు నామినేషన్లు మాత్రమే వేశారు. మిగతా వాటిలో దాదాపు 8 వరకు టీడీపీ మద్దతుదారులు ఉన్నారు. మరో నలుగురైదుగురు వ్యక్తిగతంగా నామినేషన్లు వేశారు. టీడీపీ నాయకులు నేడో, రేపో సర్పంచ్ అభ్యర్థిని నిర్ణయించే అవకాశం ఉందంటున్నారు. ఆతర్వాత మిగతా వారు నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం ఉంది. వైసీపీ అభ్యర్థులు కూడా ఉపసంహరణకు సిద్ధంగా ఉన్నారు. వ్యక్తిగతంగా నామినేషన్లు వేసిన మరికొద్ది మంది సైతం తప్పుకునే అవకాశం ఉంది. వారిలో ఒకరిద్దరు బరిలో ఉండి పోలింగ్ జరిగినా పోటీ నామమాత్రమేనని భావిస్తున్నారు.

డబ్బులిస్తేనే గుర్తింపు

(5వ పేజీ తరువాయి)

సెలవు పెట్టి వెళ్లిపోయారు. ఈవ్యవహారం జిల్లా విద్యాశాఖలో సంచలనం సృష్టించింది. విద్యాశాఖలో ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వ ప్రారంభ అనుమతి, గుర్తింపు వ్యవహారం మొత్తం ఈ-ఫైల్(ఆన్‌లైన్) ద్వారానే జరుగుతుంది. మండల స్థాయిలో ఎంఈవో నుంచి నేరుగా సంబంధిత అసిస్టెంట్ డైరెక్టర్ (డీఈవో కార్యాలయం)కు, తర్వాత డీఈవోకు అది చేరుతుంది. ఆ ఫైల్‌పై వారు ఆమోదముద్ర వేస్తే సరిపోతుంది. కొత్త విధానంలో డీఈవో కార్యాలయంలోని సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్, గుమస్తాలకు సంబంధం ఉండదు. తర్వాత ఎప్పుడో ఫిజికల్ ఫైల్ ఎంఈవో నుంచి డీఈవో కార్యాలయానికి వస్తోంది. అప్పటికే అంతా అయిపోతోంది. ఈ వ్యవహారంలో శుక్రవారం డీఈవో కార్యాలయంలో హైడ్రామా నడిచింది. ఆరు పాఠశాలలకు సంబంధించి ఒక ఫైల్ 15 రోజుల క్రితం డీఈవో కార్యాలయంలోని ఏడీ-2 లాగిన్‌కు వచ్చింది. అయితే ఆయన దానిని పట్టించుకోలేదు. ఇటీవల ఆ పాఠశాల యాజమాన్యాలు వచ్చాయి. నేరుగా ఏడీ-2తో సంప్రదింపులు చేశాయి. ఫైళ్లకు ఆమోదముద్ర వేసేందుకు రూ.5.50 లక్షలకు బేరం కుదిరినట్లు సమాచారం. అనంతరం స్కూళ్ల గుర్తింపునకు డీఈవో కార్యాలయంలో రూ.5.5లక్షలు డిమాండ్ చేస్తున్నారని యాజమాన్యాలు పాఠశాల విద్య కమిషనర్‌కు ఫిర్యాదు చేశాయి. సీరియస్‌గా తీసుకున్న ఆయన డీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రంగంలోకి డీఈవో.. సెలవులో వెళ్లిన ఏడీ-2

డీఈవో కిరణ్‌కుమార్ వెంటనే రంగంలోకి దిగారు. శుక్రవారం సంబంధిత సిబ్బంది, ఏడీ-2ను వాకబు చేయగా ఆ ఫైల్ 15 రోజుల క్రితమే ఏడీ-2 లాగిన్‌కు వచ్చినట్లు తేలింది. ఈవిషయంపై డీఈవో మండిపడటంతో ఏడీ-2 తన లాగిన్‌లో ఆఫైల్‌కు ఆమోదముద్ర తెలిపి వెంటనే సెలవుపై వెళ్లిపోయారు. ఆతర్వాత డీఈవో స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రూ.5.5 లక్షలు ఎవరు డిమాండ్ చేశారని ప్రశ్నించారు. సిబ్బంది తమకు తెలియదని ఫిజికల్ ఫైల్ ఇంకా ఇవ్వలేదని చెప్పడంతో శాంతించారు. ఇలాంటి వ్యవహారాలు ఆఫీసు పరువు తీస్తాయని, విషయం కమిషనర్ దృష్టికి కూడా వెళ్లిందన్న ఆయన అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కమిషనర్ ఆగ్రహంతో ఆరు పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు ఉత్తర్వులు ఆగమేఘాలమీద జారీ అయ్యాయి.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

(5వ పేజీ తరువాయి)

పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలను సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు బి.వెంగళరెడ్డి మాట్లాడుతూ అన్ని వ్యాధులకు అన్ని ఆస్పత్రులలో మెరుగైన వైద్యం లభించేలా హెల్త్‌కార్డులను వినియోగంలోకి తేవాలన్నారు. ఎంఈవోల సంఘ రాష్ట్ర నాయకుడు బి.కిషోర్‌బాబు మాట్లాడుతూ ఎంఈవో పోస్టుల భర్తీలో, ఇన్‌చార్జిలు ఇచ్చే క్రమంలో జీవో నంబరు 73 ప్రకారం ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన తీసుకోవాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇచ్చిన 53 జీవోను అమలు చేస్తూ 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వెంటనే పీఆర్సీ కమిషన్ నియమించి 3 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఎలు మంజూరు చేయాలని, గత పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, పీ4 కార్యక్రమం నుంచి టీచర్లను మినహాయించాలని కోరారు. హైస్కూలు ప్లస్‌లకు టీచర్లను కేటాయించాలని, టీచర్లకు బోధనేతర పనులను అప్పగించరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు డి.వీరాంజనేయులు, డి.శ్రీనివాసులు, ఎస్‌కేఎండి రఫీ, బి. వెంకట్రావు, పి.వెంకట్రావు, ఎస్.రవి, చల్లా శ్రీనివాసులు, ఎంఈవో నాగేంద్రవదన్, సుబ్బారావు, చిన్నస్వామి, మామహేశ్వరి, తిరుపతి, బషీరా ఉన్నారు.

కోలాహలంగా..

(5వ పేజీ తరువాయి)

అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నిధులను రైతు ఖాతాల్లో జమచేసే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా నుంచే శ్రీకారం చుట్టారు. దర్శి నియోజకవర్గం తూర్పువీరాయపాలెం నుంచి దీనిని ప్రారంభించి రాష్ట్రంలో రూ.46.86లక్షల మందికి రూ.3,174.42కోట్ల నగదు పంపిణీకి సంబంధించిన మెగా చెక్‌ను మహిళా రైతులకు అందజేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకమైన ఈ పథకం అమలును రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ప్రజాప్రతినిధులు ప్రారంభించేలా ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా జిల్లావ్యాప్తంగా శనివారం ఉదయం కోలాహలంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 2.68లక్షల మందికి రూ.182.74 కోట్లు తొలివిడత జిల్లాకు మంజూరు కాగా ఆ నిధులను ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, అధికారపార్టీ నేతల సమక్షంలో అధికారులు విడుదల చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో తాను ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న విశాఖ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి పాల్గొన్నారు. ఆయన ప్రాతినిధ్యం వహించే కొండపి నియోజకవర్గంలోని బిట్రగుంటలో జరిగిన సభలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ పాల్గొని పంపిణీ చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మండల కేంద్రమైన కొత్తపట్నంలో జరిగిన సభలో నిధులు విడుదల చేశారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ చీమకుర్తిలో జరిగిన సభలో, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి పట్టణంలో, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అక్కడి మార్కెట్ కమిటీ వద్ద జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నికరంపల్లిలో, వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జీ గుదూరి ఎరిక్షన్‌బాబు అమనిగుడిపాడులో పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల్లో స్థానిక నాయకులు పాల్గొని నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల సభలు, సమావేశాలను నిర్వహించారు.

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

చీరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చీరాల - స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. మృతుని వద్ద ఎటువంటి ఆనవాళ్లు లేవు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.


సీఎంకు విక్టరీ సంకేతం చూపుతు ఉత్సాహం ప్రదర్శిస్తున్న ప్రజలు

సీఎం సభలో హైలెట్స్

దర్శి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు హెలిప్యాడ్ నుంచిప్రత్యేక బస్సులో మూడు కిలోమీటర్లు దూరంలో ఏర్పాటుచేసిన రైతుల ముఖాముఖి వేదిక వద్దకు చేరుకునే సమయంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ప్రజలు బారులు తీరి జైకొట్టారు

● యువతీ,యువకులు ఆనందంతో విక్టరీలు చూపుతూ కేరింతలు కొట్టారు.

● పోలీసులు రైతులవలే మఫ్టీ వేషాలు వేసి రైతుల మధ్యలో కూర్చొని పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.

● పొలాల్లో పనులు చేసుకునే రైతులు కూడా పనులు ఆపుకొని సీఎంను చూసేందుకు తరలివచ్చారు. - రైతులు ముఖాముఖి వేదికను పచ్చని పొలాల మధ్య ఏర్పాటుచేశారు.

● వేదిక వద్ద సీఎం చంద్రబాబు అధికారులతో పాటు రైతులు కూర్చొనేందుకు గతంలో ఎన్నడూలేని విధంగా ప్రత్యేకంగా మంచాలు ఏర్పాటుచేశారు.

● మండుటెండలో గంటల తరబడి మహిళలు, వృద్ధులు, చిన్నారులు సీఎం చంద్రబాబు పర్యటనను తిలకించారు. ప్రసంగాన్ని శ్రద్ధ విన్నారు.

సీఎం చంద్రబాబు పర్యటన సాగిందిలా..

దర్శి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు దర్శి మండలం తూర్పువీరాయపాలెం పర్యటన విజయవంతంగా ముగిసింది. ఆయన అనుకున్న సమయానికి ఇక్కడకు చేరుకున్నారు. ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో ఇక్కడ ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు ఉదయం 11.08 గంటలకు చేరుకున్నారు.

11.08 నుంచి 11.18 గంటల వరకు అధికారులు, ప్రజాప్రతినిదులు కలిసి అభినందనలు తెలిపారు.

11.18 గంటలకు హెలిప్యాడ్ నుంచి వీరాయపాలెం వద్ద ఏర్పాటు చేసిన రైతుల ముఖాముఖి కార్యక్రమానికి ప్రత్యేక బస్సులో బయలు దేరారు. బస్సులో చంద్రబాబు పక్కన అచ్చెనాయుడు కూర్చోగా ఆయనను ప్రక్కకు పంపి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని కూర్చో బెట్టారు.


సీఎం చంద్రబాబుకు మొక్కను అందించి స్వాగతం పలుకుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దంపతులు

11.29కి రైతుల ముఖాముఖి కార్యక్రమం వేదిక వద్దకు చేరుకున్నారు.

11.30 నుంచి ఎల్ఈడీ స్క్రీన్ వద్ద ప్రధాని నరేంద్రమోడి ప్రసంగాన్ని వినేందుకు కూర్చున్నారు.

12.20 వరకు పీఎం ప్రసంగాన్ని విన్నారు. ఆతర్వాత వేదిక వద్దకు చేరుకొని అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభించి చెక్కులను పంపిణీ చేశారు.

12.25 గంటలకు రైతులతో ముఖాముఖి కార్యక్రమం ప్రారంభించారు.

12.42 వరకు రైతులతో ముఖాముఖి కార్యక్రమం కొనసాగింది

12.43కు సీఎం తన ప్రసంగాన్ని ప్రారంభించి మధ్యాహ్నం 1.25 గంటల వరకు ప్రసంగించారు.

అనంతరం ప్రత్యేక బస్సులోకి చేరుకొని సుమారు 45 నిమిషాలు నాయకులతో మాట్లాడారు.

2.05కు ముఖాముఖి వేదిక నుంచి ప్రత్యేక బస్సులో హెలిప్యాడ్‌కు బయలుదేరారు

2.10కి హెలిప్యాడ్ స్థలానికి చేరుకున్నారు.

2.13కు హెలికాప్టర్ ఎక్కారు.

2.18 గంటలకు హెలికాప్టర్ టేకాప్ అయింది.



మహిళల అభ్యున్నతికి ఎంతో చేశారు

● అనూష, మహిళా రైతు

దర్శి, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ఎన్నో పథకాలు అమలు చేశారని ముండ్లమూరు మండలం, శంఖరాపురం గ్రామానికి చెందిన మహిళా రైతు అనూష ఆనందం వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు సందర్భంగా దర్శి మండలం, తూర్పువీరాయపాలెం వద్ద నిర్వహించిన రైతులతో ముఖాముఖీ కార్యక్రమంలో మొట్టమొదట మాట్లాడే అవకాశం ఆమెకు లభించింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం మీ చేతుల మీదుగా అందుకోవటం ఆనందంగా ఉందని చెప్పింది. సీఎం చంద్రబాబు స్పందిస్తూ మీరు ఎలాంటి వ్యవసాయం చేస్తున్నారని అడిగారు. తాము ప్రకృతి వ్యవసాయం చేస్తున్నామని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నాణ్యమైన ఉత్పత్తులను అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. అందుకు సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమి పథకాలు అమలు జరిగాయో తెలుసా అని అడిగారు. అన్నీ పథకాలు అందు తున్నాయని తల్లికి వందనం, దీపం పథకం ఇప్పటికే తీసుకున్నామని అన్నదాత సుఖీభవ ఈ రోజు అందుకోవటం సంతోషంగా ఉందని అనూష వివరించారు. మా మామయ్యకు రూ.4వేలు పింఛన్ కూడా వస్తుందని, తల్లికి వందనం ద్వారా రూ.30 వేలు, ఇప్పటికే రెండు సిలిండర్లు తీసుకున్నామని ఆమె ఆనందంతో వివరించారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్న విషయాన్ని ఆమె గుర్తుచేస్తూ మహిళలకు ఎన్నో పథకాలు అమలు చేసినందుకు ఆనందంగా ఉందన్నారు. రేషన్‌బియ్యం, పింఛన్లు ఎలా అందుతున్నాయని సీఎం చంద్రబాబు అడగ్గా రేషన్‌బియ్యం సక్రమంగా పంపిణీ చేస్తున్నారని పింఛన్లు ఇంటి దగ్గరకు వచ్చి అందిస్తున్నారని చెప్పారు. గతంలో ఎవరైనా ఇలా మీదెగ్గరుకు వచ్చి పథకాలు అందించారా అని సీఎం అడగ్గా మీరు తప్పా ఎవ్వరూ రాలేదని అనూష వివరించారు.


సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న మహిళా రైతు అనూష

నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించాలి

● అనిల్‌కుమార్, రైతు

నిరుద్యోగ యువకులు స్వయంకృషితో అభివృద్ధి చెందే విధంగా అవకాశాలు కల్పించాలని దర్శి మండలం తూర్పువీరాయపాలెం గ్రామానికి చెందిన యువరైతు అనీల్‌కుమార్ కోరారు. సీఎం చంద్రబాబు సమక్షంలో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను విద్యావంతుడినైనప్పటికీ ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా పైర్లు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం అమలుచేయటం ఆనందంగా ఉందన్నారు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుచేయాలని సూచించారు. సీఎం చంద్రబాబు ఆ యువకుడితో మాట్లాడుతూ మీరు ఎంతవరకు చదువుకున్నారని అడగ్గా డిగ్రీ పూర్తి చేసి గ్రాఫిక్ డిజైనరీ కోర్సు కూడా చేశానని తెలిపారు. వర్క్ ఫ్రం హోమ్ ద్వారా ఎన్నో ఉద్యోగాలు చేసుకునే అవకాశాలు ఉన్నాయని, వ్యవసాయంతో పాటు ఉద్యోగం కూడా చేసుకోవచ్చు కదా అని చంద్రబాబు సలహా ఇచ్చారు. అలా కూడా చేస్తున్నానని ఆ యువకుడు సమాదానం చెప్పారు. ఎంఎస్ఎంఈ ఏర్పాటు ద్వారా ఇంటికో పారిశ్రామికవేత్తను తయారుచేయాలన్నదే తమ లక్ష్యమని ఈ సందర్భంగా సీఎం చంద్రబా బు స్పష్టం చేశారు. ఈసందర్భంగా అనీల్‌కుమార్ గ్రామ సమస్యలను సీఎం దృష్టికి తెచ్చారు. తూర్పువీరాయపాలెం చెరువు సొసైటీలో ఉన్నందున ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని, దళారులు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. లింక్ రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరగా వెంటనే పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆదేశించారు.



మాట్లాడుతున్న యువరైతు అనిల్‌కుమార్

వ్యవసాయంలో టెక్నాలజీని అందుబాటులోకి తేవాలి

● అచ్చిరెడ్డి, రైతు

పంటల సాగుకు ప్రస్తుతం అధికంగా ఖర్చు అవుతుందని టెక్నాలజీ ద్వారా సులభతరం చేయాలని మండ్లమూరు మండలం బొట్లపాలెం గ్రామానికి చెందిన రైతు అచ్చిరెడ్డి కోరారు. రైతుల ముఖాముఖీ సదస్సులో సీఎం చంద్రబాబుతో మాట్లాడుతూ ప్రస్తుతం కూలీల కొరత, వ్యవసాయ ఖర్చులు పెరగడంతో వ్యవసాయం భారమవుతుందన్నారు. అందుకు స్పందించిన సీఎం చంద్రబాబు నూతన వ్యవసాయ విధానాన్ని రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ ఇస్తున్నామన్నారు. పనులు సులభతరంగా పూర్తి చేసుకునేందు వాట్సాప్ గవర్నెన్సను అమల్లోకి తెచ్చామన్నారు. తాజాగా డ్రోన్ అగ్రికల్చర్ ద్వారా పొలాల్లో తెగుళ్లను వెంటనే కనుగోని అవసరమైన చోటనే క్రిమిసంహారక మందును వాడేవిధంగా టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆధునిక, సాంకేతిక పద్ధతులు రైతులు అందిపుచ్చుకొని తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించాలని సీఎం చంద్రబాబు సూచించారు. రైతులు కూడా పంటల సాగులో మెలకువలు పాటించాలన్నారు.

రైతులు ఆరోగ్యవంతంగా ఉండేందుకు పండ్లు, కూరగాయలు, పాలు, గుడ్లు అధికంగా వాడాలని సూచించారు. 25 సంవత్సరాల క్రితం రైతులు, రైతు కూలీల బిడ్డలు ఐటీ ఉద్యోగులుగా ఎదిగేందుకు ఎవరు అవకాశాలు కల్పించారని అడగ్గా మీరే కల్పించారని అచ్చిరెడ్డి సమాధానం ఇచ్చారు. ఫోన్ ద్వారా ఎన్నోరకాల సదుపాయాలు ఉన్నాయని రైతులు టెక్నాలజీని వ్యవసాయానికి మలుచుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న బొట్లపాలెం రైతు అచ్చిరెడ్డి

ప్రశాంతంగా సీఎం చంద్రబాబు పర్యటన

దర్శి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆధ్వర్యంలో పలువురు డీఎస్పీలు, ఇతర అధికారులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా కార్యక్రమం ముగియటంతో ఊపిరిపీల్చుకున్నారు. అంతకుముందు సీఎంను హెలిప్యాడ్ వద్ద కలిసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీసీ టీవీలు, కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. కొంతమంది పోలీసు అధికారులను రైతుల్లా మారువేషాలతో ప్రజల మధ్యలో ఉంచారు. సుమారు వెయ్యి మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబు పర్యటనలో బందోబస్తు ఏర్పాట్లు చూస్తున్న గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

తప్పిన ప్రమాదం

బైక్‌లను తప్పించబోయి చెరువుకట్టపై ఒరిగిన ఆర్టీసీ బస్సు

మార్కాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ సమయ స్ఫూర్తిగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం మేర కు.. చెరువుకట్టపై శనివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్నాయి. చింత కుంట్లకు చెందిన ఎస్.పవన్ ఎస్టేట్ వైపు వెళ్తుండగా డ్రైవర్స్ కాలనీకి చెందిన రసూల్ మార్కాపురం వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో చిం తచెట్ల సమీపంలో రెండు బైకులు అదుపుతప్పి ఢీకొన్నాయి. ఇదే సమ యంలో మార్కాపురం నుంచి ఒంగోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన వారిని తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో చెరువుకట్టపై నుంచి కిందికి ఒరిగింది. దీంతో బైక్‌లపై ప్రమాదానానికి గురైన వారికి పెను ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న సుమారు 45 మంది ప్రయాణికులకు కూడా ప్రమాదం తప్పినట్లైంది. అటుగా వెళ్త న్నవారు బస్సులోని వారిని సురక్షితంగా కిందికి దించారు. బైక్‌లపై వెళ్తున్న వారిరువురిని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి 108 వాహనంలో పంపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్సై సైదుబాబు తెలిపారు.


చెరువుకట్టపై నుంచి కిందికి ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

గిట్టుబాటు ధరల్లేక అల్లాడుతున్న రైతులు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి విమర్శ

ఒంగోలు కలెక్టరేట్,ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతుంటే అవేమీ పట్టించుకోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సినిమా సెట్టింగ్ తరహాలో సమావేశం ఏర్పాటు చేసి వెళ్లడం హాస్యాస్పదంగా ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీమంత్రి మేరుగ నాగార్జునలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయంలో రాష్ట్రంలో 58 లక్షల మంది రైతులకు రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తే కూటమి ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని కేవలం 46 లక్షల మందికి మాత్రమే ఇస్తున్నారన్నారు. మిగిలిన 12 లక్షల మంది రైతు కుటుంబాలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. దర్శి నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి దోపిడీకి పాల్పడుతున్నా చంద్రబాబుకు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నగర అధ్యక్షుడు కటారి శంకర్,వైసీపీ నాయకులు మన్నం శ్రీధర్ ఉన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, పక్కన జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ తదితరులు


మణిబాబుకు రెన్యువల్ పత్రాన్ని అందజేస్తున్న ఏపీఎంసీ కమిటీ

జిల్లాలో తొలిసారిగా డాక్టర్లకు మెడికల్ కౌన్సిల్ రెన్యువల్

ఒంగోలు, కార్పొరేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ రెన్యువల్స్ జిల్లాలో తొలిసారిగా ఒంగోలులో నిర్వహించారు. శనివారం ఒంగోలులోని జీజీహెచ్‌లో రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన రెన్యూవల్స్ ప్రక్రియను ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు ప్రారంభించారు. వైద్య వృత్తిలో ఉన్నటువంటి డాక్టర్లు ప్రతి ఐదేళ్లకు ఒకసారి తమ వివరాలను మెడికల్ కౌన్సిల్‌లో రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆ ప్రక్రియ మెడికల్ యూనివర్సిటీలో మాత్రమే జరగ్గా ఏపీఎంసీ చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు నూతన విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. ప్రతి జిల్లాలోని హెడ్ క్వార్టర్స్‌లో రెండు రోజులపాటు నిర్వహించి, వైద్యుల వివరాలను రెన్యువల్ చేయించుకునే అవకాశాన్ని కల్పించారు. రెన్యువల్ కరెంట్ ఎడ్యుకేషన్ సెమినార్‌లకు హాజరు కావడం ద్వారా ఒక్కో సెమినార్‌కు 2 పాయింట్‌లు వైద్యులకు లభిస్తాయి. ఇలా ఏడాదికి తప్పనిసరిగా ఆరు పాయింట్‌లు పొందాల్సి ఉంది. మొత్తం ఐదేళ్లలో 30 పాయింట్‌లు ఉన్నవారికి మాత్రమే మెడికల్ కౌన్సిల్ రెన్యూవల్ ప్రక్రియను నిర్వహిస్తారు.

కాగా జిల్లాలో తొలిసారిగా నిర్వహించిన ఈ ప్రక్రియలో రెన్యువల్స్‌కు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న 380 మందికి ఒంగోలులో మెడికల్ కౌన్సిల్ రెన్యువల్స్ నిర్వహించింది. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు సహకారం అందించారు. తొలి రిజిస్ట్రేషన్‌ను డాక్టర్ జాలాది మణిబాబు చేయించుకోగా అర్హత పత్రాన్ని ఏపీఎంసీ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఏపీఎంసీ సభ్యులు కేవీ. సుబ్బరాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ పి. అశోక్ కుమార్, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మన్నె వీరయ్య చౌదరి, పూర్వ అధ్యక్షుడు రావిపాటి జయశేఖర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ సీతారామయ్య, కార్యదర్శి జాలాది మణిబాబు, సీనియర్ వైద్యులు నల్లూరి రామవరావు, కొమ్మి నరసింగరావు, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, కోటి రెడ్డి పలువురు పాల్గొన్నారు.

రేపటి నుంచి పీఎస్‌హెచ్‌ఎంలకు శిక్షణ

ఒంగోలు విద్య, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 366 మంది ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈనెల 4 నుంచి 7వతేదీ వరకు పొదిలిలోని జోసఫ్ శ్రీహర్ష అండ్ మేరీ ఇంద్రజ కళాశాలలో లీడర్‌షిప్ శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకుహాజరు కావాల్సిన పీఎస్ హెచ్‌ఎంల జాబితాను జిల్లాలోని అన్ని ఎమ్మార్సీలకు పంపామన్నారు. ఆ జాబితాలోని పీఎస్ హెచ్‌ఎంలు అందరిని పాఠశాలల నుంచి రిలీవ్ చేసి శిక్షణకు పంపించాలని మండల విద్యాధికారులను డీఈవో ఆదేశించారు. హెచ్‌ఎంలు తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలని ఆయన కోరారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి) : రైతులకు అన్నివిధాలుగా కూటమి ప్రభుత్వం అండదండలు అందిస్తుందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం అమలులో భాగంగా చీమకుర్తి పట్టణంలో శనివారం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గంలో దాదాపు 27వేల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోని కారుమంచి మేజర్, రామతీర్థం జలాశయం గేట్లకు మరమ్మతులు ఇపుడు దాదాపు మూడుకోట్ల రూపాయలతో నిర్వహించటానికి టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. బర్లీ పొగాకు రైతులకు వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. అన్ని విధాల రైతుల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని చెప్పారు. గత ఏడాదికాలంలో రైతుల కోసం అమలు చేసిన పథకాలను వివరించే కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. తదుపరి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో రాఘవేంద్ర, కమిషనర్ రామకృష్ణయ్య, ఏఎంసీ చైర్మన్ మన్నం రాజేశ్వరి, సొసైటీ చైర్మన్ పూనాటి వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, గొట్టిపాటి రాఘవరావు, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఖాతాల్లో 'అన్నదాత సుఖీభవ'

మద్దిపాడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మద్దిపాడు నటరాజ కళాకేంద్రంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏవో జి.స్వర్ణలత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.7వేలు ప్రతి రైతుకు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు, బీజేపీ మండలాధ్యక్షుడ చెన్నుపల్లి వెంకటరమణారావు, గంగిశెట్టి కోటేశ్వరరావు, రాంబాబు, కృష్ణ, నవులూరి శివకుమార్, మద్దిపాడు గ్రామ కార్యదర్శి షేక్ నూరుల్లా, షేక్ షరీఫ్, కలాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొప్పోలులో నూతన స్పౌజ్ పింఛన్ల పంపిణీ



పింఛన్‌ను అందజేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(రూరల్), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలులోని యూనియన్ బ్యాంక్ దగ్గర శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత కింద మంజూరైన నూతన స్పౌజ్ పింఛన్‌లను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌ను ఒకేసారి రూ.4వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్ బి.నరసయ్య, డివిజన్ అధ్యక్షుడు వడ్లమూడి మునీంద్ర, నాయకులు నడిపినేని భాస్కర్, దొడ్డ చంద్రశేఖర్, కాట్రగడ్డ నాగేశ్వరరావు, గోనుగుంట సుబ్బారావు, పాలిష్ వలి, మందా డేవిడ్, ముప్పా ఓంకార్, ఈదర వంశీ, గోవిందాచారి, నడిపినేని శ్రీకాంత్, నీటి సంఘం అధ్యక్షుడు బత్తినేని కృష్ణమూర్తి, పోతినేని వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



బాలింతతో మాట్లాడుతున్న సీడీపీవో సుశీలాదేవి

కొండపి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పెరిదేపిలో ఐసీడీఎస్ అధికారులు శనివారం గృహ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. పలువురు బాలింతలను కలిసి తల్లిపాల ప్రాధాన్యం, బిడ్డకు కలిగే ప్రయోజనాలను సీడీపీవో బి.సుశీలాదేవి వివరించారు. తల్లి బిడ్డకు పాలిచ్చే విధానంపై అవగాహన కల్పించారు. తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విక్టోరియారాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వావిలేటిపాడులో....

జరుగుమల్లి మండలం వావిలేటిపాడులో తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిపాల వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భారతి, అశ్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని సీడీపీవో ఇవాంజెలియన్ తెలిపారు. శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఏడుగుండ్లపాడు, దొడ్డవరం, రాచవారిపాలెం సచివాలయాల్లో తల్లుల సమావేశం నిర్వహించారు. తల్లులకు బిడ్డల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడుగుండ్లపాడు వైస్ సర్పంచ్ రాజేశ్వరి, మహిళా అంగన్‌వాడీలు జి.జ్యోతి, జి.పద్మావతి, కె.శివనాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిధులు స్వాహా చేసిన

వితలాపురం సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేసిన టీడీపీ నేతలు

తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు ఆదేశం

తాళ్లూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నిధులు స్వాహా చేసిన వితలాపురం సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా శనివారం దర్శి మండలం తూర్పువీరాయపాలెంకు సీఎం చంద్రబాబునాయుడు వచ్చిన సందర్భంగా హెలిపాడ్ వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వినతిపత్రం ద్వారా అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో తాము గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపట్టిన పనులకు వైసీపీ పాలనలో నిధులు విడుదలయ్యాయని తెలిపారు. వైసీపీ సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి రూ.55 లక్షల నిధులను స్వాహా చేశారన్నారు. తాము చేపట్టిన పనుల తాలూకు నిధులు తమకు అందించేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, బాధితుడు, పార్టీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మానం రమేష్‌బాబు సీఎంను వేడుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నిధులు గ్రామపంచాయతీ అకౌంట్‌కు జమ అయ్యాయన్నారు. వితలాపురం సర్పంచ్ ఆనిధులను అక్రమ మార్గంలో స్వాహా చేశారని తెలిపారు. నగదు చెల్లించమని రాష్ట్రస్థాయి అధికారులు, కోర్టులు చెప్పినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలువగా డీపీవోను చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చినా నేటికి న్యాయం జరుగలేదన్నారు. తాము చేసిన పనుల తాలూకు స్వాహా చేసి న రూ.55 లక్షల నగదును తమకు అందించేలా చర్యలు చేపట్టి న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు స్పందించి ఈ సమస్యను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఆ వినతిపత్రం అందజేశారు.

'అన్నదాత సుఖీభవ'తో రైతుల్లో ఆనందం

● ఎమ్మెల్యే దామచర్ల



చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, పీడీసీసీబీ చైర్మన్ సీతారామయ్య, నాయకులు

కొత్తపట్నం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల్లో ఆనందం నెలకొందని, వారి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం కొత్తపట్నంలోని రైతు సేవా కేంద్రం వద్ద ఆయన అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభ సభలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చకచకా అడుగులు వేస్తోందన్నారు. సూపర్‌సిక్స్ హామీలన్నింటిని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కొత్తపట్నం మండలంలోని 4,212 మంది రైతులకు రూ.2.95 కోట్లను అన్నదాత సుఖీభవ పథకం కింద కూటమి ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందని ఆ యన పేర్కొన్నారు. మొదటి విడతగా రైతులకు రూ.7వేల వంతున ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అలాగే ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తుందని దామచర్ల పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన నిరుద్యోగ భృతి హామీని కూడా త్వరలోనే నెరవేర్చే దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని వివరించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వేల కోట్ల రూపాయలతో రోడ్లను అభివృద్ధి చేశామని ఆయన గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేసిందని ఎమ్మెల్యే ఆరోపించారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ రామచంద్రగౌడ్, జిల్లా బీసీ సెల్ విభాగం నాయకుడు గేనం సుబ్బారావు, కొత్తపట్నం సర్పంచ్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రజాప్రభుత్వ లక్ష్యం

● మారిటైం బోర్డు చైర్మన్ సత్య



మాట్లాడుతున్న దామచర్ల సత్య



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 2 : రైతుల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. మండలంలోని కె.బిట్రగుంటలో శనివారం ఆయన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే అమలు చేస్తున్నదన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా పేదల కోసం అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో నియోజకవర్గంలోని 36,808 మంది రైతులకు రూ.25 కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు. రైతుల కోసం ప్రభుత్వం సబ్సిడీపై యంత్ర పరికరాలు, డ్రోన్‌లు ఇస్తున్నదన్నారు. ఈనెలలోనే కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందుతాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కూడా అమలులోకి వస్తుందని చెప్పారు. ఈసందర్భంగా దర్శి మండలం తూర్పువీరాయపాలెం నుంచి సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, ఎంపీపీ బెల్లం నిర్మల, టీడీపీ సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, దగ్గుమాటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

టంగుటూరు(కొండపి): అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకంలో తొలి విడత రూ.7 వేల ఆర్థిక సాయం అందించినందుకు కృతజ్ఞతగా ఎం.నిడమాలూరులో రైతులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాకుమాని శ్రీకాంత్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకుమాని శ్రీనివాస్, సురేష్, అన్నపరెడ్డి కనకరాజు, బెజవాడ శివయ్య, మాధవ, వాకా కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, కాపూరి సుబ్బయ్య పాల్గొన్నారు.

ఖాతాల్లో రూ.4.44 కోట్లు జమ

పొన్నలూరు : అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కింద మండలంలోని 7,645 మంది రైతుల ఖాతాల్లో రూ.4.44 కోట్లు జమ అయ్యాయి. రైతు సేవా కేంద్రాల వద్ద శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. పొన్నలూరులో వ్యవసాయాధికారి వి.రాము, టీడీపీ మండల నాయకుడు మండవ మురళీమోహన్, వ్యవసాయ సహాయకులు ఇ.సుధీర్, వెంకటనారాయణ, సుష్మ, సబియా, రాకేష్, మౌలాలి పాల్గొన్నారు.

రెండు ఓట్లు కలిగి ఉంటే ఏడాది జైలు

● ఆర్డీవో లక్ష్మీప్రసన్న



మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎవరైనా రెండు ఓట్లు కలిగి ఉంటే చట్ట ప్రకారం నేరమని ఆర్డీవో లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో శనివారం గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు, చట్టప్రకారం రెండు ఓట్లు కలిగి ఉంటే ఎన్నికల నిబంధనల ప్రకారం సెక్షన్ 31, ఆర్‌పీఏ-1950 యాక్టు ప్రకారం ఏడాది జైలు శిక్ష లేదా లక్ష రూపాయాల జరిమానా విధించాల్సి వస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎక్కడ నివాసం ఉంటే అక్కడే తమ ఓటుహక్కు కలిగి ఉండేలా రాజకీయపార్టీలు సహకరించాలన్నారు. ప్రతినెలా గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి నుంచి వచ్చే సూచనలు, సలహాలు తీసుకొని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. ఒంగోలు నియోజకవర్గంలో రెండేసి ఓట్లు కలిగి ఉన్నవారు ఒక ఓటును రద్దు చేసుకోవాలని కోరారు. రెండో ఓటును రద్దు చేసుకోకుంటే కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నేరంగా పరిగణించాల్సి వస్తోందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లో 1200 ఓట్ల కంటే ఎక్కువ కలిగిన బూత్‌ల్లోని ఓట్లను పక్కనే ఉన్న మరోక పోలింగ్ కేంద్రానికి మారుస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్ళు నిండిన యువతీ, యువకులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు స్వరూప్, ఎస్‌కే.రసూల్, డీఎస్.క్రాంతికుమార్, గుర్రం సత్యనారాయణ, డీటీ కృష్ణమోహన్, ఏసీపీ సుధాకర్, టీపీవో బాబురావు, రామ్‌భూపాల్ రెడ్డి, పద్మజ, నాయుడు, శేషుబాబు, సలోమి, సాయి, దాసు, మంజు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మహిళతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

దర్శి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తూర్పువీరాయపాలెం పర్యటనలో ఓ బాధిత కుటుంబానికి న్యాయం జరిగింది. ప్రశాంతి అనే మహిళ దివ్యాంగుడైన తమ కుమారుడిని తెచ్చి న్యాయం చేయాలని కాన్వాయ్ వద్దకు వెళ్లి విజ్ఞప్తి చేసింది. కుమారుడి వైద్యానికి సహాయం అందించాలని కోరింది. అందుకు వెంటనే స్పందించిన సీఎం రూ.1.50 లక్షలు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆదేశించారు. బాలుడి వైద్యానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించటంతో ఆ బాధితురాలు ఆనందం వ్యక్తం చేసింది.

మంగమూరులో తల్లిపాల వారోత్సవాలు

సంతనూతలపాడు, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): మంగమూరు గ్రామంలో శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతిబాయి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఆ రునెలల వరకు బిడ్డకు ముర్రుపాలు తాగించడం ద్వారా వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగు తుందని వివరించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్ ● 5న ఒంగోలులోని విద్యుత్‌భవన్ వద్ద ధర్నా



మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ రంగం ప్రైవేటీకరణలో భాగంగా అదానీ కంపెనీకి చెందిన స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్మార్ట్‌మీటర్లను బిగించొద్దంటూ ఈనెల 5వతేదీన ఒంగోలులోని విద్యుత్‌భవన్ వద్ద జరిగే ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఐక్యవేదిక నాయకులు టి.మహేష్, ఆర మోహన్, ఎంఎస్.సాయిలు మాట్లాడారు. స్మార్ట్‌మీటర్లతో ప్రజలపై అదనపు భారాలు మోపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుతో వినియోగదారులపై అదనపు భారం పడుతుందని విమర్శించారు. విద్యుత్ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి నాయకులు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానాలను ఉపసంహరించుకోకపోతే మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లలితకుమారి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి

ఒంగోలు(రూరల్): విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు కోరారు. ఒంగోలు నగరం రాజీవ్‌నగర్‌లో శనివారం జరిగిన సమావేశంలో వై.సిద్ధయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదానికి లాభాలు చేకూర్చటానికి తలవగ్గిందన్నారు. స్మార్ట్‌మీటర్లకు ముందుగా రీచార్జి చేసుకుంటేనే విద్యుత్ సరఫరా వస్తుందన్నారు. దానివల్ల ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో యు.లక్ష్మీనారాయణ, ఏవీ.పుల్లారావు, ఎనికపాటి సుబ్బారావు, జి.సుబ్బారావు, శ్రీహరిరావు, వెంకటేశ్వరరావు, బ్రహ్మారెడ్డి, కంచర్ల సుబ్బారావు, కిరణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, సోమశేఖరరెడ్డి, కోటేశ్వరరావు, హరిబాబు పాల్గొన్నారు

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్.. ముగ్గురికి తీవ్ర గాయాలు

ముండ్లమూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు మండంలోని రెడ్డినగర్ సమీపంలో అద్దంకి-దర్శి ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ముండ్లమూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన అనమనమూరి గోపాల్, దర్శి మండలం పోతవరం గ్రామానికి చెందిన కె.సుబ్బులు, శ్రీను గేదెను కొనుగోలు చేసేందుకు బైక్‌పై అద్దంకి వైపు వెళుతున్నారు. ఈ సమయంలో తాళ్ళూరు మండలం తురకపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో ఎరువును తీసుకువచ్చి రెడ్డినగర్‌లో ఒక రైతు పొలంలో పడవేసి తిరిగివెళుతున్నారు. ఈక్రమంలో ట్రాక్టర్ రహదారి ఎక్కుతూ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కను నాటుతున్న ఎంఈవో వెంకారెడ్డి

సంతనూతలపాడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంఈవో వెంకారెడ్డి తెలిపారు. శనివారం సంతనూతలపాడులోని షైనింగ్‌స్టార్ ఎలైట్ స్కూల్ ఆధ్వర్యంలో పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉంటోందని, తద్వారా కాలుష్యం పెరుగుతుందని చెప్పారు. అందువల్ల పర్యావరణ పరిరక్షణ కోసం విధిగా మొక్కలను నాటాలన్నారు. తద్వారా స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన వాతావరణం లభిస్తుందని ఆయన తెలిపారు. అనంతరం ఎంఈవో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సీహెచ్.అనిత, ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రాతపరీక్షలో 'శ్రీవికాస్' ప్రతిభ



పావనిని అభినందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సివిల్ పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షల్లో ఒంగోలులోని శ్రీవికాస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు సత్తా చాటారు. అత్యధిక మార్కులు సాధించి సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు. కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన దర్శికి చెందిన షేక్ ఫజులూన్ రాష్ట్ర స్థాయిలో 173వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపిక కాగా జె.పంగులూరుకు చెందిన పి.పావని 120 మార్కులతో ఉద్యోగానికి ఎంపికయారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక కోచింగ్ సెంటరులో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను కరస్పాండెంట్ కె.మోహనరావు, డైరెక్టర్ వీరయ్య అభినందించారు. అలాగే శిక్షణ ఇచ్చిన అధ్యాకులను సత్కరించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో శనివారం విద్యార్థులు విలువలతో వికాసం అనే అంశంపై నృత్య ప్రదర్శనను నిర్వహించారు. ఆరో తరగతి విద్యార్థులు తమ ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. నేటితరంలో నైతిక విలువల, మంచి ప్రవర్తన, సామాజిక బాధ్యతల అవసరాన్ని, దయ, నిజాయితీ, గౌరవం, సహకారం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భగా హెచ్‌ఎం శశిలక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళులర్పించిన 'బాచిన'



నివాళులర్పిస్తున్న గరటయ్య

మద్దిపాడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నమనేని కార్తీక్ మరణం టీడీపీకి తీరనిలోటని అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య పేర్కొన్నారు. శనివారం ఘడియపూడిలోని మాజీ సర్పంచ్ అన్నమనేని సుబ్బారావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కార్తీక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మస్తాన్‌రావు, నవులూరి శివకుమార్, అన్నమనేని రేవతమ్మ, కరిచేటి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో ఒంగోలు మండలం ప్రథమస్థానం : ఎంపీడీవో

ఒంగోలు(రూరల్), ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో ఒంగోలు మండలం జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచిందని ఇన్‌చార్జి ఎంపీడీవో శేషుబాబు తెలిపారు. ఒంగోలు మండలం మండవవారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం ఆయన పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు గ్రామంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. పన్నులను వంద శాతం వసూలు చేయాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగుల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

తల్లిపాలతోనే ఆరోగ్యానికి రక్షణ

ఒంగోలు(రూరల్), ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే బిడ్డకు జీవితాంతం ఆరోగ్య రక్షణ లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.రమ పేర్కొన్నారు. ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలని చెప్పారు. ఆరునెలలు పాటు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. దీంతో బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుందని పేర్కొన్నారు. బాలింతలకు అందజేసే పోషక పదార్థాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా

సుఖీభవ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : అన్నదాతకు అన్నివిధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి భరోసా ఇచ్చారు. మండంలంలోని నికరంపల్లి, భూపతిపల్లి గ్రామాలలో శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు ప్రజలను మభ్య పెట్టి మోసం చేశారన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సులో ప్రయాణించే సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండా జగన్‌రెడ్డి పూర్తి చేశామని నమ్మబలికి పశ్చిమ ప్రజలను మోసగించారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నికరంపల్లి గ్రామంలో 370 మంది, భూపతిపల్లిలో 1142 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాలలో నగదు జమ అవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. అలాగే నూతనంగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, ఏడీఏ బాలాజి నాయక్, ఏవో బుజ్జిబాయి, మార్కెట్ యార్డు చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, డీటీ శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం పిచ్చయ్య, గ్రామ సర్పంచ్ జీ పార్వతమ్మ, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల


అమానిగుడిపాడులో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

రైతు సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మార్కెట్‌యార్డు ఆవరణలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. నియోజకవర్గంలోని 37వేల మంది రైతులకు మొదటి విడత పెట్టుబడి సాయం కింద మంజూరైన రూ.26కోట్ల విలువైన చెక్కులను విడుదల చేశారు. ప్రతి రైతుకు మొదటి విడతగా రూ.7వేలు వారి ఖాతాలలో జమ చేస్తారన్నారు. 3 విడతల్లో మొత్తం 20 వేల పెట్టుబడి సాయాన్ని అందిస్తుందని తెలిపారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు చేస్తున్నారని, అది కూడా త్వరలోనే మొదలవుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్న ప్రజా ప్రభుత్వంపై జగన్‌రెడ్డి బ్యాచ్ విమర్శలు చేయడాన్ని అశోక్‌రెడ్డి తప్పుబట్టారు. ప్రజలే వారికి బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు, కంభం మార్కెట్‌యార్డు చైర్మన్లు భైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్‌పిటిసి బుడత మధుసూదన్, సొసైటీ చైర్మన్లు దుత్తా బాలీశ్వరయ్య, బిజ్జం రవీంద్రరెడ్డి, జనసేన పార్టీ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ, వివిధ మండలాల టీడీపీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.


సుఖీభవ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రైతులను నిలువునా ముంచిన జగన్‌రెడ్డి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్ : వెలిగొండ ప్రాజెక్టును పూర్తి కాకుండానే పూర్తి చేశామని జాతికి అంకితం చేసి జగన్‌రెడ్డి పశ్చిమ ప్రజలను మోసగించారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని అమానిగుడిపాడు గ్రామంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ మొదటి విడత సాయాన్ని రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు సబ్సిడీపై విత్తనాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారన్నారు. మరికొద్ది రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందన్నారు. వైపాలెం నుంచి గెలిచి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఆశ్రమ పాఠశాలకు డోరు కూడా ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. ఇప్పుడు గెలిచిన వ్యక్తి హైదరాబాద్‌లో డిబేట్ కార్యక్రమాల్లో పాల్గొనడం తప్ప ప్రజలకు కనిపించడం లేదన్నారు. ఇలాంటి మోసగాళ్లు ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.150కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యేగా నేను గెలవలేకపోయినా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అహర్నిశలు కృషి చేస్తానని ఎరిక్షన్‌బాబు తెలిపారు. మొత్తం 39,274 మంది రైతులకు రూ.26.33కోట్లు జమ కానున్నట్లు వ్యవసాయ సంచాలకులు వెంకటరమణ తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లైవ్ కార్యక్రమాలను రైతులు, ప్రజలతో కలసి తిలకించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో కె నీరజ, టీడీపీ నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, వేగినాటి శ్రీను, మహేష్ నాయుడు, సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈవో గిరిధర్ శర్మ

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించండి

రాచర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈవో గిరిధర్ శర్మ అన్నారు. మండలంలోని రంగారెడ్డిపల్లి, చెర్లోపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య, హాజరైన, హాజరు కాని వారి వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, విద్యార్థుల వివరాలన్నీ రికార్డుల్లో నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థుల సంఖ్యను పెంచాలని, మంచి ఫలితాలు సాధించేలా చూడాలని సూచించారు. రికార్డులు, పరిసరాలు ఆశాజనకంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

అక్రమంగా పొలం ఆన్‌లైన్.. తిరిగి కేసు

బాధిత రైతు ఆవేదన

పొదిలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నా పొలాన్ని అక్రమంగా ఆన్‌లైన్ చేసుకొని తిరిగి నాపైనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని బాధిత రైతు పులి చిన్న నాగిరెడ్డి ఆరోపించారు. వివరాల్లోకి వెళితే.. అన్నవరం గ్రామంలో సర్వే నెంబర్ 75లో 39 ఎకరాల 40సెంట్ల భూమి ఉంది. ఆర్‌ఎస్‌ఆర్ ప్రకారం కొత్తపులి ఓబులరెడ్డి, యర్రంరెడ్డి నాగయ్య, యర్రంరెడ్డి చిన్నచెన్నయ్య, పులి కోటయ్య పేర్లమీద ఆ పొలం ఉంది. అందులో సమానంగా పంపకాలు జరిగితే ఒక్కొక్కరికీ 9 ఎకరాల 85సెంట్ల భూమి వస్తుంది. అయితే దొంగ అగ్రిమెంట్ చేసుకొని కొత్తపులి ఓబులరెడ్డి వారసులపైనే 19ఎకరాల 70సెంట్లు భూమి ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని బాధితుడు కొత్తపులి చిన్న నాగిరెడ్డి తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 2022లో దొంగ అగ్రిమెంట్ చేసుకొని ఆన్‌లైన్ చేయించుకొని టీడీపీ హయాంలో 2018లో ఆన్‌లైన్ జరిగినట్లు తప్పుడు ప్రచారం చేసి పోలీసులను కూడా మోసం చేస్తూ నాపై పొదిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అన్నవరం గ్రామంలో వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలలేనని విజ్ఞప్తి చేశారు.


అగ్రిమెంట్ పత్రం


చిన్న నాగిరెడ్డి


కసినెపల్లిలో మొక్కలు నాటుతున్న శ్రీధర్‌శర్మ

మొక్కలతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొమరోలు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మొక్కలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఫారెస్టు ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ ఆనందరావు అన్నారు. మండలంలోని కసినెపల్లి మండల ప్రాథమిక పాఠశాలల ఆవరణలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం మొక్కలను నాటి, ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ కాలుష్యం పెరిగిపోతున్న ప్రస్తుత రోజుల్లో మొక్కలతోనే ప్రాణవాయువు అందుతుందన్నారు. అందుకు ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని వృక్షాలుగా పెంచాలని కోరారు. పూర్వీకులు వేసిన చెట్ల నుంచి వచ్చే పండ్లను, పూలను ఇప్పుడు మనం వినియోగిస్తున్నామని, అలాగే మనం నాటిన వనాల ఫలాలు భవిష్యత్ తరాలకు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటేందుకు ఆసక్తి ఉన్న వారు కొమరోలు ఎంఆర్సీ కార్యాలయం ఎదురుగా ఫారెస్టు రేంజ్ కార్యాలయం, సెల్ నెం. 8121393893ల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీదర్‌శర్మ, ఉపాధ్యాయిని గూడూరు గిరిజ, ఫారెస్టు బీట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌కుమార్

త్రిపురాంతకం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కుచట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో రాజ్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తుదారు సమాచారం కోరడం, అందుకు అవసరమైన గడువు, తదుపరి ఎలా అప్పీల్ చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బమ్మ, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, డిప్యూటీ ఎంపీడీవో మురళి, కార్యదర్శి రామసుబ్బయ్య పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం


మాట్లాడుతున్న సీడీపీవో పద్మావతి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని సీడీపవో పద్మావతి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా స్థానిక ఇండో ఫ్యాక్టరీ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. బిడ్డకు మొట్టమొదటి టీకా ముర్రుపాలేనని అన్నారు. తల్లిపాలు 6 నెలల వరకు ఇవ్వాలన్నారు. 6 నెలల తర్వాత 7వ నెల తల్లిపాలతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అనంతరం బలహీన నవజాత శిశువుకు అందించవలసిన కంగారూ మదర్ కేర్ పద్ధతులను వివరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. సూపర్‌వైజర్ రవికుమారి, ఆయాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాచర్ల : బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలే ఔషధమని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పలుగుంటిపల్లి గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు అమృతమని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎం.ప్రసాద్, సీహెచ్‌వో ఎస్.రామాంజనేయులు, ఏఎన్‌ఎం లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, మహిళలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన పాపరాజు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలం చిన్నబోయలపల్లి గ్రామానికి చెందిన పీ పాపరాజు కానిస్టేబుల్‌గా ఎంపికైనట్లు ప్రభుత్వం ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. వైపాలెం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కాలేజీలో 2025 మార్చిలో బీకాం పూర్తి అయిన ట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాపరాజును కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీధరనాయుడు, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్, అధ్యాపకులు అభినందించారు.


పాపరాజు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా శాంతి కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామికి శాంతి కళ్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పింగళి వెంకయ్యకు నివాళి

కంభం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నకంభం మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల నందు శనివారం జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పింగళి వెంకయ్య జీవిత విశేషాలను గురించి, స్వాతంత్ర్య ఉద్యమం, చేసిన సేవ గురించి విద్యార్థులకు తెలిపారు. సంసిద్ధత కార్యక్రమం 30వ రోజున పిల్లలు నేర్చుకున్న తెలుగు, ఇంగ్లీషులలో వారి సామర్థ్యాలను పరీక్షించారు.

బాలయ్యకు జాతీయ అవార్డ్ హర్షణీయం

పెద్ద దోర్నాల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):భగవంత్ కేసరి బాలయ్య బాబుకు జాతీయ అవార్డు ప్రకటించడం హర్షణీయమని నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఈదర మల్లయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. మూడు హిట్లతో హ్యాట్రిక్ కొట్టడంతో పాటు జాతీయ అవార్డులను సొంతం చేసుకున్నారన్నారు.

39,274 మందికి అన్నదాత సుఖీభవ

రైతుల ఖాతాల్లోకి నగదు జమ

ఎర్రగొండపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం వ్యవసాయ సబ్‌డివిజన్‌లో 39,274 మంది రైతుల ఖాతాలో రూ.26కోట్ల 33 లక్షల అన్నదాత సుఖీభవ నిధులు జమ అయ్యాయని ఏడీఏ వెంకటరమణ శనివారం తెలిపారు. మండలంలో 8,519 మంది రైతులకు రూ.5.52 కోట్లు, త్రిపురాంతకం మండలంలో 8,675 మందికి రూ.5.41 కోట్లు, దోర్నాల మండలంలో 6,039 మందికి రూ.4.28కోట్లు, పెద్దారవీడు మండలంలో 6,675 మందికి రూ.4.93కోట్లు, పుల్లలచెరువు మండలంలో 9,366 మంది రైతులకు రూ.6.19కోట్ల నిధులు అన్న దాతసుఖీభవ పథకం కింద రూ.5వేలు, పీఎం కిసాన్ కింద రూ.2వేల నిధులు జమ అయినట్లు తెలిపారు.

రంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాచర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీ చెరువు అడువుల్లోని నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామి వారికి పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ పూజారులు భక్తుల చేత పూజలు చేయించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య అవసరమైన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయంలోని కాపు బలిజ అన్నదాన సత్రంలో భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహించినట్లు సత్ర నిర్వాహకులు కన్నసాని గోపాలరావు, తోట చంద్రయ్య తెలిపారు.


రంగనాయక స్వామి, అమ్మవారు

మహిళల అభివృద్ధికి కృషి

రాచర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ నాయకులు భవనం పుల్లారెడ్డి అన్నారు. భర్తలు కోల్పోయిన మహిళలకు ఆర్థిక భరోసా అందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న స్పౌజ్ పెన్షన్లను శనివారం ఆయన యడవల్లి గ్రామంలో పంపిణీ చేశారు. మహిళల అభివృద్ధికి చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి టీ గురునాథరెడ్డి, వీఆర్వో ఎన్.రంగయ్య, సచివాలయ సిబ్బంది, నాయకులు గోపి, సురేష్, రమణ పాల్గొన్నారు.


పింఛన్‌లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు పుల్లారెడ్డి

భార్యపై భర్త కత్తితో దాడి

పెద్ద దోర్నాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : భార్యపై భర్త కత్తితో దాడి చేసి గాయపర్చిన ఘటన మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన మల్లేశ్వరికి గొంతుపై తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం బొమ్మలాపురం గ్రామానికి చెందిన సింగా స్వేచ్ఛకుమార్, భార్య మల్లేశ్వరికి కొంత కాలంగా కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఉదయం బహిర్భూమికి వెళ్లిన మల్లేశ్వరి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో దారి కాచిన భర్త స్వేచ్ఛకుమార్ కత్తితో దాడికి ప్పాడ్డారు. కత్తితో గొంతు కోసేందుకు ప్రయత్నిస్తుండగా మల్లేశ్వరి కేకలు విని పలువురు పరుగున రావడంతో స్వేచ్ఛకుమార్ అక్కడ నుంచి పరారయ్యారు. అప్పటికే గొంతుపై తీవ్రగాయాలయ్యాయి. 108లో ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై మహేష్ ఘటనా స్థలానికి వెళ్లి విచారించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తికి గాయాలు

రాచర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై నుంచి పడి వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని పలుగుంటిపల్లి మూలమలుపు నర్సరీ వద్ద శనివారం జరిగింది. అర్థవీడు మండలం బొల్లుపల్లి గ్రామానికి చెందిన చిట్టెం సురేష్ అలియాస్ జోష్ అనే వ్యక్తి మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో తన ద్విచక్రవాహనంపై వస్తూ మూలమలపులో బైక్ అదుపుతప్పి కిందపడి తలకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది ఈఎంటీ రమణ పైలెట్ ఖాజావలి సురేష్‌కు ప్రథమ చికిత్స చేసి అనంతరం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యుదాఘాతానికి రైతు మృతి

పొదిలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నవరం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. పొలంలో మరమ్మతుకు గురైన బోరు పైపులను బైటకు లాగేందుకు ఐదుగురు వ్యక్తులు వెళ్లారు. అయితే బోరులో పైపులు బైటకు తీసే క్రమంలో పైన ఉన్న 33/11కేవీ విద్యుత్ లైనుకు పైపు తగలడంతో యర్రంరెడ్డి చెన్నయ్య (55) అక్కడికక్కడే మతి చెందినట్లు తెలిపారు. అయితే చెన్నయ్య ఉన్నవైపు పైపు ఒరిగిపోవడంతో మిగిలిన నలుగురు ప్రాణాలతో బైటపడ్డారని తెలిపారు. మరో వైపు ఒరిగి ఉంటే ఉంటే పెద్దప్రమాదమే జరిగేదని స్థానికులు చెప్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


చెన్నయ్య (ఫైల్)

అరటిలో తెగుళ్లు

గిద్దలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు ప్రాంతంలో సాగైన అరటి తోటలో సిగటోగా ఆకుమచ్చ తెగులు ఎక్కువగా విస్తరిస్తున్నదని ఉద్యాన శాఖాధికారి డి.శ్వేత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ తెగులు తీవ్రత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఆకుపై మొదటగా చిన్న పసుపురంగు మచ్చలు ఏర్పడి క్రమేపీ అవి పెద్దగా మారి బూడిద రంగులోకి మారుతాయని రైతులకు తెలిపారు. తోటలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, అలాగే కలుపు లేకుండా శుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభం కాగానే తెగులు ఎక్కువగా సోకే రకాలపై మాంకోజెబ్ 2.5 గ్రాముల మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో తెగులు వ్యాప్తి పెరుగుతుంటే ట్రాపికనోజోల్ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి 20 రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ విధంగా అరటి తోటలను తెగుళ్ల బారినుంచి రక్షించుకోవచ్చని రైతులకు సూచించారు.

రెండు ఓట్లు కలిగి ఉంటే చట్టప్రకారం నేరం

ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎవరైనా రెండు ఓట్లు కలిగి ఉంటే నేరమని ఆర్డీవో లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో శనివారం గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చట్టప్రకారం రెండు ఓట్లు ఉంటే సెక్షన్ 31, ఆర్‌పీఏ-1950 యాక్టు ప్రకారం ఏడాదిజైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా విధిస్తారని తెలిపారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపును అడ్డుకోండి

త్రిపురాంతకం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పేదల బియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు అంజనేయరెడ్డి కోరారు. శనివారం ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రైతుల భూములను ఆన్‌లైన్ చేయడంలేదని ప్రశ్నించడంతో ఫ్రీ హోల్డ్ భూములు, అసైన్‌మెంట్, చుక్కల భూములు ఇలా వివిధ కారణాలతో నిలుపుదల చేస్తున్నట్లు డీటీ కిరణ్ సమాధానమిచ్చారు. వ్యవసాయ సంబంధిత సమాచారం ప్రజా ప్రతినిధులకు ఇవ్వాలని దానివల్ల ప్రజలకు చేరువ చేయడం జరుగుతుందని కోరారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉన్నచోట ట్యాంకర్లతో సరఫరా చేయాలని సభ్యులు కోరారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, జలజీవన్ మిషన్ పనులను కూడా త్వరలో రెండో విడత పూర్తి చేయటం జరుగుతుందని ఎఇ శ్రీకాంత్ తెలిపారు. మండలంలో 1935 బంగారు కుటుంబాలు గుర్తించటం జరిగిందని వారిని దత్తత తీసుకునేందుకు ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలని అధికారులు కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయరెడ్డి

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు

పొదిలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరవచ్చని జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ గయాజ్ అన్నారు. శనివారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయిని కరీమున్‌బీబీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్లానింగ్, ప్రిపరేషన్, ప్రాక్టీస్, ప్రజంటేషన్ అనే అంశాలను జాగ్రత్తగా పాటించాలన్నారు. చదువుతోపాటు ఆట, పాటల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామయ్య, వెంకటేశ్వరరెడ్డి, కోటయ్య, రంగనాయకులు, రమణయ్య, జాఫర్, జిలానీ, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న షేక్ గయాజ్

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తాం

- దర్శి సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వెల్లడి

దర్శి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తిచేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. సీఎం దర్శికి వచ్చిన సందర్భంగా డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ఆయనకు బొకే అందించి అభినందనలు తెలిపారు. బస్సులో సీఎంకు దర్శి నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పథకాలను పూర్తి చేయాలని వినతిపత్రం సమర్పించారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆరంభించిన ప్రాజెక్టులన్నీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్షంగా వదిలేశారని తెలిపారు. జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం తమ హయాంలోనే ఆరంభించారని, ప్రస్తుతం పునాదుల్లోనే ఉన్నదని చెప్పారు. తాజా అంచనాలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు అందించటం జరిగిందని వివరించారు.

అందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హమీ ఇచ్చినట్లు వివరించారు. దర్శిలో నిలచిన కోల్డ్ స్టోరేజీ, క్రీడా వికాసకేంద్రం పనులు పూర్తిచేయాలని కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధిచేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావాలని ఆమె కోరారు. దర్శిలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని వెంకట చలంపల్లి-దొనకొండ రోడ్డును డబుల్‌రోడ్డుగా అభివృద్ధి పర్చాలని ఆమె కోరగా అందుకు సానుకూలంగా స్పందించారని వివరించారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే దొనకొండలో వెలుగులు నిండుతాయని కారిడార్‌కు అవసరమైన నీటి వనరులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. అందుకు సీఎం స్పందిస్తూ చెప్పిన మాట ప్రకారం వెలిగొండను వచ్చే ఏడాదిలో మొదటి దశ పూర్తి చేసి సాగునీరు అం దించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు వి వరించారు. తూర్పువీరాయపాలెం గ్రామంలో అంతర్గత రోడ్లు, మురికి కాల్వల అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరగా సీఎం చంద్రబాబు వెంటనే కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఆ పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు ఆమె వివరించారు. అర్హులైన పేదలకు 90 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరగా వెంటనే చేయాలని అదికారులను ఆదేశించినట్లు తెలిపారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు భరోసా ఇవ్వటం పట్ల డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.



బస్సులో సభాస్థలికి వస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



వెంకటేశ్వరస్వామి బొమ్మను సీఎం చంద్రబాబుకు అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దారం నాగవేణి, సుబ్బారావు దంపతులు. పక్కన ఉన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

ఏఎంసీ చైర్మన్ నాగవేణిని అభినందించిన సీఎం

దర్శి, ఆగస్టు 2 (ఆంధ్ర జ్యోతి): దర్శి ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దారం నాగవేణిని సీఎం చంద్రబాబు అభినందించారు. హెలిప్యాడ్ వద్ద నాగవేణి, సుబ్బారావు దంపతులు టీడీపీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులతో కలిసి సీఎం చంద్రబాబుకు బొకే, వెంకటేశ్వరస్వామి ప్రతిమ అందించి ధన్యవాదాలు తెలిపారు. తొలుత ఈనెల 3న స్థానిక మార్కెట్‌యార్డులో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం నిర్వహించుకునేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. సీఎం దర్శి పర్యటన ఖరారు కావటంతో ఆ కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సీఎంను కలిసి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ఈసందర్భంగా సీఎం వారిని అభినందిస్తూ రైతుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూ చించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడియాల రమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దర్శి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనలో ఓ బాధిత కుటుంబానికి న్యాయం జరిగింది. ప్రశాంతి అనే మహిళ దివ్యాంగుడైన తమ కుమారుడిని తెచ్చి న్యాయం చేయాలని కాన్వాయ్ వద్దకు వెళ్లి విజ్ఞప్తి చేసింది. కుమారుడి వైద్యానికి సహాయం అందించాలని కోరింది. అందుకు వెంటనే స్పందించిన సీఎం రూ.1.50 లక్షలు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆదేశించారు. బాలుడి వైద్యానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించటంతో ఆ బాధితురాలు ఆనందం వ్యక్తం చేసింది.



బాధితురాలికి సాయం ప్రకటిస్తున్న సీఎం చంద్రబాబు

చంద్రబాబును విమర్శించేస్థాయి కదిరికి లేదు!

- టీడీపీ నేతల ధ్వజం



విలేకరుల సమావేశంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

పామూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగన్ మెప్పు కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు ఆరోపణలు చేస్తున్నారని ఏఎంసీ వైస్‌చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, పామూరు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ ఉప్పలపాటి హరిబాబు అన్నారు. చంద్రబాబును విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం అంటు కదిరి వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కదిరికి రాజకీయ, గుర్తింపు, తగిన గౌరవం చంద్ర బాబు వలనే వచ్చిందన్నారు. మిమ్మల్ని కుటుంబ సభ్యుడుగా భావించిన చంద్రబాబు మోసగాడు గా కన్పిస్తున్నారా అని ప్రశ్నిచారు. కృతజ్ఞతను మరిచి విమర్శించడం తగదన్నారు. మీవెంట నడిచిన క్యాడర్‌ను సంప్రదించకుండా రాజకీయ స్వార్థం కోసం వైసీపీలోకి వెళ్లిన మీరు చేసింది మోసం కాదా? అని ప్రశ్నించారు. అవకాశ రాజకీయాల కోసం మీ ప్రతిష్టను దిగజారి ప్రవర్తించవద్దని హితవు పలికారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాబు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, వై.ప్రసాద్‌రెడ్డి, ఎస్. సాంబయ్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేవీ రమణయ్య, జనసేన జిల్లా కార్యదర్శి వై.రహీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం

పామూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శిశువు పుట్టిన వెంటనే తల్లి పాలు త్రాగించడం శ్రేయస్కరమని ఇన్‌చార్జ్ సీడీపీవో పి.లావణ్య తెలిపారు. మండలంలోని కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలు శిశువుకు సులభంగా జీర్ణం అవుతుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈనెల 7 వరకు తల్లి పాలు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, అంగన్‌వాడీ కార్యకర్తలు సుబాషిణి, నారాయణమ్మ, టి .అమల, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

కనిగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు యాసిన్ అన్నారు. శనివారం స్థానిక దర్శి చంచయ్య భవనంలో జరిగిని ఏఐటీయూసీ నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ ఆవిర్భావం తర్వాత ఒంగోలులో రాష్ట్ర మహాసభలను తొలిసారిగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కుమారి, మానస, దీపిక, జులేఖ, దాసరి సునీత, బషీరా, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

దొనకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించేందుకు దాతలు ముందుకురావాలని ఎంఈవో సాంబశివరావు పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీలోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 120 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత అయితా వెంకటసుబ్బరత్నం కుమారులు లక్ష్మీనారాయణ, లక్ష్మణరావు, సుబ్బారావులు సమకూర్చిన పెన్నులు, పెన్సిల్స్, నోట్‌బుక్స్, పలకలను శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ వెంకటసుబ్బరత్నం కుమారులు గ్రామంలోని మూడు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రతి ఏడాది విద్యా సాగ్రిని అందిస్తూ ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని దాతలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో-2 షేక్ అమీర్, హెచ్‌ఎం వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత భూమిలోకి ప్రవేశిస్తే చర్యలు

పామూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు హెచ్చరించారు. మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు గ్రామంలో గల సర్వేనెంబర్ 110లో లోగల ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ ఆదేశాలతో వీఆర్వో చెన్నకేశవులు వీఆర్ఏతో కలిసి శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా ప్రభుత్వ భూముల్లోకి ప్రవేశిస్తే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామన్నారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో మహబూబ్ జానీకి 24వ ర్యాంక్



దర్శి ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపల్లి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌జాని కానిస్టేబుల్ ఫలితాల్లో 24వ ర్యాంక్ సాధించాడు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకొని పోలీస్ ఉద్యో గంలో చేరాలనే దృక్పథంతో కానిస్టేబుల్ పరీక్ష రాశానని మహబూబ్‌జాని తెలిపారు. ఎస్‌ఐ ఉద్యోగానికి పరీక్షరాయగా రెండు మార్కులతో ఉద్యోగం కోల్పోయానని చెప్పారు. 142 మార్కులతో జిల్లాలో 24వ ర్యాంక్ రావడం ఆనందంగా ఉందన్నారు.

బైకును ఢీకొట్టిన ట్రాక్టర్... ముగ్గురికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండంలోని రెడ్డినగర్ సమీపంలో అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ముండ్లమూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన అనమనమూరి గోపాల్, దర్శి మండలం పోతవరం గ్రామానికి చెందిన కె.సుబ్బులు, శ్రీను గేదెను కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై అద్దంకి వైపు వెళుతున్నారు. ఈసమయంలో తాళ్ళూరు మండలం తురకపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో ఎరువును తీసుకువచ్చి రెడ్డినగర్‌లో ఒక రైతు పొలంలో పడవేసి తిరిగివెళుతున్నారు. ఈక్రమంలో ట్రాక్టర్ రహదారి ఎక్కుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 సిబ్బంది దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలి

దర్శి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. మండలంలోని పోతకమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సాయంత్రం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనాలు నడిపే విద్యార్థులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన పెంపొందించుకొని మోసాలకు గురికాకుండా ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థునులు అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

రహదారిని అభివృద్ధి చేయండి

ముండ్లమూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద ఉల్లగల్లు-వీరాయపాలెం పంచాయతీ రాజ్ రహదారి అధ్వాన స్థితికి చేరింది. దీంతో పలు గ్రామాల ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి అధ్వానం శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. తూర్పువీరాయపాలెం గ్రామానికి చెందిన అనీల్ అనే యువకుడు అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం రావటంతో రహదారి దుస్థితిని వివరించారు. వెంటనే కలెక్టర్ తమీమ్ అన్సారియాను మూడు నెలల్లోగా రహదారిని అభివృద్ధి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. నిధులు కూడా వెంటనే రహదారికి విడుదల చేయటం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి ప్రకటనతో పెద ఉల్లగల్లు, లక్ష్మీనగర్, వీరాయపాలెం గ్రామాల ప్రజలు, వాహనచోదకులు కృతజ్ఞతలు తెలిపారు.

రెసిడెన్షియల్ పాఠశాలలకు పెద్దన్నపాలెం విద్యార్థుల ఎంపిక

దొనకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దన్నపాలెం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు రెసిడెన్షియల్ పాఠశాలలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వర్లు తెలిపారు. మిండాల బాజీనవీన్ 5వ తరగతికి గణపవరం రెసిడెన్షియల్‌కు, మిండాల అనీల్ 6వ తరగతికి దేవరాజుగట్టులో రెసిడెన్షియల్ పాఠశాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి వీరు ఎంపికయ్యారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

పామూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సేవా దృక్పథం కలిగిన ప్రతిఒక్కరూ మానవతా సంస్థలో సభ్యులుగా చేరి సేవా కార్యక్రమాలు చేపట్టాలని సంస్థ చైర్మన్ కె.రామిరెడ్డి పిలుపునిచ్చారు. సంస్థకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సాయపడటమే మానవతా సంస్థ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బి.జయరామిరెడ్డి, బి.నారాయణరెడ్డి, వి.వెంకటేశ్వరరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు భారీగా తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

తాళ్లూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): దర్శి మండలం తూర్పువీరాయపాలెం గ్రామంలో సీఎం చంద్రబాబు శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి టీడీపీ తాళ్లూరు మండల నేతలు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వర రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీను, మాజీ మండల అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వేణుబాబు, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మానం రమేష్‌బాబు, టీడీపీ నేతలు ఐవీ రమణా రెడ్డి, రాచకొండ వెంకట్రావు, ఐ.శ్రీనివాస రెడ్డి, రామకోటిరెడ్డి, వీరనాగిరెడ్డి, కల్యాణ్ చక్రవర్తి, విద్యాసాగర్, కోనేటి వెంకట్రావు, వల్లభనేని సుబ్బయ్య, రామయ్య, మీరామొహిద్దీన్, రామలక్ష్మయ్య, పరిశుద్ధరావు, డానీ, ఆధ్వర్యాల్లో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. సీఎం చంద్రబాబు సభ సక్సెస్‌కు కృషి చేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులను ఘనంగా సత్కరించారు.



డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్‌దంపతులను సత్కరిస్తున్న తాళ్లూరు టీడీపీ నేతలు

ముండ్లమూరు: సీఎం చంద్రబాబు కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని మండు టెండల్లో సైతం లెక్క చేయకుండా విన్నారు. తరలి వెళ్ళిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ వరగాని పౌలు, సోమేపల్లి శ్రీనివాసరావు, సుంకర రాఘవరెడ్డి, కొక్కెర నాగరాజు, దేవినేని కోటేశ్వరరావు, మేదరమెట్ల వెంకటరావు, తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ పథకం కింద మంజూరైన రూ.28.74 కోట్ల చెక్కును ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు పీఎం కిసాన్ పథకం కింద ప్రధాని నరేంద్ర మోదీ, అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా సీఎం చంద్రబాబు చేతులమీదుగా రూ.5 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన సందేశాన్ని వీడియో ద్వారా రైతులకు ప్రదర్శింపచేశారు.

అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని కాంక్షించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదిలో రూ.20 వేలు నగదును వారి ఖాతాల్లో జమ చేయటం జరుగుతుందన్నారు. అందులోభాగంగా కనిగిరి నియోజకవర్గంలో 42వేల మంది రైతులకు మేలు చేకూరి, వారి బ్యాంకు ఖాతాల్లో రూ.28.74 కోట్ల నగదు జమ కానున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏడాదికి రూ.13,500 మాత్రమే ఇచ్చారన్నారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు ఇస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన చేయూతతో రైతులు ధైర్యంగా పంటలను సాగు చేసుకుని ఆర్థిక పురోగతి చెందాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఏ జైను లాబ్దిన్, ఏవో లు, నాయకులు శ్యామల కాశిరెడ్డి, భేరి పుల్లారెడ్డి, పాలపర్తి వెంకటేశ్వర్లు, నంబుల వెంకటేశ్వర్లు, పువ్వాడి వెంకటేశ్వర్లు, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), బొమ్మనబోయిన వెంగయ్య, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

నిధులు స్వాహా చేసిన విఠలాపురం సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

- సీఎంచంద్రబాబుకు వినతిపత్రం అందజేసిన టీడీపీ నేతలు
- తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు ఆదేశం

తాళ్లూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నిధులు స్వాహా చేసిన విఠలాపురం సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా శనివారం దర్శి మండలం తూర్పువీరాయపాలెంకు సీఎం చంద్రబాబునాయుడు వచ్చిన సందర్భంగా హెలిపాడ్ వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వినతి పత్రం ద్వారా అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో తాము గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద చేపట్టిన పనులకు వైసీపీ పాలనలో నిధులు విడుదలయ్యాయని తెలిపారు. వైసీపీ సర్పంచ్ మారం ఇంద్రసేనా రెడ్డి రూ.55 లక్షల నిధులను స్వాహా చేశారన్నారు. తాము చేపట్టిన పనుల తాలూకు నిధులు తమకు అందించేలా చర్యలు గైకొని, తమకు న్యాయం జరిగేలా చూడాలని టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, బాధితుడు, పార్టీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి మానం రమేష్ బాబు సీఎంను వేడుకున్నారు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆనిధులు గ్రామపంచాయతీ అకౌంట్‌కు జమ అయ్యాయన్నారు. విఠలాపురం సర్పంచ్ ఆనిధులను అక్రమ మార్గంలో స్వాహా చేశారని తెలిపారు. నగదు చెల్లించమని రాష్ట్రస్థాయి అధికారులు, కోర్టులు చెప్పినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలువగా డీపీవోను చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చినా నేటికి న్యాయం జరుగలేదన్నారు. తాము చేసిన పనుల తాలూకు స్వాహా చేసిన రూ.55 లక్షల నగదును తమకు అందించేలా చర్యలు చేపట్టి న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు స్పందించి ఈ సమస్యను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఆవినతిపత్రం అందజేశారు.



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ తాళ్లూరు మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, బాధితుడు మానం రమేష్‌బాబు

బిల్లులు ఇప్పించరూ..

ముండ్లమూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం కింద రూ.40 లక్షలతో చేసిన పనులకు బిల్లులు రాలేదని ముండ్లమూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు సీఎం చంద్రబాబుకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావటంతో బిల్లులు నిలిపివేశారన్నారు. దానికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయాయన్నారు.తూర్పువీరాయపాలెంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రిని మాజీ సర్పంచ్ వెంకటరావు కలసి బిల్లులు అడగటంతో వెంటనే జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో మాట్లాడారు. ఎన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయో చూసి వెంటనే వచ్చే విధంగా చూడాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో వెంకటరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.


అన్నదాత.. సుఖీభవ


రేపల్లె: మార్కెట్‌యార్డులో అన్నదాత సుఖీభవ చెక్కును రైతులకు అందిస్తున్న మంత్రులు అనగాని,పార్థసారథి, ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి



పర్చూరు : వ్యవసాయ మార్కెట్‌లో అన్నదాత సుఖీభవ చెక్కును రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


బాపట్ల: మార్కెట్‌యార్డులో అన్నదాత సుఖీభవ చెక్కును రైతులకు అందజేస్తున్న బాపట్ల శాసన సభ్యుడు వేగేశన నరేంద్రవర్మ


చీరాల: పాపాయపాలెం గ్రామంలో అన్నదాత సుఖీభవ చెక్కును రైతులకు అందజేస్తున్న చీరాల ఎమ్మెల్యే కొండయ్య


కొల్లూరు : ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం చెక్కును రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నా కాల్వల్లో సాగునీరు పరవళ్లు తొక్కుతుండగా.. వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం శనివారం 'అన్నదాత.. సుఖీభవ' అంటూ రైతుల ఖాతాల్లో నగదు జమ చేసింది. పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న తరుణంలో రూ.7 వేలు నగదు అందడంతో అన్నదాతల్లో ఆనందోత్సాహాల్లో తేలియాడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చినట్లుగా సూపర్ సిక్స్‌లో పథకాలను ఒక్కొక్కటి అమలు చేస్తోంది. ఈ క్రమంలో అన్నదాత సుఖీభవ పథకం అమలు ఎప్పుడెప్పుడా అని రైతులు చూస్తున్న తరుణంలో బ్యాంకు ఖాతాలకు నగదు జమ కావడంతో కర్షకుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. జిల్లాలో అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ పథకాన్ని శనివారం పండుగ వాతావరణంలో ప్రజాప్రతినిధులు, అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. కూటమి నేతలు, కార్యకర్తలు, రైతులు ఎక్కడికక్కడ ఈ కార్యక్రమాన్ని ఓ వేడుకలా జరుపుకున్నారు. పలు ప్రాంతాల్లో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు రైతులు పాలాభిషేకం చేసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం కంటే రూ.6,500 అదనంగా కూటమి ప్రభుత్వం అందస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు.



ఆర్థిక సాయంతో ఆనందోత్సాహాలు

- రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.7 వేలు జమ
- జిల్లాలో వేడుకలా సుఖీభవ పథకం ప్రారంభం
- 1,60,441 రైతులకు రూ.108.47 కోట్లు పంపిణీ


వినుకొండ : మార్కెట్ యార్డులో చెక్కును పంపిణీ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కలెక్టర్ అరుణ్‌బాబు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత కొన్ని రోజులుగా అన్నదాత సుఖీభవ పథకం అమలుకు సంబంధించి అధికారులు పెద్దఎత్తున కసరత్తు చేశారు. జిల్లాలోని ఏ రైతూ నష్టపోకుండా అర్హులందరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో తొలుత ప్రభుత్వం గత నెలలో జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచి అనర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. జిల్లాలో 2,39,959 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకాన్ని శనివారం ప్రారంభిస్తున్నట్లు ప్రకటించగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ నిధుల విడుదలకు ఏర్పాట్లు చేసింది. దీంతో జిల్లాలోని 1,60,441 మంది రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ రూ.2000, సుఖీభవ రూ.5000 వేర్వేరుగా రూ.108.47 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. తొలుత రూ.2,000 జమైనట్లుగా, ఆ తర్వాత రూ.5000 ఖాతాల్లో నగదు పడినట్లు వచ్చిన సందేశాలతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ క్రాప్ నమోదు చేసుకున్న కౌలు రైతులకు మాత్రమే సుఖీభవ అందుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

అట్టహాసంగా కార్యక్రమాలు

జిల్లా స్థాయిలో అన్నదాత సుఖీభవ పథక ప్రారంభోత్సవం రేపల్లె మార్కెట్‌యార్డు వేదికగా అట్టహాసంగా జరిగింది. ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి రైతులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి కొలుసు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా అమలు చేశామన్నారు.

కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో అన్నదాత సుఖీభవ పథకాన్ని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు ప్రారంభించారు. టీడీపీ జెండాలో నాగలి గుర్తు ఉందని, ప్రతి ఎజెండా రైతు సంక్షేమమే ధ్యేయంగా ఉంటుందన్నారు. అన్నదాతతోనే దేశ ప్రగతి సాధ్యం అని నమ్మిన పార్టీ టీడీపీ అని గుర్తు చేశారు.


తాడికొండ : లాం ఫాంలో రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కును అందజేస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

బాపట్ల మార్కెట్‌యార్డులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రైతులకు చెక్కులు అందజేశారు. పథకం లబ్ధిలో ఎవరికైనా సందేహం ఉంటే 155251 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సమస్య పరిష్కరించుకోవచ్చన్నారు.

పర్చూరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. రైతు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని ఆయన తెలిపారు.

పాపాయపాలెం గ్రామంలో రైతులతో కలిసి పథకం నిధులు విడుదల కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు.

అద్దంకి ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ వినుకొండ మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రతి ఏటా రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని గొట్టిపాటి తెలిపారు.

ఏబీసీ కాల్వకు.. సాగర్ నీరు

1 నీటి ఉధృతితో కొట్టుకుపోయిన డైవర్షన్ 1 వంతెన పనులకు ఆటంకం.. రాకపోకలు బంద్

బల్లికురవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అద్దంకి బ్రాంచ్ కాల్వ(ఏబీసీ) ఆయకట్టుకు శనివారం సాగునీరు విడుదలైంది. దీంతో ఏబీసీ కాల్వ వల్లాపల్లి సమీపంలో 33వ మైలు వద్ద నిర్మాణంలో ఉన్న హైలెవల్ వంతెన పనులకు ఆటంకం కలిగింది. తొలుత సాగర్ నుంచి విడుదలైన నీరు వంతెన పనులు ముగిసే వరకు ఏబీసీ కాల్వకు రాదని అధికారులు ప్రకటించారు. అయితే ఎగువ నుంచి అత్యధిక ఉధృతితో నీరు రావడంతో అధికారులు చేసేది లేక 600 క్యూసెక్కుల మేర దిగువకు వదిలారు. దీంతో హైలెవల్ వంతెన వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్‌కు వేసిన మట్టి నీటిలో కొట్టుకుపోయింది. దీంతో బల్లికురవ అద్దంకి రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన పనులు జరుగుతుంటే ఈ స్థాయిలో నీటిని ఎలా విడుదల చేశారని కొందరు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి ఉంటే ఏబీసీ కాల్వపై వంతెన పనుల్లో జాప్యం జరుగుతుందని పలువురు అంటున్నారు. ఎన్‌ఎస్పీ ఈఈ సతీష్, డీఈ రామకృష్ణ, జేఈ క్రాంతికుమార్‌లు కాల్వలో నీటి ఉధృతిని పరిశీలించి మిగిలిన కాల్వలకు మళ్లించారు. నీటి ఉధృతి తగ్గగానే పనులు చేపట్టేలా చూస్తామన్నారు.


ఏబీసీ కాలువ కట్టపై ఏర్పాటు చేసిన డైవర్షన్ నీటిలో కొట్టుకుపోయి కోతకు గురైన మట్టి


కాలువ కట్టకు గండి పడకుండా యంత్రంతో కట్టకు మట్టిని నింపిస్తున్న అధికారులు

వ్యవసాయ సీజన్‌లో పనులపై రైతుల ఆందోళన

వేసవిలో పనులు చేయాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవసాయ సీజన్‌లో అదీ నీరు విడుదల సమయంలో చేయటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎన్‌ఎస్పీ, ఆర్‌అండ్‌బీ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం తమ పాలిట శాపంగా మారిందని రైతులు తెలిపారు.

ఐదు దశాబ్దాలుగా.. సాగుకు వెతలు

పెరవలిపాలెం చానల్‌పై అడ్డుగోడ.. నీటి పారుదలకు ఇబ్బంది

వేమూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలిపాలెం చానల్ పరిధిలోని 2300 ఎకరాల రైతులు ఐదు దశాబ్దాల నుంచి సాగునీరు అందక అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా పెరవలిపాలెం చానల్ ద్వారా పెదరావూరు, మూల్పూరు భూములకు సాగునీరు అందాలి. అయితే 50 ఏళ్ల క్రితం పెరవలిపాలెం చానల్‌కు అడ్డుగా గోడ నిర్మించారు. దీంతో పెరవలి, పెరవలిపాలెం గ్రామాల పరిధిలోని భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో మురుగునీటి ఆధారంగా రైతులు ఖరీఫ్ సాగు చేసుకునేవారు. అయితే కాల్వల కింద గతంలో ఏర్పాటు చేసిన మురుగునీటి పైపులను కూడా తొలగించారు. మురుగునీటి కూడా పారుదల ఆగి పోవడంతో చేసేదిలేక భూగర్భ జలాలపై ఆధారపడి రైతులు సాగు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మోటార్లకు రోజుకు ఎనిమిది గంటల మాత్రమే సరఫరా ఇవ్వడంతో ఆ నీరు సరిపోక పంటలు ఎండిపోవడంతో రైతులు అల్లాడుతున్నారు. కనీసం 14 గంటలు విద్యుత్ సరఫరా ఇస్తే కానీ ఖరీఫ్ సాగుకు నీరు పెట్టుకునే అవకాశం ఏర్పడుతుందంటున్నారు. ఎత్తుగా కట్టిన లెవలింగ్ గోడ ప్రమాణాన్ని తగ్గించి తమ భూములకు సాగునీరు అందించాలని కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.


పెరవలిపాలెం చానల్‌పై లెవెల్ పెంచి కట్టిన గోడ


పెరవలి వద్ద నెర్రెలిచ్చి దెబ్బతింటున్న వెదసాగు

అందరూ కలిస్తేనే పరిష్కారం..

ఐదు దశాబ్దాల నుంచి ఉన్న సమస్యపై నీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు, రైతులు చర్చించి నిర్ణయం తీసుకుంటేనే పరిష్కారమవుతుందని నీటి పారుదల శాఖ ఏఈ శివరామకృష్ణ తెలిపారు. ఎత్తుగా కట్టిన గోడ లెవల్ తగ్గిస్తే మూల్పూరు తదితర ప్రాంతాల్లోని భూములకు నీరు సక్రమంగా అందదన్నారు.

బళ్ళారి జీవితం స్ఫూర్తిదాయకం

చిత్రపటానికి నివాళులర్పించిన అధికారులు

బాపట్ల రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బళ్ళారి రాఘవ కేవలం నటుడే కాదని, సామాజిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన కళాకారుడని ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జేసీ గంగాధర్‌గౌడ్ తెలిపారు. రంగస్థల నటుడు సామాజిక సంస్కర్త బళ్లారి రాఘవ జయంతి బాపట్ల కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ గంగాధర్, ఆర్డీవో గ్లోరియా, డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా, కలెక్టరేట్ సిబ్బంది బళ్ళారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బళ్ళారి తన నాటక ప్రదర్శనల్లో భావోద్వేగాలకు, వాస్తవికతకు ప్రాధాన్యం ఇచ్చేవారన్నారు. ఆయన నాటకాలు సమాజాన్ని చైతన్యపరిచేలా ఉండేవని కొనియాడారు.


బళ్ళారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జేసీ గంగాధర్‌గౌడ్, ఆర్డీవో గ్లోరియా, డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి

ఉచిత విద్యుత్ అమలుపై చేనేతల హర్షం

చెరుకుపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : చేనేతలకు ఈనెల నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చిన సందర్భంగా మండలంలోని కనగాలలో చేనేత కార్మికులు చంద్రబాబు నాయుడు, లోకేశ్, అనగాని సత్యప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచుమర్తి వీరరాఘవయ్య, జొన్నాదుల పూర్ణచంద్రరావు, గుర్రం సుబ్బారావు, మాచర్ల శ్రీనివాసరావు, మండూరు శ్రీనివాస్, మాచర్ల భానుకుమార్, అవ్వారు కుమార్ పాల్గొన్నారు.

శాశ్వతం.. స్నేహితం

స్నేహం....రెండక్షరాల ఓ చిన్న పదం.. కానీ, ప్రభావం మాత్రం అనంతం. మానవ జీవన గమనంలో ప్రతి దశలోనూ తోడుండి నడిపించే ఇంధనం. మతం, భాష, ప్రాంతీయ భేదాలు లేని మనిషి మూలధనం. తల్లిదండ్రుల తర్వాత వ్యక్తి జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే గొప్ప బంధం. ఓ వ్యక్తి జీవితం సరైన దిశలో సాగినా లేదా అస్తవ్యస్తంగా మారినా దాని వెనక తప్పనిసరిగా ఓ స్నేహితుడు ఉంటాడు. మంచైనా చెడైనా మన భవిష్యత్తును ప్రభావితం చేసేది మాత్రం ఈ స్నేహ బంధమే. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మారుతున్న స్నేహాలపై ప్రత్యేక కథనం..

కొత్త మార్గాల్లో స్నేహ హస్తాలు.. తగ్గిన స్నేహితుల సంఖ్య.. నేడు స్నేహితుల దినోత్సవం..

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

దశాబ్దం క్రితం వరకు ఒక్కొక్కరి స్నేహితుల జాబితా చాలా పెద్దదిగానే ఉండేది. ప్రస్తుతం స్నేహితులెంతమంది ఉన్నారనే ప్రశ్నకు నేటి యువత ఇస్తున్న సమాధానం ఇద్దరి, ముగ్గురి లోపే. అది కూడా ఎక్కువగా కళాశాల స్నేహాలే ఉంటున్నాయి. స్నేహ తత్వం మారకపోయినా మనుషుల ఆలోచనల్లో మాత్రం కొంత మార్పు కనబడుతోంది.

బాల్య స్నేహితులేరి..

వృద్ధాప్యంలో బాల్య స్నేహితులను కలిసినప్పుడు కలిగే మానసిక ఉల్లాసమే వేరు. గడచిన రెండు తరాలుగా ఇలాంటి స్నేహాలు కనిపించడం లేదు. కళాశాల రోజులకు వచ్చేసరికి స్కూల్ ఫ్రెండ్స్ దూరమవుతున్నారు. ఉద్యోగ జీవితంలోకి అడుగుపెట్టేసరికి కళాశాల స్నేహితులు కనిపించడం లేదు. తీరా సంసార జీవితంలోకి అడుగుపెట్టేసరికి అసలు స్నేహితులే లేకుండా పోతున్నారు.




స్నేహం..ప్రేమై..మళ్లీ స్నేహితులుగా..

యువతీయువకుల మధ్య స్నేహబంధాలు ప్రేమగా కూడా చిగురించడం సాధారణమే. పలు కారణాల వల్ల బంధం విచ్ఛిన్నమైతే.. మంచి స్నేహితులుగా అడుగులేసే ఆరోగ్యకర పరిణామం ఇటీవల కాలంలో కనబడుతోంది. ఇది మైత్రీ బంధం విలువను మరింత పెంచుతోంది.

ఆన్‌లైన్ స్నేహాలు..

ఆన్‌లైన్ స్నేహాలూ ఈ దశాబ్దంలో కొత్తగా పురుడుపోసుకున్నవే. నిజానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్నేహం ఏదైనా కావొచ్చు దాని విలువ మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే. కానీ, ముక్కూ మొఖం తెలియని వ్యక్తులకు స్నేహం ఎరవేసి తర్వాత ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న ఉదంతాలు ఇటీవల కోకొల్లలుగా వెలుగుచూస్తున్నాయి. ఇవన్నీ కూడా స్నేహ బంధానికి బీటలు వారేలాగా చేస్తున్నాయి.



యాప్ స్నేహితులు..

స్నేహితులను యాప్‌లలోనే వెతుక్కోవాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఏర్పడింది. యువత సమయం సగం సెల్ ఫోన్‌కే సరిపోతోంది. ఇలాంటి వారే టార్గెట్‌గా మిత్రులను సంపాదించుకోండనే ప్రకటనలు.. వస్తున్నాయి. స్నేహం వ్యాపార వస్తువుగా చూసే పయత్నాలు జరుగుతున్నాయి.

ఓదార్చే చేయి లేక.. 50 శాతం ఆత్మహత్యలు

ఇటీవల చిన్నచిన్న విషయాలకే కుంగుబాటుకు గురై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వీరిలో అధిక శాతం యువతే ఉండడం మరింత కలవరపరుస్తోంది. ఓ సంస్థ జరిపిన అధ్యయనంలో ఆత్మహత్య ఆలోచన వచ్చినప్పుడు సరైన స్నేహితుడు పక్కన ఉంటే దాని నుంచి బయటపడడం తేలిక అని తేల్చింది. బలవంతంగా ఉసురు తీసుకుంటున్న వారిలో 50 శాతం మరణాలు సాధకబాధకాలు చెప్పుకునే స్నేహబంధం లేకపోవడం వల్లేనని సర్వేలో తేలింది.

అవీ..ఇవీ..

నాగుల చెరువును పరిశీలించిన అధికారులు



ఇంకొల్లులో చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఇంకొల్లు, ఆగస్టు 2, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నాగుల చెరువును శనివారం తహసీల్దార్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కిరణ్ పరిశీలించారు. గత 15 రోజులుగా చెరువులో చేపలు మృతి చెంది నీరు కలుషితమై దుర్వాసన రావడంతో పంచాయితీ అధికారులు చర్యలు చేపట్టారు. సుమారు 100 బస్తాల గవ్వ సున్నం చల్లారు. ఈ నేపథ్యంలో అధికారులు చెరువును పరిశీలించారు. ఫిల్టర్ల బావులను పరిశీలించారు. పటిక సంచులను చెరువులో కలిసి నీటిని శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని పంచాయితీ అధికారి అడ్డగడ్డ వెంకటేశ్వర్లుకు సూచించారు. తహసీల్దారు శ్రీనివాసరావు అర్‌డబ్ల్యూఎస్ జేఈ జ్యోతితో మాట్లాడి ఫిల్టరు బావులు శుభ్రం చేయాలన్నారు. త్వరితగతిన నీటిని శుభ్రపరచి వాడుకునేందుకు ఉపయోగపడేలా గ్రామంలో సరఫరా చేయాలన్నారు.

5న నిరసన కార్యక్రమం

అద్దంకిటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రమాదకర విద్యుత్ స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని ఈ నెల 5న జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. శనివారం అద్దంకి బస్టాండ్ కూడలిలోని వ్యాపార సంస్థల వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి సాయిశ్రీ చరణ్

చినగంజాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయిశ్రీచరణ్ అన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని కోడూరివారిపాలెంలో శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాయిశ్రీచరణ్ మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే చినగంజాం పీహెచ్‌సీకి వచ్చి రక్త పరీక్షలు చేయించుకొని మందులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.చిరంజీవి, హెల్త్ అసిస్టెంట్ ఎస్.మురళి, 104 డీఈవో పొదిలి రాఘవ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం



తల్లిపాలు ఇచ్చేగది ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీడీపీవో, అధికారులు

చినగంజాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు తల్లి పాలు సహజ టీకాల వంటివని ఇంకొలు ప్రాజెక్టు సీడీపీవో జి.సులోచనరాణి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్రనావులు అన్నారు. 11వ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండల కార్యాలయాల సముదాయంలో తల్లి పాలు ఇచ్చే గదిని శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ కార్యాలయాలకు పనులు నిమిత్తం వచ్చే తల్లులు వారి చంటి బిడ్డలకు పాలు ఇవ్వడానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అనుకూలమైన వాతవరం ఉండేలా గదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఏపీవో గద్దె పెదసుబ్బారావు, చినగంజాం పీ.హెచ్.సీ వైద్యాధికారి సిరివెన్నెల, డీ.సీ.పీ.వో పి.పురుషోత్తం, ఎల్.సీ.పీ.వో పీ.మౌనిక, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎస్.సుమలత, కే.వాణిశ్రీ, కే.ఉషాకుమారి, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



బాలికలకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ అధికారి జయప్రద

పంగులూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎదిగే వయస్సులో బాలబాలికలలో కలిగే మార్పులు, పౌష్టికాహారం ప్రాధాన్యతలను ప్రతి విద్యార్థి గుర్తించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద అన్నారు. పంగులూరు ఉన్నత పాఠశాలలో బాలురు, బాలికలకు వేరువేరుగా ఏర్పాటు చేసిన కిశోర వికాసం కార్యక్రమాలలో పౌష్టికాహారం ప్రాధాన్యత, వ్యక్తిత్వంలో మార్పుల గురించి వివరించారు. విద్యార్థి దశలో చదువుపై దృష్టి సారించాలని, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను తెలిపారు. అదేవిధంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం. శ్రీనివాసరావు, కరీముల్లా, అంగన్‌వాడీ కార్యకర్తలు సుకన్య. సరోజిని, రజని, స్వర్ణలత, పీరాబి, ఏఎన్‌ఎం ఎస్తేరురాణి, ఆశా అంజమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

చినగంజాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు చీరాల శక్తి టీం సభ్యులు, చినగంజాం పోలీసు సిబ్బంది శనివారం గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో చీరాల శక్తి టీం ఇన్‌చార్జ్ హరిబాబు, చినగంజాం ఎస్.ఐ శీలం రమేష్‌లు మాట్లాడుతూ శక్తియాప్ మహిళలకు రక్షణ కవచంలాంటిదన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాని ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై, సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్స్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్.ఐ సీ.హెచ్.అనూష, శక్తి టీం సభ్యులు, పోలీసు సిబ్బంది, పాఠశాల హెచ్.ఎం కుర్రా రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వెంపరాల మేజర్‌పై ఛిద్రమైన కాలువకట్ట, పగిలిపోయిన సిమెంట్ లైనింగ్, భారీ వాహనాలు తిరగడంతో కాలువలోనికి వచ్చిన కట్టమట్టి, కాలువలో పెరిగిన చిల్లచెట్లు

అస్తవ్యస్తంగా వెంపరాల మేజర్

అద్దంకి,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): భారీ వాహనాల రాకపోకలతో వెంపరాల మేజర్ కాలువ కట్ట, సిమెంట్ లైనింగ్ ఛిద్రమైంది. వెంపరాల కొండ నుండి విజయవాడ-బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం గ్రావెల్‌ను వెంపరాల మేజర్ మీదుగా తరలిస్తున్నారు. దీంతో భారీ టిప్పర్ లు కాలువ కట్టల పై సుమారు రెండు నెలల పాటు ప్రయాణిస్తుండటంతో పలు చోట్ల సిమెంట్ లైనింగ్ దెబ్బతినటంతో పాటు కాలువ కట్ట కూడా పూర్తి గా దెబ్బతింది. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో కాలువ కట్ట ను ఒకింత పటిష్టం చేసుకొని గ్రావెల్ తరలించుకోవాల్సి ఉండగా ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకుండానే భారీ వాహనాలతో గ్రావెల్ తరలించారు. అప్పట్లోనే రైతులు అభ్యంతరాలు పెట్టినా గ్రావెల్ తరలింపు నిర్వాహకులు పెడచెవిన పెట్టారు. ఎన్ఎస్‌పీ అధికారుల దృష్టి కి తీసుకుపోగా రైతులనే బెదిరించే విధంగా మాట్లాడటంతో మరింత విమర్శలకు తావిచ్చింది. అంతటితో ఆగకుండా సాగర్ నీరు విడుదల సమయానికి దెబ్బతిన్న లైనింగ్ తో పాటు కాలువ కట్ట కు పూర్తి స్థాయి లో మరమ్మతులు చేస్తామని చెప్పారు. శనివారం వెంపరాల మేజర్ కు నీటి విడుదల జరగగా ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో పలు చోట్ల నీటి ప్రవాహం కు అడ్డంకి గా ఉండటంతో పాటు సిమెంట్ లైనింగ్ దెబ్బతిని ఉండటంతో కోతకు గురయ్యే ప్రమాదం కూడా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని వెంపరాల మేజర్ కు సిమెంట్ లైనింగ్ మరమ్మతులు, కాలువ కట్ట పటిష్టం పనులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

వసతిగృహంలో బాలిక జుత్తు కత్తిరింపు

చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్లో దురాగతం

తోటివారే చేశారంటున్న బాధితురాలు

హాస్టల్లో సాంఘిక సంక్షేమశాఖ డీడీ విచారణ



బాలికలను విచారిస్తున్న సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్

చీమకుర్తి,ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి ఎస్సీ బాలికల వసతిగృహంలో దురాగతం చోటుచేసుకుంది.శుక్రవారం అర్ధరాత్రి హాస్టల్లో అందరితో కలిసి బాలిక నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియనివారు జుత్తు కత్తిరించారు.తెల్లారి నిద్రలేచి బయోమెట్రిక్ హాజరు వేసే నిమిత్తం వస్తున్న సమయంలో తన జుత్తు ఎవరో కత్తిరించారన్న విషయాన్ని బాధిత బాలిక గుర్తించింది.జుత్తును కత్తిరించి క్లిప్‌లు పెట్టిన వైనాన్ని వార్డెన్ అరుణ దృష్టికి బాలిక తీసుకెళ్లింది.దీనిపై వసతిగృహంలో వార్డెన్ విచారించగా సంఘటనకు పాల్పడిన వారు ఎవరో తేలలేదు.వెంటనే సంఘటన గురించి జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి వార్డెన్ తీసుకెళ్లారు.ఈలోపు ఈ సంఘటన మీడియాలో గుప్పుమనటంతో రాజకీయరంగు పులుముకొంది. ఆ సమయంలో చీమకుర్తి లోనే ఉన్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున,వైసీపీ నాయకులతో కలిసి హాస్టల్‌ని సందర్శించి బాధిత బాలికను పరామర్శించి సంఘటన గురించి తెలుసుకున్నారు.తన తోటి బాలికలే ఈపనికి పాల్పడి ఉంటారని ఆ బాలిక నాయకులకు తెలిపింది.తదుపరి మీడియాతో మాట్లాడిన నాగార్జున ప్రస్తుత మంత్రి,ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేయటం గమనార్హం.

డీడీ లక్ష్మానాయక్ విచారణ

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆదేశాల మేరకు డీడీ లక్ష్మానాయక్ శనివారం వసతిగృహానికి విచ్చేసి సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపారు.బాధిత బాలికను పరామర్శించి ధైర్యం చెప్పారు.సహ బాలికలను సంఘటనపై అడిగి తెలుసుకున్నారు.తదుపరి జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన సంఘటన గురించి వివరించారు.అర్ధరాత్రి అందరూ నిద్రించేవేళ బాలిక జుత్తును కత్తిరించారన్నారు.ఈ సంఘటనలో బయటి వ్యక్తుల ప్రమేయంకు ఆస్కారమే లేదని తన విచారణలో తేలిందన్నారు. రెండురోజుల క్రితం హాస్టల్లో ఉన్న బాలికల మధ్య పుస్తకాల విషయంలో జరిగిన చిన్నపాటి గొడవతో ఈ సంఘటన జరిగి ఉంటుందేమో అని బాధిత బాలిక తన దృష్టికి తీసుకువచ్చిందన్నారు. వసతిగృహంలో బాలికల భద్రతకు ఎటువంటి డోకా లేదన్నారు.బయటి వ్యక్తులు హాస్టల్‌లోకి వచ్చే పరిస్థితులులేవన్నారు. అందరి బాలికల భద్రతకు తాము భరోసా ఇస్తున్నామన్నారు.

ఇది రైతుల ప్రభుత్వం



అన్నదాత సుఖీభవ చెక్కును అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ రమేష్

సంతమాగులూరు ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్‌లో భాగంగా మరొక పథకమైన అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రారంభించగా, శనివారం కొప్పరం రైతుసేవ కేంద్రంలో ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. కార్యక్రమానికి సంతమాగులూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ తేలప్రోలు రమేష్ పాల్గొన్నారు, సంతమాగులూరు మండలంలోని 22 గ్రామాల రైతులు 8871 కుటుంబాలు అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధిపొందనున్నారని కొప్పరం రైతుసేవా కేంద్రంలో 395 కుటుంబాలు లబ్ధి పొందారన్నారు. ఇది రైతుల ప్రభుత్వమని, రైతులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. రైతులకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సైదా, పంచాయతీ కార్యదర్శి కె పున్నారావు, సుజాత, ఏహెచ్ఏ రామారావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ నగదు జమ

ఇంకొల్లు : ఇంకొల్లు మండలంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద 6049 కుటుంభాలకు లబ్ది చేకూరినట్లు ఏవో మేరమ్మ తెలిపారు. శనివారం వారి ఖాతాల్లో నగదు జమ పడడం ప్రారంభించినట్లు తెలిపారు. మండలం మొత్తంలో రూ.4.27కోట్ల లబ్ధిదారులకు అందనున్నట్లు ఆమె తెలిపారు.

కారు ఢీకొని ట్రాక్టర్ మెకానిక్ మృతి

అద్దంకి, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీ కొనడంతో బైకుపై ప్రయాణిస్తున్న ట్రాక్టర్ మెకానిక్ షేక్ అల్లాఉద్దీన్(45) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు బల్లికురవ మండలం వల్లాపల్లికి చెందిన షేక్ అల్లాఉద్దీన్ అద్దంకి పట్టణంలో సుదీర్ఘకాలం నుంచి ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి అద్దంకిలో పని ముగించుకొని మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా కలవకూరు సమీపంలో వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అల్లాఉద్దీన్‌ను స్థానికులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫాతిమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

5న ఉచిత వైద్యపరీక్షలు

ఇంకొల్లు, ఆగస్టు 2,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ఈ నెల 5న పర్చూరులోని వైఆర్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిబిరంలో ఉత్తరప్రదేశ్‌కు సంబంధించిన వైద్యబృందం పాల్గొని ప్రత్యేక అవసరాలు గల 18 సంవత్సరాల లోపు పిల్లలకు పిల్లలకు ఉపకరణాల నిమిత్తం ఉచిత పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9741090759 నంబరును సంప్రదించాలన్నారు.

కేంద్ర మంత్రి పెమ్మసానితో ఎమ్మెల్యే ఏలూరి భేటీ



మంత్రి పెమ్మసానితో ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో శనివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజయవాడలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రితో ఆయన చర్చించారు. ప్రధానంగా గుంటూరు నుంచి ఎన్‌జీపాడు వయా పర్చూరు - ఇంకొల్లు ఓల్డ్ మద్రాస్ రోడ్డు 83 కిలోమీటర్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కోరారు. ఇప్పటికే ఈ రహదారి అభివృద్ధి కోసం కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరికి లేఖ రాశానని ఆయన దీనిపై సానుకూలంగా స్పందించనట్లు తెలిపారు. త్వరిత గతిన రోడ్డు అభివృద్ధికి ప్రత్యేక దుష్టి చూపాలని కోరామన్నారు. అదేవిధంగా పర్చూరు వరకు గుంటూరు ఛానల్‌లను పొడిగించే పనులు చేపట్టేలా చొరవ చూపాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించినట్లు తెలిపారు. త్వరిత గతిన గుంటూరు ఛానల్ పొడిగింపు పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నట్లు ఈ సందర్భంగా ఏలూరి తెలిపారు.

రెండు ఓట్లు కలిగి ఉంటే ఏడాది జైలు

● ఆర్డీవో లక్ష్మీప్రసన్న



మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎవరైనా రెండు ఓట్లు కలిగి ఉంటే చట్ట ప్రకారం నేరమని ఆర్డీవో లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో శనివారం గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు, చట్టప్రకారం రెండు ఓట్లు కలిగి ఉంటే ఎన్నికల నిబంధనల ప్రకారం సెక్షన్ 31, ఆర్‌పీఏ-1950 యాక్టు ప్రకారం ఏడాది జైలు శిక్ష లేదా లక్ష రూపాయాల జరిమానా విధించాల్సి వస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎక్కడ నివాసం ఉంటే అక్కడే తమ ఓటుహక్కు కలిగి ఉండేలా రాజకీయపార్టీలు సహకరించాలన్నారు. ప్రతినెలా గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి నుంచి వచ్చే సూచనలు, సలహాలు తీసుకొని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. ఒంగోలు నియోజకవర్గంలో రెండేసి ఓట్లు కలిగి ఉన్నవారు ఒక ఓటును రద్దు చేసుకోవాలని కోరారు. రెండో ఓటును రద్దు చేసుకోకుంటే కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నేరంగా పరిగణించాల్సి వస్తోందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లో 1200 ఓట్ల కంటే ఎక్కువ కలిగిన బూత్‌ల్లోని ఓట్లను పక్కనే ఉన్న మరోక పోలింగ్ కేంద్రానికి మారుస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్ళు నిండిన యువతీ, యువకులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు స్వరూప్, ఎస్‌కే.రసూల్, డీఎస్.క్రాంతికుమార్, గుర్రం సత్యనారాయణ, డీటీ కృష్ణమోహన్, ఏసీపీ సుధాకర్, టీపీవో బాబురావు, రామ్‌భూపాల్ రెడ్డి, పద్మజ, నాయుడు, శేషుబాబు, సలోమి, సాయి, దాసు, మంజు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రజాప్రభుత్వ లక్ష్యం

● మారిటైం బోర్డు చైర్మన్ సత్య



మాట్లాడుతున్న దామచర్ల సత్య

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 2 : రైతుల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. మండలంలోని కె.బిట్రగుంటలో శనివారం ఆయన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే అమలు చేస్తున్నదన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా పేదల కోసం అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో నియోజకవర్గంలోని 36,808 మంది రైతులకు రూ. 25 కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు. రైతుల కోసం ప్రభుత్వం సబ్సిడీపై యంత్ర పరికరాలు, డ్రోన్‌లు ఇస్తున్నదన్నారు. ఈనెల లోనే కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందు తాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్ర యాణ సౌకర్యం కూడా అమలులోకి వస్తుందని చెప్పారు. ఈసందర్భంగా దర్శి మండలం తూర్పువీరాయపాలెం నుంచి సీఎం చంద్రబా బు అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్స వ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారా యణ, ఎంపీపీ బెల్లం నిర్మల, టీడీపీ సీ నియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబా బు, దగ్గుమాటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

టంగుటూరు (కొండ పి): అన్నదాత సుఖీ భవ - పీఎం కిసాన్ పథకంలో తొలి విడత రూ.7 వేల ఆర్థిక సాయం అందించినందుకు కృతజ్ఞతగా ఎం.నిడమానూరులో రైతులు సీ ఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాకుమాని శ్రీకాంత్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఈ కార్యక్ర మాన్ని నిర్వహించారు. కాకుమాని శ్రీనివాస్, సురేష్, అన్నపరెడ్డి కనకరాజు, బెజవాడ శివ య్య, మాధవ, వాకా కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, కా వూరి సుబ్బయ్య పాల్గొన్నారు.

ఖాతాల్లో రూ.4.44 కోట్లు జమ

పొన్నలూరు : అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కింద మండలంలోని 7,645 మంది రైతుల ఖాతాల్లో రూ.4.44 కోట్లు జమ అయ్యాయి. రైతు సేవా కేంద్రాల వద్ద శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. పొన్నలూరులో వ్యవసాయాధికారి వి.రాము, టీడీపీ మండల నాయకుడు మండవ మురళీమోహన్, వ్యవసాయ సహాయకులు ఇ.సుధీర్, వెంకటనారాయణ, సుష్మ, సబియా, రాకేష్, మౌలాలి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కను నాటుతున్న ఎంఈవో వెంకారెడ్డి

సంతనూతలపాడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంఈవో వెంకారెడ్డి తెలిపారు. శనివారం సంతనూతలపాడులోని షైనింగ్‌స్టార్ ఎలైట్ స్కూల్ ఆధ్వర్యంలో పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉంటోందని, తద్వారా కాలుష్యం పెరుగుతుందని చెప్పారు. అందువల్ల పర్యావరణ పరిరక్షణ కోసం విధిగా మొక్కలను నాటాలన్నారు. తద్వారా స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన వాతావరణం లభిస్తుందని ఆయన తెలిపారు. అనంతరం ఎంఈవో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సీహెచ్.అనిత, ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రాతపరీక్షలో 'శ్రీవికాస్' ప్రతిభ



పావనిని అభినందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సివిల్ పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షల్లో ఒంగోలులోని శ్రీవికాస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు సత్తా చాటారు. అత్యధిక మార్కులు సాధించి సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు. కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన దర్శికి చెందిన షేక్ ఫజులూన్ రాష్ట్ర స్థాయిలో 173వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపిక కాగా జె.పంగులూరుకు చెందిన పి.పావని 120 మార్కులతో ఉద్యోగానికి ఎంపికయారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక కోచింగ్ సెంటరులో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను కరస్పాండెంట్ కె.మోహనరావు, డైరెక్టర్ వీరయ్య అభినందించారు. అలాగే శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను సత్కరించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో శనివారం విద్యార్థులు విలువలతో వికాసం అనే అంశంపై నృత్య ప్రదర్శనను నిర్వహించారు. ఆరో తరగతి విద్యార్థులు తమ ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. నేటితరంలో నైతిక విలువల, మంచి ప్రవర్తన, సామాజిక బాధ్యతల అవసరాన్ని, దయ, నిజాయితీ, గౌరవం, సహకారం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శశిలక్ష్మి మాట్లాడు తూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతా యని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఉపాధి సొమ్ము రాలేదని కూలీల ఆందోళన



వేతనం రాలేదని ఆందోళన చేస్తున్న కూలీలు

బల్లికురవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తాము ఉపాధి పనులు చేసి రెండు మాసాలు గడుస్తున్నా, ఇంత వరకు నగదు చెల్లింపులు జరగలేదని కూలీలు ఆందోళన చేపట్టారు. ఎస్ఎల్.గుడిపాడు పంచాయతీ శివారు గ్రామం సుజాత నగర్ కాలనీలో రోజు వారీ కూలీలు సుమారు వంద మంది పైబడి, మే, జూన్, మాసాల్లో ప్రతి రోజు ఉపాధి పనులకు వెళ్లారు. కాని ఇంత వరకు తమకు కూలి చెల్లింపులు చేయలేదని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు రావాల్సిన కూలి నగదు సంగతి ఏమిటని అడిగిన ఎవరు సమాధానం చెప్పడం లేదని కూలీలు అరోపిస్తున్నారు. కూలి నగదు రాకపోవడంతో తాము ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు వెంటనే స్పందించి తమకు కూలి నగదు చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీ కొన్న ప్రైవేట్ బస్సు

మోటర్ సైకిలిస్ట్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

మేదరమెట్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మేదరమెట్లలో పాత హైవేలో ప్రైవేట్ బస్సు మోటర్ సైకిలిస్ట్‌ను ఢీ కొన్న ఘటనలో మోటర్ సైకిలిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం గ్రోత్ సెంటర్‌లోని గ్రానైట్ ఫ్యాక్టరీకి ఉద్యోగులను తరలించే బస్సు మోటర్ సైకిల్‌ను ఢీ కొట్టింది. అనమనమూరుకు చెందిన కవల సాంబశివరావు(45) మోటర్ సైకిల్‌పై వెళ్తాండగా కళ్యాణ మండపం ఎదురుగా ప్రైవేట్ బస్సు ఢీ కొంది. ప్రమాదంలో సాంబశివరావు తీవ్రంగా గాయపడి అ క్కడికి అ క్కడే చనిపోయ్యాడు. మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లతో కలిసి గ్రంథాలయం సందర్శన

పాత నేరస్థులకు సీఐ శేషగిరిరావు వినూత్న కౌన్సెలింగ్



గాంధీజీ చేతికర్రను పాతనేరస్థుకు చూపుతున్న సీఐ శేషగిరిరావు

వేటపాలెం (చీరాల), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పాత నేరస్థులు నేరాలకు దూరంగా కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని, ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీజీ మార్గంలో నడవాలని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. శనివారం రౌడీషీటర్లకు ఎస్సై జనార్ధన్‌తో కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. వేటపాలెం లైబ్రరీలో గాంధీజీ వేటపాలెం పర్యటన సమయంలో వదిలి వెళ్లిన చేతి కర్రను ప్రదర్శిస్తూ, ఆ గ్రంథాలయంలో లభించే విలువైన పుస్తకాలపై నేరస్థులకు అవగాహన కల్పించారు. జీవితంలో ప్రతి గంట విలువైనదన్నారు. శిక్షలతో జైళ్లల్లో నలిగి పోవడం బాధాకరమని సూచించారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని హితవు పలికారు. కుటుంబంలో చిన్నారులకు చక్కగా చదివించి ఉన్నతంగా తీర్చి దిద్దాలని కోరారు. వారి వెంట లైబ్రరీయన్ శ్రీవల్లి ఉన్నారు.

పౌష్టికాహారంతోనే చక్కని ఆరోగ్యం

- నియోజకవర్గంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



ఈపూరుపాలెంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రసన్న, అంగన్వాడీలు

చీరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా పసిబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఈపూరుపాలెం సూపర్‌వైజర్ ప్రసన్న, అర్బన్ సూపర్‌వైజర్ కవితశ్రీ అన్నారు. సీడీపీవో ఝాన్సీ సూచనల మేరకు శనివారం నియోజకవర్గం పరిధిలోని ఈపూరుపాలెం, చుక్కయ్యపేట, వాడరేవు, తోటవారిపాలెం, మున్సిపాలిటీ పరిధిలోని పాపరాజుతోట, వెంకటేశ్వరనగర్, ఉసిరికపాలెం ప్రాంతాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తల్లిపాలతో బిడ్డలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈసందర్భంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహనతో పాటు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సత్యవేదం, ఇంద్రాణి, రోజాకుమారి, గ్లోరీ, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డ్రోన్ డెవలప్‌మెంట్ యూజింగ్



డ్రోన్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాపు నిర్వహిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న డ్రోన్ డెవలప్‌మెంట్ యూజింగ్ ఏఐపై వర్క్‌షాపు ప్రశాంతంగా ముగిసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. హైదరాబాదుకు చెందిన ఆర్టిన్ స్మార్ట్, ఈపీఐటీ రీసెర్చ్‌ల్యాబ్స్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు శిక్షణతో ఉపయోగకరమని చెప్పారు. ప్రిన్సిపల్ డా.జగదీష్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆధ్యాత్మిక ప్రవచనం

చీరాల, ఆగష్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక పీఠం చీరాల వారి ఆధ్వర్యంలో నేడు ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మబోధ అంశంపై జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు హాజరై మానసిక ప్రశాంతత పొందాలని పీఠం ప్రతినిధులు కోరారు.

రైతన్నా.. సుఖీభవ

- అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీ
- చీరాల, అద్దంకిలో పాల్గొన్న ఎమ్మెల్యేలు
- ఖరీఫ్ ముంగిట రైతులకు సాయం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య

పాపాయిపాలెం(చీరాల), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతులను రాజులుగా మార్చే బాధ్యత కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా. చంద్రబాబు నాయుడు తీసుకున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శనివారం వేటపాలెం మండల పరిధిలోని పాపాయిపాలెంలో అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో రైతు సమస్యలు పరిష్కారం కావడం లేదని, సంక్షేమాలు అందడం లేదని' నటన పూర్వకమైన పరామర్శలకు జగన్‌రెడ్డి తెరలేపారని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం సుమారు రూ.10 లక్షల కోట్లు అప్పుల్లో ఉన్నట్లు చెప్పారు. అయినప్పటికీ, వెనక్కు తగ్గకుండా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు పథకాలను దిగ్విజయంగా పూర్తి చేయగా. తాజాగా అన్నదాత సుఖీభవ, అలాగే ఈ మాసంలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. ఈవిధంగా రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతుంటే తప్పుడు ప్రచారాలు చేస్తూ జగన్‌రెడ్డి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. వీలయినంత త్వరలో జగన్ జైలుకు వెళ్లడం ఖాయన్నారు. ప్రభుత్వ సుభిక్షపాలన ఓర్వలేకే తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్లు వివరించారు. 7368 మంది రైతులకు రూ.4.59 కోట్లు చెక్కుల పంపిణీ చేశారు. అంతుకు ముందు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏర్పాటు చేసిన ప్రదర్శనలు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, హ్యాండ్‌లూమ్ చైర్మన్ హేమలత, ఏఎంసీ చైర్మన్ జనార్థనరావు, ఏడీఏ రత్నకుమారి, ఏవోలు నిర్మల, సరిత పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అద్దంకి ఏఎంసీ కమిటీ ఉపాధ్యక్షుడు ధర్మవరపు నాగేశ్వరరావు అన్నారు. శనివారం అద్దంకి మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మూడు విడతలలో ఒక్కో కుటుంబానికి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు రాయితీపై అందిస్తుందన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటి మాజీ చైర్మన్, టీడీపీ బాపట్ల జిల్లా ఉపాధ్యాక్షుడు నాగినేని రామకృష్ణ మాట్లాడుతూ పొగాకు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేస్తోందన్నారు. దాని కోసం ప్రభుత్వం రూ.300 కోట్లు విడుదల చేసిందన్నారు. 80శాతం రాయితీపై వ్యవసాయ డ్రోన్‌లు అందిస్తుందన్నారు. ఏడీఏ బి.ఎఫ్రాయిం మాట్లాడుతూ నియోజకవర్గంలో 40288 మంది రైతు కుటుంబాలకు రూ.27.62 కోట్ల పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సహాయం రైతుల ఖాతాలల్లో జమచేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీచరణ్ మాట్లాడుతు జిల్లాలో ఎక్కువ మంది రైతులు అద్దంకి నియోజకవర్గం రైతులు కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇంకా ఎ వరైనా ఆధార్ తప్పుగా ఉన్న రైతులు వెంటనే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు సంబంధించి ప్రాపర్ పర్సన్ సర్టిఫికెట్ తీసుకుని ప్రభుత్వ పథకం పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ పాల్గొన్నారు.



చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు : రైతులకు వెన్నుదన్నుగా ప్రజా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతాంగానికి టీడీపీ, జనసేన, బీజేపీ ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు జమచేయనున్నట్లు తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం నిధులు జమచేసే పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏలూరి మాట్లాడుతూ సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు మొత్తం ఏడాదికి రూ.20వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తున్నట్లు ఏలూరి పేర్కొన్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 4685838 రైతు ఖాతాల్లో రూ.3174 కోట్లు జమ చేయటం జరుగుతుందన్నారు. ఒక్క పర్చూరు నియోజకవర్గంలో 37,861 వేల మంది రైతుల ఖాతాల్లో రూ.26,19,000 కోట్లు జమ కానున్నట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెనువెంటనే రైతులకు అవసరమైన వ్యవసాయ ఉపకరణాలు, డోన్‌లు, విత్తనాల సైతం అందజేస్తున్నట్లు తెలిపారు. కొమ్మమూరు కాలువను ఆధునీకరించి చివరి భూములకు వరకు సాగునీరు అందించే విధంగా ప్రస్తుతం పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, డ్వామా పీడీ విజయలక్ష్మీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఏడీఏ ప్రవీణ, ఎంపీడీవో ప్రద్యూమ్నా కుమార్, తహశీల్ధార్ పి.బ్రహ్మయ్య, ఏవో భాస్కర్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వం క్విజ్ పోటీలలో కేఆర్‌కే విద్యార్థుల ప్రతిభ



పోటీలలో విజేతలైన విద్యార్థులతో అధ్యాపకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో అద్దంకిలోని కేఆర్‌కే ప్రభుత్వ కళాశాల విద్యార్థులు విజయం సాధించి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం కళాశాల నందు ప్రిన్సిపాల్, అధ్యాపకులు విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు మాట్లాడుతూ ఆర్‌టీఐ చట్టం-2005 వచ్చి రెండు దశబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో వివిధ స్థాయిలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించింది. అందులో భాగంగా ఒంగోలులోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఎన్ఆర్‌సీ ఒంగోలు స్థాయిలో వివిధ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డిబెట్, క్విజ్ ఎ ో ట ో ల ు నిర్వహించారు. ఈ పోటీలలో కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొ న్నారు. వక్తృత్వం పోటీలలో ఆకాష్ ప్రథమ స్థానంలో నిలిచాడు. క్విజ్ పోటీలలో ఆకాష్, తిరుపతమ్మ, లెనిన్ బృందంకి ప్రథమ స్థానం సాధించారు. డిబెట్‌లో ఆకాష్, రేణుకలు ద్వితీయ స్థానం సాధించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్యాణి అభినందించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈ నెల 6న గుంటూరు ప్రభుత్వ కళాశాలలో జరిగే జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ మోహనరావు తెలిపారు. విజేతలుగా నిలిచి కళాశాలకు పేరు తెచ్చిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన అధ్యాపకులను ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

పంట పొలాల ముంపు సమస్యకు పరిష్కారం



పొలాల్లోని నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేస్తున్న తూములు

పర్చూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి 167(ఏ) విస్తరణలో భాగంగా పర్చూరు మండల పరిధిలోని తిమ్మరాజుపాలెం గ్రామం సమీపంలో చేపడుతున్న రోడ్డు నిర్మాణంతో వ్యవసాయ భూములకు వెళ్లే డొంకలు మూసుకుపోయాయి. దీంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. ఎక్కడ మురుగునీరు అక్కడే నిలిచిపోయి పంట పొలాలు ముంపునకు గురయ్యే పరిస్థితి నెలకొంది. దీనిపై చర్యలు చేపట్టాలని అధికారులకు రైతులు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో రైతులు రోడెక్కి నిరసన గళం సైతం వినిపించారు. అయినప్పటికీ, సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. జాతీయ రహదారి పనులు చేపడుతున్నా, వాహనాలను నిలిపివేసి రోడ్డుపై పెద్దఎత్తున బైఠాయించి నిరసనలు తెలిపారు. రైతులు పడుతున్న ఇబ్బందులతో పాటు సమస్య తీవ్రతను తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జాతీయ రహదారి కాంట్రాక్టు ప్రతినిధులతో పాటు, అధికారులతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. దీంతో హైవే యంత్రాంగం యుద్ధ ప్రాతిపతికన చర్యలకు శ్రీకారం చుట్టింది. చర్యల్లో భాగంగా భూములకు వెళ్లే డొంకదారులకు 26 తూములను ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ రూపొందించి పనులు చేపట్టారు. అదేవిధంగా గ్రామం సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద మురుగునీరు పంటపొలాల్లోకి వెళ్లకుండా సిమెంట్ కాలువను ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి.

శింగరకొండ దేవస్థాన ట్రస్టీల నియామకం



ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు

అద్దంకి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ట్రస్టీలను నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు ఇచ్చారు. ట్రస్టీలుగా గుంజి శ్రీనివాసరావు, మంగమూరి సురేష్, దాసరి రామాంజనేయులు, రుద్రు ఆదిలక్ష్మి, కొడిమెల కోటేశ్వరమ్మ, చీమలదిన్నె వెంకటరమణ, కస్తూరి లక్ష్మీప్రసూన, బత్తుల సరిత, అద్దంకి ఆదిలక్ష్మిలతో పాటు ఎక్స్‌ఆఫీసియో సభ్యులుగా భాగవతుల నరసింహాచార్యులను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిలో గుంజి శ్రీనివాస రావును చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు.

భక్తుల కోలాహలం

అద్దంకి : శింగరకొండకు శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గొర్రెల కాపరులు తమ గొర్రెల మందలతో వచ్చి దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆకు పూజలు, వాహన పూజలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గొర్రెల మందలకు రంగులు చల్లి దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేయించారు.



లక్ష్మీనరశింహస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

న్యాయాధికారి పూజలు

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి, లక్ష్మీ నరశింహస్వామి దేవాలయాలలో శనివారం అద్దంకి సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం పూజారులు ఆశీర్వదించి, సత్కరించారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల

బల్లికురవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుధ తెలిపారు. శనివారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో కిషోర వికాసం అనే కార్యక్రమంలో భాగంగా తల్లి పాల వారోత్సవల గురించి వివరించారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతు గుడ్ టచ్ , బ్యాడ్ టచ్‌పై బాలికలు అవగాహన పొందాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ విజయనిర్మలా అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): కొత్తవిద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఓవర్ హెడ్‌ట్యాంక్ కూల్చివేత పనులు జరుగుతున్నందున ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, గీతామందిరం రోడ్డు పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

అద్దంకి, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇరువురుని కోర్టు లో హాజరుపరచగా న్యాయాధికారి అఖిల రూ.8 వేల అపరాధ రుసుము విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. మద్యంసేవించి ద్విచక్ర వాహనం నడిపిన ఒకరికి రూ.5 వేలు, మరొకరికి రూ.3 వేల అపరాధరుసుము విధించినట్లు తెలిపారు.

రుణాలు వసూలు చేయని సిబ్బందిపై చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాద్‌బాబు

అద్దంకిటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల వద్ద పేరుకుపోయిన మొండి బాకాయిల వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటిని వారం రోజులల్లో వసూళ్ల చేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏపిఎం జ్యోతి ప్రసాద్‌బాబు అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘ అధ్యక్షులు, సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపియం మాట్లాడుతు మండలంలోని ఆ యా గ్రామాల పరిధిలో సిఐఎఫ్, ఉన్నతి, 70 లక్షలు, స్త్రీ నిధి 38 లక్షలు బకాయిలు పేరుకుపోయాయని, వాటి వసూళ్లకు సిబ్బంది, వి వోఏలు, గ్రామ సంఘ ప్రతినిధులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్, సిసిలు బ్రహ్మయ్య, విజయరాణి, యేసయ్య, అకౌంటెంట్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు పుస్తకాల పంపిణీ

యద్దనపూడి,(మార్టూరు)ఆగస్టు2(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, వారికి పుస్తకాలను, పతకాలను బహుమతిగా అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ దార్ల బుజ్జిబాబు, చంద్రం, ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డి, ఉపాధ్యాయులు రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ల పంపిణీ



పెన్షన్ అందుకున్న మహిళలతో అధికారులు, టీడీపీ నాయకులు

మార్టూరు, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్టూరు పట్టణంలో 32 మంది మహిళలకు కొత్తపెన్షన్లను పంపిణీ చేశామని టీడీపీ పట్టణ అధ్యక్షులు కామినేని జనార్దన్ అన్నారు. శనివారం మార్టూరులో గ్రామ పంచాయతీ ఆవరణలో నాలుగు సచివాలయాల పరిధిలోని 32 మందికి కొత్తగా మంజూరైన పెన్షన్లను నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు, నాయకులు షేక్ రజాక్, తొండెపు ఆదినారాయణ, జంపని శ్రీను, కమ్మ శివనాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకట్రావు, రామకృష్ణ, మందపాటి అంజయ్య, ముక్తిపాటి సాయిబాబా పాల్గొన్నారు.

ప్రజాక్షేమమే లక్ష్యంగా సుపరిపాలన

- దేశాయిపేటలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

దేశాయిపేట(చీరాల), ఆగష్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజాక్షేమమే లక్ష్యంగా నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. శనివారం వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ రామనగర్‌లో నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, యువనాయకులు గౌరీ అమరనాథ్‌తో కలిసి సుపరిపాలన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అభివృద్ధి పనులను వివరించడంతో పాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి అందిన అర్జీలు స్వీకరించారు. ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

చీరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ప్రయాణి కుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చీరాల - స్టువర్టుపురం రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. మృతుని వద్ద ఎటువంటి ఆనవాళ్లు లేవు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం

దేశాయిపేట (చీరాల), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం దేశాయిపేట ప్రాథమిక పాఠశాలలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసాయి పిల్లలు, చెవి, ముక్కు, గొంతు వైద్యశాల వైద్యులు డా.ఎన్ రవికుమార్, డా.సాయిస్వరూప్ డాక్టర్ శృతి పాల్గొని చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ మల్లేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 3 ఆగస్టు 2025



ఎన్నో ఏళ్ల కల.. నెరవేరిన వేళ!

● కానిస్టేబుళ్ల పోస్టులకు ఎంపికైన యువతలో ఆనందం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి మూడేళ్ల క్రితం (2022) నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక పరీక్షను నిర్వహించి ఫలితాలు విడుదల చేసి నిరుద్యోగుల్లో ఆశలు రేపింది. రోజులు గడుస్తున్నా కనీసం దేహదారుఢ్య పోటీలూ నిర్వహించలేదు. ఇక ఈ ప్రక్రియ ఈ నోటిఫికేషన్ ముందుకు సాగేది లేదని భావించిన ఎంతో మంది నిరుద్యోగులు ప్రైవేటు ఉద్యోగాలు, ఇతర ఉపాధి అవకాశాలను వెతుక్కున్నారు. అయితే, గతేడాది అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో నిరుద్యోగుల ఆశలను నెరవేరుస్తూ 2022లో విడుదలైన కానిస్టేబుల్ నోటిఫికేషన్ ప్రక్రియను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేసింది. దేహదారుఢ్య పరీక్షలు పూర్తి చేసి మెయిన్స్ పరీక్షలు నిర్వహించి ఈ నెల 1వ తేదీన తుది ఫలితాలను విడుదల చేసి ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 158 మంది కానిస్టేబుల్ పోస్టులు సాధించారు. ఇక రావనుకున్న ఉద్యోగాలు తమ తమ దరిచేరడంతో ఆ నిరుద్యోగుల సంబరాలు అంబరాన్ని తాకాయి. వారిలో కొందరు తమ ఆనందాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

నా కల నెరవేరింది!



నాది గూడూరు మండలం నెర్నూరు. తల్లిదండ్రులు సూరాబత్తిన రామచంద్రయ్య, దొరశానమ్మ కూలి పనులు చేసుకుంటూ డిగ్రీ వరకు చదివించారు. సమాజంలో మహిళలను చిన్న చూపు చూడటం, మహిళలకు ఉద్యోగాలు అవసరమా అన్న మాటలు వింటూ పెరిగాను. ఎలాగైనా పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నా. 2022లో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకు నోటిఫికేషన్ విడుదల అయ్యింది. దరఖాస్తు చేసుకొన్న కొద్ది రోజులకు ప్రాథమిక పరీక్ష నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. ఆ తర్వాత కోర్టు కేసులు, ఏవోవో కారణాలతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే దేహదారుఢ్య, మెయిన్స్ పరీక్షలు నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేయడం ఆనందంగా ఉంది. నా భర్త ఎస్ చక్రవర్తి, అత్తమామలు, తల్లిదండ్రుల సహకారంతో నేను ఈ ఉద్యోగం సాధించాను.

- ఎస్.వసంత, గూడూరు

నమ్మకం కోల్పోలేదు!



నెల్లూరులోని వెంగళరావునగర్ మాది. నాన్న అంకయ్య కార్మిక శాఖలో ఉద్యోగం చేస్తూ రిటైర్డ్ అయ్యారు. అమ్మ శంకరమ్మ ఇంట్లోనే ఉంటారు. పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలని 2018 నుంచి ప్రయత్నిస్తున్నాను. 2022లో నోటిఫికేషన్ విడుదల చేసినా ప్రాథమిక పరీక్ష మాత్రమే నిర్వహించి వదిలేశారు. ఇక ఈ ఉద్యోగాలు భర్తీ చేయరని అందరూ నమ్మకం కోల్పోయారు. నేను మాత్రం ఖచ్చితంగా ఉద్యోగం సాధిస్తానన్న నమ్మకంతో ఉన్నాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో త్వరలోనే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారని ఆశించాను. అయితే సంవత్సర కాలంలోనే ఉద్యోగంలో చేరేలా చర్యలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది.

- బండారు చంద్రబాబు, నెల్లూరు

నా కలను ప్రభుత్వం నెరవేర్చింది!



దగదర్తి మండలం నారాయణపురంలో నా తల్లిదండ్రులు వెంకయ్య, రత్నమ్మ వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివించారు. మాది చాలా పేద కుటుంబం కావడంతో చిన్నతనం నుంచే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంతో చదువుకున్నాను. 2022లో కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ కావడంతో ఎంతో ఆనందంగా దరఖాస్తు చేసుకున్నాను. ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత కావడంతో దేహదారుఢ్య పరీక్షలపై దృష్టి సారించాను. అయితే, సంవత్సరాలు గడుస్తున్నా ఒక్క అడుగు ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నోటిఫికేషన్‌ను కొనసాగిస్తారా!? అన్న భయం ఏర్పడింది. అయితే సంవత్సరంలోనే అన్నీ పూర్తి మా కలను ప్రభుత్వం నెరవేర్చింది.

- పోట్లూరి వెంకటేశ్వర్లు, దగదర్తి

అమ్మానాన్న, అన్న కష్టం.. ఈ ఉద్యోగం



మాది విడవలూరు మండలం ముదివర్తి గ్రామం. మా తల్లిదండ్రులు శీనయ్య, జ్యోతి వ్యవసాయ పనులు చేసుకుంటారు. నేను కబడ్డీలో జాతీయ క్రీడాకారుడ్ని. పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలని నా కల. అందుకోసం తల్లిదండ్రులు, అన్న వంశీకృష్ణ వ్యవసాయ కూలి పనులు చేస్తూ నన్ను ఉద్యోగ ప్రయత్నాల్లో ముందుకు తీసుకెళ్లారు. వారి కృషి ఫలితంగానే ఇప్పుడు కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించాను. చాలా ఆనందంగా ఉంది.

- పట్టపు సాయికుమార్, విడవలూరు

ఊపిరి పీల్చుకున్నా...!



మాది మధ్య తరగతి కుటుంబం. నెల్లూరులోని కోటమిట్ట ప్రాంతంలో నాన్న షేక్ రఫీ ఆటో మెకానిక్, తల్లి హసీనా. నాన్న మెకానిక్ పనులు చేసుకుంటూ మా కుటుంబాన్ని పోషిస్తున్నారు. 2022లో కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిన సమయంలో నేను ఓ ప్రైవేటు కంపెనీలో వర్క్‌ఫర్ హోం ఉద్యోగం చేస్తున్నాను. తల్లిదండ్రుల అంగీకారంతో కానిస్టేబుల్ పోస్టుకు దరఖాస్తు చేశాను. ప్రాథమిక పరీక్షలో క్వాలిఫై కావడంతో చేస్తున్న ఉద్యోగం మానేసి పూర్తిగా కానిస్టేబుల్ ఉద్యోగంపైనే దృష్టి పెట్టాను. కానీ రోజులు గడుస్తున్నా ఆ తర్వాత ప్రక్రియ జరగలేదు. చేస్తున్న ఉద్యోగం ఎందుకు మానేశానా అని బాధపడ్డ సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే దేహదారుఢ్య పోటీలు నిర్వహించి ఫలితాలు విడుదల చేయడం, మెయిన్స్ నిర్వహించి ఫలితాలు విడుదల చేయడం అంతా ఓ కలలా ఉంది.

- షేక్ అస్మా, నెల్లూరు

కళాశాల స్థాయి నుంచే ఆసక్తి



పొదలకూరు రామమందిరం వీధిలో మేం ఉంటున్నాం. నాన్న సోమా రామకృష్ణయ్య. అమ్మ లలితమ్మ. మా నాన్న కూలి పనులు చేస్తుంటారు. చిన్నప్పుడే పోలీసు కావాలని నిశ్చయించుకున్నాను. పొదలకూరులో డిగ్రీ పూర్తి చేశాక కాకినాడకు వెళ్లి కానిస్టేబుల్ పరీక్షలకు శిక్షణ పొందాను. పట్టుదలతో శ్రమించి 140 మార్కులతో జిల్లాస్థాయిలో 18వ ర్యాంకు సాధించాను. ఒకవైపు పేదరికం వెంటాడుతున్నా.. తల్లిదండ్రులు, సోదరుల ప్రోత్సాహంతో ముందుకు సాగుతున్నాను.

- సోమా పెంచలస్వామి, పొదలకూరు

ఏడేళ్ల కల నెరవేరింది!



మేము 30 ఏళ్లుగా పొదలకూరులోని టైలర్స్ కాలనీలో ఉంటున్నాం. నాన్న కరీముల్లా కార్పెంటర్. అమ్మ అషురున్నీసా గృహిణి. ప్రాథమిక విద్య తోడేరులో చదివాను. నెల్లూరులో డిగ్రీ పూర్తి చేశాను. 2018 పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్ష లో ఒక మార్కు తేడాతో నా పోస్టు చేజారింది. ఎలాగైనా కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాలని ఈసారి చాలా కష్టపడ్డాను. 135 మార్కులతో జాబ్ సాధించాను. దీంతో నా ఏడేళ్ల కల నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉంది.


- షేక్ దావూద్‌బాషా, పొదలకూరు

జిల్లాలో ముమ్మరంగా స్వామిత్వ సర్వే

నెల్లూరు (జడ్పీ) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రజలకు ఆస్తి హక్కు కల్పించేందుకు స్వామిత్వ రెండో విడత సర్వేను ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 337 పంచాయతీలు ఈ సర్వేకు ఎంపిక అయ్యాయని శనివారం నుంచి ఈ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారన్నారు. ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజల ఇంటి కొలతలను తీసుకుని యాజమాన్యపు హక్కు కల్పించేందుకు ఆస్తి హక్కు పత్రాలను అందజేస్తామన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలతో పాటు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లోని గృహ యజమానులందరూ సర్వేకి సహకరించాలని కోరారు.

మరణించినా.. జీవించు!

అవయవదానంతో 8 మందికి పునర్జన్మ ● జిలాలో కిడ్నీ, నేత్రదాతలే ఎక్కువ ● నేడు జాతీయ అవయవ దాన దినోత్సవం



'మనం చనిపోయాక కూడా పది మందికి ఉపయోగపడాలి. అప్పుడే ఈ జన్మకు సార్థకత ఉంటుంది.' అని పెద్దలు అంటుంటారు. అవును.. అది నిజమే. మనం మరణించినా మన కళ్లు ఈ లోకాన్ని చూస్తూనే ఉంటాయి. మనం ఏ లోకంలో ఉన్నా మన మూత్రపిండాలు మాత్రం రక్తాన్ని శుద్ధి చేస్తూనే ఉంటాయి. మన శ్వాస ఆగిపోయినా లబ్‌డబ్.. లబ్‌డబ్ అంటూ గుండె కొట్టుకుంటూనే ఉంటుంది. కేవలం అవయవదానం వల్ల మరణించినా బతికి ఉండే అవకాశాన్ని లభిస్తోంది. మృత్యువును జయించిన వారంతా దేవతలైతే... ఆ జాబితాలో అవయవాలను దానం చేసిన వారు కూడా చేరుతారు.

18 ఏళ్ల పైబడిన వారు తమ మరణానంతరం, ప్రమాద సమయాలలో బ్రెయిన్ డెత్‌కు గురైన వారు ఈ అవయవాలు దానం చేసి మరొకరికి పునర్జన్మనివ్వచ్చు. దేశవ్యాప్తంగా 1.50 లక్షల మంది అవయవాల కోసం వేచి చూస్తుండగా కేవలం 8వేల మంది మాత్రమే అవయవ దానం చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో అవయవ దానంపై విస్తృత ప్రచా రం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా నడుం బిగించింది. రాష్ట్రంలో జీవన్‌దాన్ సంస్థ కూడా ఈ ప్రచారాన్ని చేపడుతోంది. ఇప్పటికే అవయవాల కోసం రాష్ట్రవ్యాప్తంగా 4,733 మంది రోగులు జీవన్‌దాన్ సంస్థలో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ జాబితాలో జిల్లావ్యాప్తంగా 300 మందికిపైగా ఉన్నారు. ఆదివారం జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

8లో..

ఎన్‌హెచ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీలు శనివారం విజయవాడ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపనలు చేశారు. నెల్లూరు నగరంలో ఎన్‌హెచ్-67 (మినీ బైపాస్) అభివృద్ధికి రూ.15 కోట్లతో శంకుస్థాపన చేశారు. తొమ్మిది కిలోమీటర్ల మేర ఈ రోడ్డును ప్రస్తుతం బాగు చేస్తున్నారు. అలానే కావలి -జలదంకి మధ్య ఎన్‌హెచ్ 167బీజీ రోడ్డు అభివృద్ధికి రూ.17 కోట్లతోనూ, సీతారామపురం వద్ద ఎన్‌హెచ్ 167బీ రోడ్డు అభివృద్ధికి రూ.11 కోట్లతోనూ, ఇదే హైవేను వలేటివారిపాలెం, కందుకూరుల మధ్య అభివృద్ధి చేసేందుకు మరో రూ.10 కోట్లతో శంకుస్థాపనలు చేశారు.

35 టీఎంసీలకు చేరువైన సోమశిల

అనంతసాగరం ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయంలో నీటినిల్వ 35 టీఎంసీలకు చేరువవుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 12,439 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రైతు కళ్లలో ఆనందం

'అన్నదాత సుఖీభవ' నగదు జమ

1,95,866 మందికి రూ.131.6 కోట్లు

మెసేజ్‌లు చూసుకుని మురిసిన పుడమిపుత్రుడు



'అన్నదాత సుఖీభవ' అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఖాతాలో తొలి విడతగా జమ చేసిన మొత్తం రూ.7 వేలు. రబీ ఆరంభానికి ముందే వ్యవసాయానికి పెట్టుబడి సాయం కింద ఈ మొత్తం అందడంతో పుడమి పుత్రులు మురిసిపోతున్నారు. గతం లో ఒక్కో రైతుకు ఏడాదికి రూ.13, 500 ఇస్తుండగా, ఇప్పుడు ఎన్డీఏ కూటమి హయాంలో రూ.6,500 పెంచి రూ.20 వేలు ఇవ్వనున్నారు. ఇందులో తొలివిడతగా రూ.7వేలు శనివారం విడుదల చేశారు. తమ ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు వచ్చిన మెసేజ్‌లను పదే పదే చూసుకొని సంబరపడిపోతున్నారు. కాగా, ఒక్కసారిగా నిధులు విడుదల చేయడంతో బ్యాంక్ సర్వర్లు మొరాయించడంతో ఆలస్యంగా మెసేజ్‌లు వస్తున్నాయి. అయితే, శనివారం రాత్రంతా కర్షకుల నోట అన్నదాత సుఖీభవ నిధుల జమకు సంబంధించిన మాటలే వినిపించాయి.



కోవూరులో చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే ప్రశాంతి తదితరులు



వింజమూరులో జేసీ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి బృందం) :ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈసారి అన్నదాతల గౌరవాన్ని రెట్టింపు చేసింది. వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో రాష్ట్ర వాటా కింద ఒక్కో రైతుకు ఏడాదికి 7500 రూపాయలు మాత్రం సాయం అందించేది. కేంద్ర ప్రభుత్వం వాటా రూ.6వేలతో కలుపుకుంటే అప్పట్లో రైతుకు రూ.13,500 అందేది. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్ర వాటాను 7500 నుంచి 14 వేల రూపాయలకు పెంచారు. అంటే గతంతో పోల్చితే ఒక్కో రైతుకు రాష్ట్ర వాటా కింద 6,500 రూపాయల అదనపు సాయం అందిస్తున్నారు. ఆ మొత్తంలో తొలి విడత నగదు 7వేలు అన్నదాతా సుఖీభవ అంటూ శనివారం రైతుల ఖాతాల్లో జమ కావడంతో రైతుల్లో పండగ వాతావరణం నెలకొంది. జిల్లావ్యాప్తంగా 1,95,866 మంది రైతులకు రూ.131.6 కోట్ల నగదు కర్షకులకు చేరింది.

● **చిన్నమొత్తమే అయినా..**

ఒక విధంగా చూస్తే 7వేల రూపాయలు రైతుల విషయంలో చిన్న మొత్తమే. ఎందుకంటే వ్యసాయం కోసం ఏడాది కాలంలో అంతకు 20, 30 రెట్లు అధికంగా ఖర్చు చేస్తారు. ఇంత పెట్టుబడి పెట్టినా పంట అమ్మకాల సమయంలో అత్యధిక సార్లు నష్టమే చూస్తారు. కాయకష్టం కాటిలో కలిసిపోయినా పెట్టుబడి కూడా చేతికందలేదని ఏటా కుమిలిపోతూనే ఉన్నాడు. ఏడాది సేద్యంలో ఒక్క పైసా పెట్టుబడి పెట్టకుండా లాభం రూపంలో రైతు చేతికందేది పెట్టుబడి సాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే అన్నదాత సుఖీభవ మొత్తమే. అందుకే ఈ పెట్టుబడి సాయం అంటే రైతులకు అంత ఇష్టం. తమ పెట్టుబడిలో యాభయ్యోవంతు లేకపోయినా, ఏటా అనివార్యంగా ఎదురయ్యే నష్టంలో వందోవంతు మొత్తానికి సరిపోకపోయినా అన్నదాత సుఖీభవ కింద ప్రభుత్వాలు అందించే సాయాన్ని అన్నదాతలు గౌరవంగా గుర్తిస్తారు.

● **కౌలు రైతులకు..**

ఇక కౌలు రైతు కార్డులు (సీసీఆర్‌సీ) కలిగిన రైతులకు రబీ సీజన్‌లో తొలి విడతగా రూ.10వేలు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అదేవిధంగా అర్హత కలిగి సరైన పత్రాలు సమర్పించని వారు ఆయా పత్రాలను సరిచేసుకుంటే రెండో విడతలో వారికి నగదు సాయం అందుతుందని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు.



వెంకటాచలంలో చిరుధాన్యాలతో వేసిన ముగ్గును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు

● **జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా...**

రైతుభరోసా కింద విడుదలైన నగదుకు సంబంధించి నమూనా చెక్కులను జిల్లావ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అర్హులైన రైతులకు అందజేశారు. కోవూరులో కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చెక్కు పంపిణీ చేయగా, వింజమూరులో జేసీ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అందజేశారు. వెంకటాచలం మండలం ఎర్రగుంట గ్రామంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, కావలిలో ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి, కందుకూరు మండలం పలుకూరు గ్రామంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఆత్మకూరులో టీడీపీ నాయకులు రైతులకు చెక్కులు అందజేశారు.

రైతులకు వరం



అన్న దాత-సుఖీ భవ పథకం రైతు లకు వరం. ఈ పథ కం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏడా దికి రూ.14 వేలు జమ చేస్తుండటం ఆనందదాయకం. మొదటి విడతగా రూ.5 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఈ నగదు పంటలు సాగులో ఎంతో ఉపయోగపడతాయి.

- అంగులూరి చిన కొండయ్య, మొగిలిచెర్ల, లింగసముద్రం

పెట్టుబడిలో కొంత భారం తగ్గినట్లే..



అన్నదాత సుఖీభవ పథ కంతో పెట్టుబడి సాయంలో కొంత భారం తగ్గినట్లు అయింది. కూట మి ప్రభుత్వం అన్నదాతలకు మేలు చేకూర్చే విధంగా ఏడాదికి రూ.20వేలు ప్రకటించి, ఇవ్వడం రైతులను పరోక్షంగా అప్పుల భారం నుంచి కొంతమేరకు దూరం చేసిందనే చెప్పాలి. శనివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన రూ.7000 బ్యాంక్ ఖాతాకు చేరాయి.

- దేవినేని వెంకటరమణయ్య, ఉలవపాడు

ఎంతో ఉపయోగం



ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పీఎం కిసాన్ రూ.2వేలతోపాటు అన్నదాత సుఖీభవ నగదు రూ.5 వేలు బ్యాంకు ఖాతాకు శనివారం జమ అయింది. తొలి విడతగా అందిన ఈ నగదు వ్యవసాయ ఖర్చులకు ఎంతో ఉపయోగపడతాయి.

- కోటు అనీల్ కుమార్‌రెడ్డి, సంగం

పంటల సాగుకు ఊతమిచ్చింది



కరువు సీమలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన పెట్టుబడి సాయం పంటల సాగుకు ఊతమిచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద ఏడాదికి రూ.13,500 మాత్రమే చెల్లిస్తే చంద్రబాబు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఇవ్వడం ఆనందంగా ఉంది. ఈ నగదు కరువు ప్రాంతాల రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

- భోగినేని మూడవ కాశయ్య, సీతారామపురం

ఇది రైతు ప్రభుత్వమే!



అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అందిక ఆర్థిక సాయం సాగుకు చేయూత ఇవ్వడమే. మా కుటుంబం కేవలం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తోంది. వ్యవసాయానికి మరింత సాయాన్ని అందించి బాసటగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వమే అని నిరూపించుకుంది.

- మద్దిబోని శ్రీను, రైతు, అల్లూరు

'ఎడగారు' ఖర్చులకొచ్చాయి



మా ఊళ్లో మా కుటుంబానికి 1.30 ఎకరా పొలం ఉంది. దాంట్లో ఈ ఎడగారికి కేఎన్ఎం రకం వరి సాగు చేశాం. ఈ రోజున ప్రభుత్వం ఇచ్చిన అన్నదాత సుఖీభవ డబ్బులు పంట పెట్టుబడి ఖర్చులకు వచ్చాయి. ఎన్నికలకు ముందు చంద్రబాబు పార్టీ వాళ్లు ఇస్తామన్నారు. పంట పెట్టుబడికి అప్పు చేయకుండా సరిపోయింది.

-దండు రమణమ్మ, సౌత్‌మోపూరు

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. అందులో భాగంగా అన్నదాత సుఖీభవ కింద ఏడు వేల రూపాయలు బ్యాంకు ఖాతాలో జమ కావటం సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి రైతులు రుణపడి ఉంటారు.

- పొలిరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, చౌకిచర్ల, విడవలూరు మండలం

ప్రభుత్వానికి ధన్యవాదాలు



మాది వ్యవసాయకుటుంబం. ఎకరా పొలం ఉంది. ప్రతీ ఏటా వరి సాగు చేసుకుంటాం. ఇవాళ నాకు 'అన్నదాత సుఖీభవ పథకం' కింద రూ. 5వేలు, పీఎం కిసాన్ కింద రూ.2వేలు వచ్చాయి. చాలా ఆనందంగా ఉంది. ఈదఫా మునుపటి కంటే ఎక్కువ ఇస్తారంట కదా. పైరు పెట్టేటప్పుడు ఈ డబ్బులు ఆదుకుంటాయి. మంచిదే.. రైతుల కోసం ప్రభుత్వాలు సాయం చేస్తున్నందుకు కృతజ్ఞతలు చెబుతున్నా.

- పోలంరెడ్డి రమణమ్మ, మనుబోలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
కోడిగుడ్ల ధర (100): 475	

పారిశుధ్య కార్మికులపై మేస్త్రీల పెత్తనం నియంత్రించాలి

కందుకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు పట్టణ పరిశుభ్రత కోసం ఎంతో కష్టపడుతుండగా కొందరు మేస్త్రీల పేరుతో ఏమాత్రం పనిచేయకుండా కార్మికులపై పెత్తనం చెలాయించటం తగదని, తక్షణం వారిని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్‌చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సంఘం నాయకురాలు కాకుమాని రమణమ్మ అధ్యక్షతన ఏఐటీయూసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు కె.మురళీకృష్ణ, వై.ఆనంద్‌మోహన్‌లు మాట్లాడారు. శానిటరీ ఇన్‌స్పెక్టరు కొండయ్య పట్ల వివక్ష చూపుతూ నాలుగు నెలలుగా జీతం నిలిపివేయటం సరికాదని, తక్షణం ఆయన జీతం చెల్లింపునకు కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మందాటి చెరువుకు మహర్దశ



మట్టి తోలి వెడల్పు చేసిన చెరువు కట్ట

కావలి పట్టణం ముసునూరు సమీపంలో ట్రంకురోడ్డుకు ఆనుకుని ఉన్న మందాటి చెరువుకు మహర్దశ పట్టనుంది. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. చెరువుకు ఆనుకుని పడమర వైపు రైల్వే ట్రాక్, తూర్పువైపు ట్రంకురోడ్డు, మధ్యలో 100 ఎకరాల్లో విస్తరించి ఉంది. చెరువు కట్టకానుకుని హనుమత్ క్షేత్రం, పడమర వైపు శ్రీసాయి క్షేత్రం, దక్షిణం వైపు అయ్యప్పస్వామి ఆలయాలు ఉన్నాయి. దీంతో మందాటి చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కావలి మాస్టర్ ప్లాన్‌లో గతంలోనే చేర్చినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం చెరువు కట్ట కిరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేసి కట్టను 40 అడుగుల వరకు వెడల్పు పనులు, కట్టకింది భాగంలో మట్టితో లెవలింగ్ పనులు 80 శాతం వరకు పూర్తయ్యాయి. ఈ ప్రాంతాన్ని పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచేలా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చర్యలు చేపట్టారు.

- కావలి (టౌన్,ఆంధ్రజ్యోతి)

అడవిని తలపిస్తున్న శ్మశాన వాటిక!



వలేటివారిపాలెం శ్మశానంలో దట్టంగా పెరిగిన ముళ్లచెట్లు

వలేటివారిపాలెం శ్మశాన వాటికలో ముళ్లచెట్లు దట్టంగా పెరిగి అడవిని తలపిస్తోంది. మృతదేహాన్ని తీసుకుని శ్మశానం లోపలికి వెళ్లేందుకు అవకాశం లేనంతంగా పెరిగిన ముళ్లచెట్లతో కష్టాలు తప్పడం లేదు. సుమారు 5 ఎకరాలు ఉన్న శ్మశాన స్థలం ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోకపోవడం, 15 ఏళ్లుగా కనీసం ముళ్లచెట్లు కూడా తొలగించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ముళ్ల చెట్ల మధ్య మృతదేహాలను ఖననం చేయడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఆ ముళ్ల చెట్ల మధ్య విష సర్పాలు సంచరిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత పంచాయతీ అధికారులు, పాలకులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీకి పన్నుల రూపంలో వచ్చే నిధులతో శ్మశానంలో ముళ్లచెట్లు తొలగించవచ్చు. కానీ ఆ దిశగా పాలకులు చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శ్మశానంలో ముళ్లచెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి)

'రాళ్లపాడు-రోళ్లపాడు' ప్రధాన పైపులైన్ లీక్



మంచినీటి పథకం పైపులైన్ నుంచి లీకవుతున్న నీరు

లింగసముద్రం మండలంలోని పెంట్రాల సచివాలయం ఎదురుగా ఉన్న రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకంకు చెందిన ప్రధాన పైపులైన్ లీకై నీరు వృథాగా పోతోంది. సుమారు ఐదారు నెలల క్రితం ఈ పైపులైన్ పగిలి పోయింది. అప్పుడు మంచినీటి పథకం నిర్వాహకులు, సిబ్బంది పైపులైన్ పగిలిన చోట కొత్త పైపు వేశారు. ఆ తర్వాత కూడా ఈ పైపులైన్ నుంచి నీరు లీకవుతోంది. అయితే మంచినీరు విడుదలైనప్పుడు పైపులైన్‌లో ఇక్కడ నిల్వ ఉన్న నీరు మళ్లీ పైపుల్లోకి వెళ్లి మురుగు నీరు వస్తోందని గ్రామస్థులు పలువురు తెలిపారు. అంతేగాక ఈ మంచినీరు కూడా దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. అలాగే పెంట్రాల సచివాలయం దగ్గర నివశించే పేరం సింగయ్య ఇంటి ఎదురుగా ఉన్న అంతర్గత మంచినీటి పైపులైన్ పగిలి ప్రతినిత్యం నీరు ఇంటి ముందు నిల్వ ఉంటోంది. దీంతో ఆ ప్రాంతం దోమలకు ఉత్పత్తి కేంద్రంగా మారి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

5న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

కందుకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్, సివిల్ విభాగాలలో మిగిలి ఉన్న సీట్లుకు ఈనెల 5న స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలీ సెట్ రాసిన వారితో పాటు రాయని విద్యార్థినీ విద్యార్థులు సైతం పదవ తరగతి ఉత్తీర్ణులై ఉంటే ఈ స్పాట్ అడ్మిషన్ ద్వారా పాలిటెక్నిక్‌లో ప్రవేశించవచ్చునని తెలిపారు. 5న ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో హాజరుకావచ్చునన్నారు. సీటు పొందిన విద్యార్థులు వివిధ ఫీజుల నిమిత్తం రూ. 6వేలు చెల్లించాల్సి ఉంటుందని, వీరికి ఎలాంటి స్కాలర్‌షిప్‌లకు అర్హత ఉండదని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు పాక్షికంగా అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ మస్తాన్ షరీఫ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పాక్షిక అంతరాయాలు ఏర్పడుతున్నందున ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

స్వామిత్వ గ్రామాల ఎంపిక

వలేటివారిపాలెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండసముద్రం, పోలినేనిపాలెం, కాకుటూరు, పోలినేనిచెరువు, రామలింగాపురం, శామీరపాలెం, నలదలపూరు గ్రామాలు స్వామిత్వ గ్రామాలుగా ఎంపికైనట్లు ఎంపీడీవో నరేంద్రదేవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామాల్లో ప్రతి ఇల్లు, ఖాళీ స్థలాలు కొలతలు నమోదు చేసి వారికి చట్టబద్ధమైన ఆస్తి హక్కు ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కొండసముద్రం, పోలినేనిపాలెం గ్రామ సచివాలయాల్లో స్వామిత్వ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అనుమోల అమరేశ్వరి, మన్నం వెంగమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

157 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 313 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 157 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-5, నోబిడ్-135, ఆర్ఆర్-1, సీఆర్-10, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 156 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.205.25గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ.9,64,157

వలేటివారిపాలెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.9,64,157 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

కందుకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని పలు ప్రైవేటు వైద్యశాలల్లో ఉన్న స్కానింగ్ సెంటర్లను వైద్యాధికారుల బృందంతో కలిసి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు పద్మజ శనివారం తనిఖీ చేశారు. ఆమెవెంట డాక్టరు శైలజ, డాక్టరు కొండయ్య, సామాజిక ఆరోగ్య అధికారి జి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు బీటీఏ ఆవిర్భావ దినోత్సవం

కావలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) 25వ ఆవిర్భావదినోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం బీటీఏ కార్యాలయం లైన్‌లో ఉన్న కావలి పెన్షనర్స్ భవనంలో జరుగుతాయని బీటీఏ రాష్ట్ర కార్యదర్శి వై.బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 31,853 మంది, పీఎం కిసాన్ పథకం కింద 29074మంది రైతులకు ఆర్థికసహాయం మంజూరైందని తెలిపారు. మండలంలోని పలుకూరులో శనివారం సాయంత్రం అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ తొలివిడత నిధులు విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చెక్కు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం తొలివిడతగా రూ.5వేలు, పీఎం కిసాన్ రూ.2వేలు రైతుల ఖాతాలకు జమ అయ్యాయని, ఈ నిధులు పెట్టుబడులకు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నియోజకవర్గంలోని రైతులకు 21 కోట్ల 73లక్షల 13వేల రూపాయలు రైతులకు లబ్ధి చేకూరిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆరువేలకు మరో 14వేలు కలిపి ప్రతిఏటా రైతులకు రూ.20వేలు ఆర్థిక తోడ్పాటు అందిస్తామన్నారు. తొలివిడతగా రూ. 7వేలు రైతుల ఖాతాలకు జమచేశారని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం కేవలం రూ. 7500 సహాయం అందించగా ప్రస్తుతం చంద్రబాబునాయుడు రూ.14వేలు అందజేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శేషారెడ్డి, అబ్దుల్‌రహీం, టీడీపీ నాయకులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, దామా మల్లేశ్వరరావు, పూరిమిట్ల మాల్యాద్రి, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, నార్నె రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి



తృణధాన్యాలతో ఏర్పాటు చేసిన పకృతి వ్యవసాయ చక్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, వ్యవసాయశాఖ అధికారులు

కావలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలో ప్రతి రైతుకు అండగా ఉంటానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఓ కల్యాణ మండపంలో శనివారం జరిగిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కావలి నియోజకవర్గంలోని 18,500 కుటుంబాలకు తొలివిడతగా విడుదలైన రూ.12,03,55,000 మెగా చెక్కును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపుల ఊబిలో కూరుకున్న ప్రభుత్వాన్ని చంద్రబాబు గాడిలో పెట్టి ఇచ్చిన మాట ప్రకారం సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూవస్తున్నారన్నారు. సంక్షేమానికి ఎన్టీఆర్, అభివృద్ధికి చంద్రబాబు నాయుడలు బీజం వేశారన్నారు. గత పాలనలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై రైతుల ధాన్యాన్ని బస్తాకు 5 కిలోల పైన తరుగు తీసుకుని సకాలంలో డబ్బులు ఇవ్వకుండా రైతులను నష్టాలపాలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతుల ధాన్యానికి ఎలాంటి తరుగు లేకుండా వెంటనే డబ్బులు చెల్లిస్తూ రైతుల పక్షపాతిగా నిలిచామన్నారు. తొలుత వివిధ రకాల తృణధాన్యాలతో అందంగా తీర్చిదిద్దిన ప్రకృతి వ్యవసాయ చక్రంను ఎమ్మెల్యే, అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కావలి ఏడీఏ నాగరాజు, ప్రకృతి వ్యవసాయం పీడీ రాజశేఖర్, తహసీల్దార్ పీ.శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీదేవి, నాయకులు పోతుగంటి అలేఖ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, జ్యోతి బాబూరావు, మాలేపాటి నాగేశ్వరరావు, ఆవుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



కావలి : పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

కావలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయని ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య తెలిపారు. పట్టణంలోని ముసునూరు అంగన్‌వాడీ కేంద్రాల సముదాయంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి అధ్యతన జరిగిన ఈ కార్యక్రమంలో పోషక విలువలు కలిగిన ఆహార పాదార్థాలపై అవగాహన కల్పిస్తూ వాటిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం. శివలీల, రమాదేవి, ప్రభావతి, ఎం.సుశీలకుమారి, సుకన్య, మహిళా సంరక్షణ కార్యదర్శి పుష్పలత, ఏఎన్ఎం బేబీరాణి, ఆశావర్కర్ సులోచన తదితరులు పాల్గొన్నారు.



లింగసముద్రం : మొగిలిచెర్లలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాధాదేవి

- లింగసముద్రం(ఆగస్టు) : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని ఐసీడీఎస్ లింగసముద్రం సెక్టార్ సూపర్‌వైజర్ ఏవీ రాధాదేవి చెప్పారు. మండలంలోని మొగిలిచెర్ల గ్రామంలోని 3వ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏ మార్తమ్మ, సులోచన, ప్రసన్న, ఓబులమ్మ, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.
- వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి): పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని నూకవరం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, భారతి, మనోహర్, రమ తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ప్రభాకర్‌నాయుడు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు

కావలి(టౌన్), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : మువ్వన్నెల జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య 149వ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులర్పించారు. శనివారం పట్టణంలోని డాక్టర్ ప్రభాకర్ నాయుడు ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్, వైద్యరత్న డాక్టర్ ప్రభాకర్ నాయుడు పాల్గొని పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహుభాషా కోవిదుడు, స్వాతంత్ర సమరయోధుడు, ప్రపంచం గర్వించదగ్గ తెలుగు జాతి ముద్దుబిడ్డ పింగళి వెంకయ్య అన్నారు. ఆగస్టు 15న దేశవ్యాప్తంగా రెపరెపలాడనున్న జాతీయ జెండాలో ప్రతి భారతీయుని ఆత్మాభిమానం కనపడేలా రూపొందించడం తెలుగువారికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక గౌరవాధ్యక్షుడు ఎస్‌కే ఖాదర్‌బాషా, వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఎంవీ ప్రసాదరావు, రాయపాటి దిలీప్, జీ.సురేంద్ర, సలీంబేగ్, సయ్యద్ ఘనీబాషా, మధుసూదన్‌రావు, షేక్ జమీర్ పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న ఆయుష్ వైద్యుడు చంద్రశేఖర్

జలదంకి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీకే అగ్రహారంలో శనివారం ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ విజయకుమారిలు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, గ్రామస్థులు జలదంకిలో ఉన్న ప్రభుత్వ ఆయుష్‌కేంద్రానికి వచ్చి తమకు అవసరమైన పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందవచ్చని పేర్కొన్నారు.

బళ్లారి రాఘవకు ఘన నివాళి



బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ

అల్లూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బళ్లారి రాఘవ జయంతి వేడుకలు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన కార్యక్రమాలపై వివరించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మృదుల, ఇన్‌చార్జి ఎంపీడీవో పెంచల వీరేంద్ర, ఏవో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు



విదార్థినికి ఫ్లోరోసిస్ పరీక్ష చేస్తున్న వైద్యాధికారి దివ్య

కొండాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మి, సత్యవోలు గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు శనివారం ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహించారు. ఫ్లోరోసిస్ జిల్లా కన్సల్టెంటు వైద్యాధికారిణి దివ్య మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో 3,4,5 తరగతులు చదివే విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించామన్నారు. ఈ కార్యక్రమంపై పీహెచ్‌సీ సిబ్బందికి కమ్యూనిటీ సర్వే శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు నసీరుద్దీన్, కవిత, సీహెచ్‌వో చెంచు రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెత్త తొలగింపు

వలేటివారిపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం లో పీహెచ్‌సీ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న చెత్తను పంచాయతీ కార్యదర్శి మురళి పారిశుధ్య సిబ్బందిచే శనివారం తొలగింప చేశారు. రోడ్డు పక్కనే చెత్త అని శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. అనంతరం రోడ్డు పక్కన చెత్తను వేయవద్దని దుకాణదారులకు సూచించారు. చెత్తను చెత్తబండిలోనే వేయాలని అలా కాకుండా చెత్తను రోడ్ల పక్కన వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఇళ్లలోకి ఎలా చొరబడతారు?

- పోలీసులకు తెల్లగుంట వాసుల ఫిర్యాదు



పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న తెల్లగుంట గ్రామస్థులు

బిట్రగుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గుంపులు గుంపులుగా ఇళ్లలోకి చొరపడి దురుసుగా ప్రవర్తించడం ఏమిటని బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట వాసులు అన్నారు. శనివారం సాయత్రం ఎస్సీపాలెంకు చెందిన కొందరు తెల్లగుంట దళితవాడలో ఇళ్లలోకి జొరబడి దౌర్జన్యం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ప్రభాకర్‌రావు కథనం మేరకు.. తెల్లగుంట దళితవాడకు చెందిన బొందు తిరుపతి కుమారుడు వంశీకృష్ణ ఎస్సీపాలెంకు ఓ యువతిని మూడు రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ యువతిని గ్రామంలో దాచి ఉంచారన్న అనుమానంతో ఎస్సీపాలెంకు చెందిన కొందరు ఇళ్లలోకి చొరబడి దుర్భాషలు ఆడుతూ దురుచుగా ప్రవర్తించారు. అంతకు ముందు శుక్రవారం ఆ యువతి తల్లిదండ్రులు తమ బిడ్డతో ఒక్కసారి మాట్లాడేందుకు పిలిపించమని ఎస్‌ఐని కోరారు. ఈ మేరకు వారితో మాట్లాడగా తీసుకువస్తామన్న పెద్ద మనుషుల నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఇరువర్గాలు సర్దుకుపోయారని పోలీసులు భావించారు. ఇంతలో ఇళ్లలోకి జొరబడి దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ మేరకు విచారించి తగు చర్యలు చేపడతామని ఎస్‌ఐ తెలిపారు. దీంతో వారు శాంతించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్‌టీఐ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జిల్లాలో మొదటి బహుమతి సాధించిన సైదాబీ

కందుకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కుచట్టం (ఆర్‌టీఐ) అమలులోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టీఐకు సంబంధించిన అంశాలతో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డిబేటు, వక్తృత్వ పోటీలు నిర్వహించగా తమ కళాశాల విద్యార్థిని ఎస్కే సైదాబీ జిల్లా మొదటి బహుమతి దక్కించుకుందని తెలిపారు. అలాగే కళాశాల విద్యార్థులు ఆర్.మహేష్, కే.శివకుమార్, ఎస్కే సైదాబీలతో కూడిన క్విజ్ జట్టు ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుందని తెలిపారు. మొదటి బహుమతి సాధించిన సైదాబీ ఈనెల 6న గుంటూరులో నిర్వహించే జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు అభినందించారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవిజ్ఞాన సదస్సు

నెల్లూరు (లీగల్), అగస్టు 2(ఆంధ్రజ్యోతి) : జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్వర్యంలో శని వారం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్ర మానికి అధ్యక్షత వహించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుకు నేందుకు స్తోమతలేని వరంగల్‌కు చెందిన గండిబోయిన దివ్యకు దాతల సహకారంతో ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే.వాణి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్పరెడ్డి, ఉపాధ్యక్షుడు జల్లి పద్మాకర్, ప్రధాన కార్యదర్శి నక్కల నాగరాజు, సైకాలజిస్ట్ డాక్టర్ కరిమద్దల నరసింహారెడ్డి పాల్గొన్నారు



అవయవదానం ప్రాణదానం!

- మనిషి రెండుసార్లు జీవించే అవకాశం
- జిల్లాలో కిడ్నీ, నేత్రదాతలే ఎక్కువ
- ఇతర అవయవాలదానానికి ప్రోత్సాహం
- నేడు జాతీయ అవయవదాన దినోత్సవం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు మరణానంతరం అవయవదానం చేయటం వల్ల మరో కొందరికి ఆ అవయవాలు ఎంతో ఉపయోగ పడతాయి. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి ఇచ్చే అవయవాల వల్ల మరో వ్యక్తి ప్రాణాలు నిలుపవచ్చు. సామాజిక కట్టుబాట్లు, మూఢనమ్మకాల కారణంగా ఎంతో మంది సేవాదృక్పథం ఉన్న వారు సైతం, తమ మరణానంతరం కుటుంబసభ్యుల ద్వారా అవయవదానం చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. జిల్లాలో సకాలంలో అవయవాలు అందక ఏటా 2వేల మందికిపైగా రోగులు మరణిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా బ్రెయిన్‌డెత్‌కు గురయిన వారిలో గత పదేళ్లలో 60 మంది మాత్రమే ముందుకు వచ్చి అవయవదానం చేశారు. ఈ నేపథ్యంలో అవయవదానంపై చైతన్యం తీసుకువచ్చేలా ఆగస్టు 3న (నేడు) జాతీయ అవయవదాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

● జిల్లాలో వ్యాధిగ్రస్థులెందరో...

జిల్లావ్యాప్తంగా ఎంతోమంది వ్యాధిగ్రస్థులు అవయవ దాతల కోసం ఎదురు చూస్తున్నారు. కిడ్నీ, గుండె, లివర్, ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్థులు వేలసంఖ్యలో ఉన్నారు. వీరిలో 4 వేల మందికి ఆయా అవయవాలు అవసరం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆయా అవయవాలను సకాలంలో అమరిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు. కిడ్నీ వ్యాధిగ్రస్థులు జిల్లాలో 30 వేల మంది ఉండగా, వీరిలో రెండు కిడ్నీలు చెడిపోయి ఏటా 2500 మంది రోగులు మృత్యువాత పడుతున్నారు. వీరికి కుటుంబ సభ్యులు ఓ కిడ్నీ దానం చేసినా బతికే అవకాశం ఉంది. అయితే ఇందులో కేవలం 20 నుంచి 30శాతం మంది మాత్రమే ఇందుకు ముందుకు వస్తున్నారు. గుండె వ్యాధులకు సంబందించి గుండె మార్పిడికి ఏటా వేయి మందికిపైగా అవసర మవుతుంది. ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది కావటంతో ఎందరో పేదలు మృత్యు వాత పడుతున్నారు. కొందరు ఉన్నత వర్గాలు మాత్రమే దాతల సహకారంతో గుండె మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నారు. లివర్ పూర్తిగా దెబ్బతిని లివర్ మార్పిడి అవసరమైన ఏటా 1500 మంది రోగులు మార్పిడి చేయించుకోలేక మరణిస్తున్నారు.

● ప్రచారమేదీ ?

విజయవాడ కేంద్రంగా జీవన్‌దాన్ సంస్థ అవయవదానం మార్పిడికి అనుమతులు ఇవ్వాలి. ప్రభుత్వం గుర్తించిన ఈ సంస్థలో ఇప్పటికే జిల్లాకు చెందిన వందల మంది రోగులు అవయవాల కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో కిడ్నీ వ్యాధుల బాధితులే ఎక్కువ. నేత్ర బాధితులు కూడా ఉన్నారు. ఇదిలా ఉంటే అవయవ దానంపై ఈ సంస్థ పెద్దఎత్తున చైతన్యం తీసుకురావాల్సి ఉన్నా ఆదిశగా కృషి చేయటం లేదన్న విమర్శలు ఉన్నాయి. అసలు ఈ జీవన్‌దాన్ సంస్థ ఉండి ఏమి ప్రయోజనం అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం సానుకూల స్పందన



అవయవదానం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడ వచ్చు. అయితే అపోహల కారణంగా చాలా మంది ముందుకు రావటం లేదు. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అవయవదానాన్ని ప్రోత్సహించటం అభినందనీయం. అలాంటి దాతల అంత్యక్రియల్లో తప్పని సరిగా ప్రజాప్రతినిధులు పాల్గొనాలని పిలుపునిచ్చింది. అవయవ దానంపై ప్రజలలో చైతన్యం తీసుకురావాల్సి ఉంది.

- గిరినాయుడు, కిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, ఈడీ

ఇప్పటి వరకు 125 కిడ్నీల మార్పిడి



గత 8 ఏళ్లలో 125 వరకు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించాం. అలాగే 25 మంది అవయవ దానం చేసిన వారు ఉన్నారు. అయితే దాతలు తక్కువగా ఉండటంతో అనేక మంది రోగులకు సకాలంలో అవయవాలు అందక మరణిస్తున్నారు. ప్రభుత్వం కూడా అవయవ దానం చేసే వారిపట్ల ఎంతో ఆదరణ చూపాలని పిలుపు నివ్వటం శుభసూచకం.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నెఫ్రాలజిస్ట్

ఫీజుల దోపిడీ అరికట్టాలని ఆందోళన

నెల్లూరు (విద్య), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి మాట్లాడారు. పాఠశాలల్లో అధిక ఫీజుల కారణంగా తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే అనేక పాఠశాలలలు అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపట్టి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. దీనిపై విద్యాశాఖాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించుకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నేతలు హేమంత్‌రెడ్డి, మౌనిష్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేత పోరంబోకు భూముల ఆక్రమణపై విచారణ

కలువాయి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశమనేనిపల్లి రెవెన్యూ పరిధిలోని వందల ఎకరాల మేత పోరంబోకు భూములను తిరుమలపాడు గ్రామస్థులు కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని కేశమనేనిపల్లి గ్రామస్థులు పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శనివారం స్థానిక రెవెన్యూ అధికారులు గ్రామానికి వెళ్లి ఆక్రమణలపై ప్రాథమిక విచారణ జరిపారు. కేశమనేనిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 438లో 673 ఎకరాల మేత పోరంబోకు భూములు ఉన్నాయి. అయితే ఈ భూములను గత కొన్నేళ్లుగా ఇదే రెవెన్యూ పరిధిలోని తిరుమలపాడు గ్రామస్థులు ఆక్రమించుకుని నిమ్మతోటలు సాగు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకొక్కరు 10ఎకరాల వరకు ఆక్రమించుకుని బోరు వేసుకుని విద్యుత్ సర్వీసులు కూడా తీసుకున్నారని, నిమ్మతోటలు సాగు చేసిన భూములే కాకుండా మిగిలిన వందల ఎకరాల భూములకు బౌండరీలు వేసుకుని వారి ఆక్రమణలో ఉంచుకున్నారని ఫిర్యాదు చేశారు. ఈవిషయమై స్థానిక తహసీల్దారుకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్య తీసుకోలేదని గ్రామస్థులు తెలిపారు. ఆక్రమణలు తొలగించి మేత పోరంబోకు భూములను కాపాడాలని వారు కలెక్టరును కోరారు.



మేత పోరంబోకు భూముల ఆక్రమణలపై విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

రూపాయితో నెలంతా కాల్స్ చేసుకోండి

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ వినియోగదారులకు బీఎస్ఎన్ఎల్ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రూ.1తో రీచార్జ్‌తో 30రోజులు ఉచిత డేటా కాల్స్ చేసుకునే అవకాశం కల్పించిందని టెలికామ్ జిల్లా ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ సీఏ.రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆఫర్ ఆగస్టులో బీఎస్ఎన్ఎల్ కొత్త సిమ్ ఉచితంగా పొందిన వారికి మాత్రమేనని తెలిపారు. ఇతర ఆపరేటర్ల నుంచి బీఎస్ఎన్ఎల్ పోర్టబులిటీ సౌకర్యం పొందిన వినియోగదారులకూ వర్తిస్తుందని తెలిపారు. వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని కానీ రిటైల్ కేంద్రాలను కానీ సందర్శించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

యాక్సిస్ బ్యాంకు కుంభకోణంపై దశలవారీ పోరాటం

● రౌండ్ టేబుల్ సమావేశంలో నేతల నిర్ణయం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 2(ఆంధ్ర జ్యోతి): యాక్సిస్ బ్యాంకులో జరిగిన భారీ కుంభకోణంపై దశలవారీగా పోరాటం చేస్తామని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య తెలిపారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి ఆడిటోరియంలో ఆయన అధ్యక్షతన శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జిల్లాలో నిరక్షరాస్యులైన గిరిజనులను, దళితులను, బీసీలను లక్ష్యంగా చేసుకుని, ముత్తుకూరు యాక్సిస్ బ్యాంకులో రూ. కోట్ల రుణాలను వారిపేరుతో తీసుకుని మోసం చేయడం దారుణమన్నారు. ఈ కుంభకోణంపై నేటికీ పోలీసులు విచారణ చేయలేదని ఆరోపించారు.ఈ కుంభకోణంపై దశలవారీగా పోరాటం చేస్తామని వారు పేర్కొన్నారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామరాజు, ఏఆర్‌డీ చైర్మన్ బషీర్, రజక సంఘం నాయకులు పద్మజ, డీవీఎంసీ సభ్యులు మురళి, దసరి పోలయ్య, మాజీ డీవీఎంసీ సభ్యులు కొప్పాల రఘు, యానాదుల సంక్షేమ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

17,18 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17, 18తేదీల్లో నెల్లూరులో సీపీఐ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. శనివారం నగరంలోని పురమందిరం రీడింగ్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంగోలులో ఈ నెల 23 నుంచి 25 వరకు రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. ఈ నెల 12న కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు- ఇళ్ల స్థలాలు- భూసమస్యలు అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పనుల్లో రూ. లక్షల అవినీతి జరిగిందని, అధికారులతో పాటు దళారుల చేతుల్లోకి ఈ నిధులు వెళ్లాయని విమర్శించారు. ఈ విషయమై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లీలామోహన్, నందిపోగు రమణయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు షాన్‌వాజ్ పాల్గొన్నారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్ హర్షనీయం

● చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బాలాజీ



ఉచిత విద్యుత్‌పై హర్షం వ్యక్తం చేస్తున్న చేనేత సంఘాల నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేయడం హర్షనీయమని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ పేర్కొన్నారు. నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శనివారం కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రంగంపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీని కూడా పూర్తిగా తొలగించాలన్నారు. జిల్లాలో సుమారుగా 3600 చేనేత మగ్గాలున్న చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం కొంతమేర ఊరట నిస్తుందన్నారు. చేనేత కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అలాగే ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణయ్య, పద్మశాలి సంఘం నాయకులు సోమగోపాల్, చింతలపూడి పెంచలయ్య, డాక్టర్ మారం సుధాకర్, రామనాథం రాజశేఖర్, కాసా శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, మురళి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేసే వరకు పోరాటం

● వరికుంటపాడులో స్పష్టం చేసిన జేఏసీ నాయకులు ● ర్యాలీని అడ్డుకున్న పోలీసులు.. 144 సెక్షన్ అమలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో మైనింగ్ (తెల్లరాయి తవ్వకాలు) అనుమతులను ప్రభుత్వం రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. 2వ రోజు శనివారం కూడా తమ ఆందోళనలో భాగంగా వరికుంటపాడులోని రామాలయం నుంచి శాంతి ర్యాలీ నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. నినాదాలు చేస్తూ గ్రామస్థులు ఎస్సీ కాలనీ వరకు చేరుకోగా పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. సుమారు 2 గంటలపాటు అలాంటి తంతే కొనసాగడంతో ఓపిక నశించిన ఆందోళనకారులు పోలీసులను నెట్టుకొని గ్రామ ముఖద్వారం వరకు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో తోపులాట చోటు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం ఉదయగిరి సీఐ వెంకట్రావు అక్కడకు చేరుకుని 144 సెక్షన్ అమలు చేసినట్లు హెచ్చరించి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్, సర్పంచు దిలీప్‌కుమార్ మాట్లడుతూ ప్రజలను చైతన్యం చేసేందుకే తాము పోరాడుతున్నామే తప్ప ఇంతమంది పోలీసులు వచ్చేలా ఎలాంటి హింసాత్మక సంఘటనలు, మనోభావాలు దెబ్బతినే కార్యక్రమాలకు పాల్పడటం లేదన్నారు. ప్రశాంతంగా సాగుతున్న ర్యాలీని గంటల తరబడి అడ్డుకుంటున్నారంటే మేం చేసిన తప్పు ఏమిటని నిలదీశారు. కలెక్టర్ సహా మంత్రి ఆనం, ఎమ్మెల్యే కాకర్ల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదన్నారు. తమ ఉద్యమాన్ని నీరుగార్చాలని చూస్తే మరింత ఉదృతం చేసి ప్రాణత్యాగానికైనా సిద్ధపడతామని హెచ్చరించారు.



పోలీసులు అడ్డుకోవడంతో నేలపై బైఠాయించిన ఆందోళనకారులు



పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట

● పోలీసుల పహారా

జాతీయ రహదారిపై ర్యాలీ చేపడతారని తెలుసుకున్న పోలీసులు ఉదయం నుంచే పహారా కాశారు. వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి ఎస్ఐలు రఘునాథ్, ఆదిలక్ష్మి, శ్రీను తమ సిబ్బందితో హైవేతోపాటు ప్రధానవీధిలో ఎలాంటి ఆందోళనలు చేపట్టకుండా కట్టడి చేశారు. కాగా, సర్పంచు సహా జేఏసీ నాయకులు ఆంద్రా పరంధామిరెడ్డి, షేక్ పీరయ్య, సారాబు లక్ష్మీనారాయణ, సుంకర రాధాకృష్ణ తదితరులను సీఐ పోలీసు స్టేషన్ పిలిపించి ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఆందోళన చేస్తే కేసుల పెడతామనిని హెచ్చరించారు.

జలజీవన్ పనులు ఎందుకు ఆగాయి!?

● మురుగు కాలువల పరిస్థితీ అంతే! ● జడ్పీ స్టాండింగ్ కమిటీలో సభ్యుల ఏకరువు

నెల్లూరు (జడ్పీ) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : 'తాగునీటి పథకానికి సంబంధించిన జలజీవన్ మిషన్ పనులు గ్రామాల్లో జరగడం లేదు. ఆ పనులు ఎందుకు ఆపారో తెలపండి.' అంటూ జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలువురు జడ్పీటీసీ సభ్యులు నిలదీశారు. శనివారం నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలువాయి, మర్రిపాడు, కనిగిరి, కొండాపురం జడ్పీటీసీ సభ్యులు అనిల్, సుధాకర్‌రెడ్డి, మాల్యాద్రి, వెంకట్రావు తదితరులు మాట్లాడుతూ తమ మండలాల్లో జలజీవన్ పనులు ఆపేశారంటూ ఏకరువు పెట్టారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో జడ్పీ నిధులతో చేపట్టిన మురుగు కాలువల నిర్మాణాలు ఏడాది అయినా ఇంతవరకు పూర్తికాలేదని అధికారులను ప్రశ్నించారు. విడవలూరు మండలంలో కాలువ పనులు జరగకుండా సర్పంచులు అడ్డుకుంటున్నారని, దీనిపై అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. అలాగే కలువాయి, మర్రిపాడు మండలాల్లో కాలువల నిర్మాణాలు పూర్తయి 8 నెలలు గడిచినా ఎంబుక్‌లు సిద్ధం చేయలేదని, బిల్లులు ఇవ్వడం లేదని అన్నారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ రెడ్డప్ప మాట్లాడుతూ తాను కొత్తగా వచ్చానని, పనులపై సమీక్షించి పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం డీపీవో శ్రీధర్‌రెడ్డి జిల్లాలో చేపడుతున్న పారిశుధ్య పనులను వివరించారు.

● పీ4పై బలవంతం ఏల!?

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పీ4 పథకాన్ని తీసుకోవాలని అధికారులు తమపై బలవంతం చేస్తున్నారని జడ్పీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పేదలను దత్తత తీసుకోవాలేతప్ప జడ్పీటీసీలకు ఆ స్తోమత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. దీంతో జడ్పీ సీఈవో మోహన్‌రావు వివరణ ఇస్తూ పీ4 పథకంపై ఎవరిపైనా ఒత్తిడి తెచ్చేది ఉండదన్నారు. ఎన్‌ఆర్ఐలు, ప్రజాప్రతినిధులు ఇందులో బాగస్వామ్యులు కావాలని ప్రభుత్వం కోరిందన్నారు. అంతే తప్పా జడ్పీటీసీలపై ఎలాంటి ఒత్తిడి తేవడం లేదని తెలిపారు. అనంతరం విద్య, స్త్రీ శిశు సంక్షేమం తదితర శాఖలపై సమీక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ

4 బంగారు కుటుంబాల దత్తత

● ఎంపీపీ దర్శిగుంట దాతృత్వం



ఎంపీపీ శశిరేఖను సన్మానిస్తున్న ప్రత్యేకాధికారి, కార్యాలయ సిబ్బంది

అల్లూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన పీ-4 కార్యక్రమంలో భాగంగా పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి దోహదపడే కార్యక్రమానికి అల్లూరు ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ ముందడుగు వేశారు. శనివారం ఆమె ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని 4 పేద కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఒక యువతి సేవా దృక్పదం కలిగి ఉండడాన్ని గుర్తించిన ప్రజలు ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాదికారి మృదుల, ఇన్‌చార్జి ఎంపీడీవో పెంచల వీరేంద్ర, కార్యాలయ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు.

అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోండి

● జేసీ కార్తీక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేసీ కార్తీక్, పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్లు, ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుని క్రమబద్ధీకరించుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శనివారం వింజమూరు ఎస్వీఎస్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) ఆధ్వర్యంలో జిల్లాలో తొలిసారిగా అధికారులు, యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బృహత్తర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. ఎల్ఆర్ఎస్‌లో లేఅవుట్ల యజమానులు చేరాలన్నారు. జూన్ 30వ తేదీకి ముందు వేసిన అనధికార లేఅవుట్లకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. అక్టోబరు 24వ తేదీలోపు సంబంధిత యజమానులు హక్కు, ప్లాన్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరణకు గతంలో 14 శాతం నగదును యజమానులు చెల్లించాల్సి ఉండేదని, దానిని రాష్ట్ర ప్రభుత్వం 7 శాతానికి కుదించినట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకోని వారి లేఅవుట్లను నిషేధిత భూముల జాబితాలో చేర్చడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం వింజమూరు పట్టణంలో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థ, సెంట్రల్ లైటింగ్ పనులను నుడా నిధులతో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో వంశీకృష్ణ, పలు శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, లేఅవుట్ల యజమానులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఫాప్టో నేతలు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నెల్లూరు(విద్య), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఫాప్టో నేతలు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం శనివారం నగరంలోని కలెక్టరేట్ ఎదుట ఫాప్టో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోచైర్మన్ మాసప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకో కపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యారంగ సమస్యలపై కాలయాపన చేస్తూ ఉపాధ్యాయులకు బోధనేతర భారాన్ని పెంచడం సరికాదన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు కూడా ఇవ్వకపోవడంతో ఆర్థిక పరమైన సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. రాష్ట్ర కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదన్నారు. రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు రావాల్సిన గ్రాడ్యుటీ, పెన్షన్, సరెండర్ లీవ్, డీఏ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసమస్యలను పరిష్కరించుకుంటే మరిన్ని ఉద్యమాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్‌లను తెలియచేస్తూ జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఫాప్టో డిప్యూటీ జనరల్ సెక్రటరీ శేషులు, హజరత్, రాష్ట్ర పరిశీలకులు పివి.రమణ, రమణయ్య, నేతలు పాల్గొన్నారు.